
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 27-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 326
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

కుల వ్యవస్థే కారణం!



ఆరోగ్యం, విద్య రంగాల్లో దేశం వెనుకంజ

పలు సామాజిక సూచికలలోనూ ఇదే పరిస్థితి

అభివృద్ధి పథంలో నేపాల్, బంగ్లా

న్యూఢిల్లీ: ఆరోగ్యం, విద్య వంటి కీలకమైన, ముఖ్యమైన రంగాలకు సంబంధించి పొరుగున ఉన్న నేపాల్, బంగ్లాదేశ్ కంటే భారత్ బాగా వెనుకబడి ఉంది. దీనికి కుల అసమానతలే ప్రధాన కారణమని సీనియర్ విశ్లేషకుడు స్వామినాథన్ ఎస్. అంక్లేసారియా అయ్యర్ తన రాబోయే పుస్తకం 'అసమానత : పొరుగు దేశాల కంటే భారత్ ఎందుకు వెనుకబడింది?'లో అభిప్రాయపడ్డారు. సామాజిక సూచికలైన జీవితకాలం, సంతానోత్పత్తి, శిశుమరణాలు, లింగ సమానత్వం వంటి అంశాల్లో నేపాల్, బంగ్లాదేశ్ కంటే మనం వెనుకబడి ఉన్నామని ఆయన తెలిపారు. స్వామినాథన్ పుస్తకానికి ప్రముఖ ఆర్థికవేత్త డీన్ డ్రెజ్ ముందుమాట రాశారు.

జీవితకాలం, శిశుమరణాలు, పారిశుధ్యం, పాఠశాల విద్య, లింగ సమానత్వం వంటి అంశాల్లో బంగ్లాదేశ్ మన దేశం కంటే ఎంతో ముందుంది. ఆయా విషయాల్లో రెండు దేశాల మధ్య వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. ఇది భారత్‌కు చాలా అవమానకరం. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వేతర సంస్థలు అద్భుతమైన, బలమైన పనితీరు కనబరుస్తున్నాయి. ముఖ్యంగా ప్రజారోగ్యం విషయంలో వాటి పాత్ర ప్రశంసనీయం. బంగ్లాదేశ్ తలసరి ఆదాయం కూడా మన దేశంతో సమానంగా ఉంది. నేపాల్‌లో మాత్రం తలసరి ఆదాయం భారత్‌తో పోలిస్తే సగం మాత్రమే ఉంది. అయినప్పటికీ ఆ దేశం ముందడుగు వేస్తోంది.

బీహార్‌లోనే అధికం

కుల ప్రభావం బాగా అధికంగా ఉన్న రాష్ట్రం బీహార్. అక్కడి తలసరి ఆదాయం, ఇతర సామాజిక సూచికల్లో ఇది కన్పిస్తుంది. ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది అగ్ర కులాల వారే. వారిలో చాలా మంది అట్టడుగు కులాల పిల్లల్ని చిన్నచూపు చూస్తుంటారు. వారికి చదువు చెప్పడం కూడా చాలా కష్టం. ఎందుకంటే వారి తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. ఇంటి వద్ద పుస్తకాలు ఉండవు. దీనికితోడు సిలబస్ సంక్లిష్టంగా ఉంటుంది. ప్రీ-స్కూల్ విద్య అందుబాటులో ఉండదు. ఇంటి వద్ద బోధించడానికి అధ్యాపకులు ఉండరు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు సంపన్నుల పిల్లల పైనే దృష్టి పెడతారు.



హిమాలయ రాష్ట్రాల్లో పరిస్థితి భిన్నం

నేపాల్ కూడా హిందువులు అధిక సంఖ్యలో నివసించే దేశమే. మరి అక్కడ కుల ప్రభావం ఎందుకు లేదు? ఎందుకంటే అక్కడ కుల వ్యవస్థ, సంస్కృతి భిన్నంగా ఉంటాయి. 1950లో నేపాల్ చాలా వెనుకబడి ఉంది. రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, విద్యుత్ సౌకర్యం వంటివి చాలా తక్కువగా ఉండేవి. అయినప్పటికీ ఆ దేశం మంచి పురోభివృద్ధి సాధిస్తోంది. హిమాలయ రాష్ట్రాలైన ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కింలో కూడా పరిస్థితి మెరుగ్గానే ఉంది. 2011 జనగణన ప్రకారం హిమాచల్ ప్రదేశ్ (82%), ఉత్తరాఖండ్ (79%), సిక్కిం (81%)లో అక్షరాస్యత అధికంగా ఉంది. దేశంలో అక్షరాస్యత రేటు (74%)తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ఉత్తరప్రదేశ్ (68%), బీహార్ (62%) రాష్ట్రాలు ఈ విషయంలో బాగా వెనుకబడ్డాయి.

కొండ ప్రాంతాల్లో పరిస్థితి ఎందుకు భిన్నంగా ఉంటోందంటే అక్కడ నివసించే గిరిజనుల్లో కుల వ్యవస్థ లేదు. ఈ ప్రాంతాల్లో 19వ శతాబ్దంలో మాత్రమే జనాభా పెరిగింది. అగ్ర కులాల స్వభావాలను అందిపుచ్చుకొని కుల నిచ్చెనను ఎక్కాలని వారు ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు కూడా. కొండ ప్రాంతాలకు వెళ్లిన అట్టడుగు కులాల వారు త్వరగానే బ్రాహ్మణులు, క్షత్రియులు అయ్యారు. అగ్ర కులాల నుండి వారికి వ్యతిరేకత ఎదురవలేదు. ఎందుకంటే ఆ ప్రాంతాల్లో అగ్ర కులాల మనుగడ చాలా కష్టం. ఇప్పుడు కొండ ప్రాంతాల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు కలిగిన పాఠశాలలు కన్పిస్తాయి. నేపాల్‌లో గిరిజనులు, అగ్ర కులాల వారు అధికంగా ఉంటారు. భారత్ కంటే వేగంగా అభివృద్ధి చెందడానికి ఇది కూడా ఓ కారణమే. మన దేశంలో ఇతర అసమానతలు కుల వివక్షతోనే ప్రారంభమయ్యాయి. విద్య, ప్రభుత్వ సేవల్లో కోటాలు అట్టడుగు వర్గాల్లో క్రిమిలేయర్‌కు దారితీశాయి. ఒక్క మాట మాత్రం నిజం. భారత్‌లో కుల వ్యవస్థ ఉన్నంత కాలం ఒక్కో దేశం మనల్ని అధిగమిస్తూ ముందుకు సాగుతూనే ఉంటుంది.



ఆరోగ్య సర్వే ఏం చెప్పింది?

జాతీయ ఆరోగ్య సర్వే-5 **(2019-21)** ప్రకారం దేశంలో పిల్లలు ఉండాల్సినంత బరువు లేరు. ఆరోగ్యపరంగా వారి కుంగిపోతున్నారు. **32%** మంది పిల్లలు తక్కువ బరువుతో బలహీనంగా కన్పిస్తున్నారు. **35%** మంది కుంగుబాటుకు గురవుతున్నారు. ఈ అంశాల్లో నేపాల్ **24%, 31.5%తో** మన కంటే మెరుగ్గా ఉంది. బంగ్లాదేశ్ అయితే **23%, 28%తో** మరింత మెరుగైన స్థితిలో కొనసాగుతోంది. నేపాల్ పొరుగునే ఉన్న బీహార్‌లో మాత్రం ఇవి **41%, 43%గా** ఉన్నాయి. అనేక ఇతర ఆరోగ్య, విద్య సూచికల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అసమానతల వ్యత్యాసాన్ని కుల రక్కసి మరింత పెంచుతోంది. కుల వ్యవస్థే మన దేశాన్ని సమస్యల వలయంలోకి నెడుతోంది. ఆదాయం, లింగం, ప్రాంతం, భాష, చారిత్రక ప్రయోజనం వంటి అంశాల్లో అసమానతలకు కులమే ప్రధాన కారణం అవుతోంది. సంపన్న కులాల వారు మరింత అభివృద్ధి సాధిస్తుంటే దిగువ కులాలు విద్య, ఆరోగ్యం వంటి కనీస సౌకర్యాలకు సైతం నోచుకోలేకపోతున్నారు. భారత్‌లోని సంపన్న వర్గం వారు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ప్రపంచ శక్తిగా ఆవతరిస్తే దిగువ కులాల వారు బాగా వెనుకబడి పోయారు.

ఎడమ కుడి అయితే..పొరపాటే

- కొంప ముంచనున్న పైపై ప్రచారం
- 50 ఏండ్లు దాటినవారి ఓట్లు క్రాస్ అయ్యే ప్రమాదం
- ఈవీఎంలపై అవగాహనలేమితో నష్టమే
- అభ్యర్థులను టెన్షన్ పెట్టిస్తున్న వైనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కుడి..ఎడమైతే పొరపాటు లేదోయ్..' పాటను కాస్తా ఈ ఎన్నికలకు అన్వయించుకుంటే...'ఎడమ..కుడి అయితే.. ఎన్నికల్లో ఓడిపోవాల్సిందేనోయ్..' అని అభ్యర్థులు పాడుకోవాల్సిన ప్రమాదం పొంచి ఉంది. ఈవీఎంలలో ఓట్లు వేసే ప్రక్రియపై సరైన అవగాహన కల్పించకపోవడం అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా 50 ఏండ్లు నిండిన వారి నుంచే ఓట్లు ఎక్కువగా క్రాస్ అయ్యే అవకాశముంది. ఇప్పటికైనా పోయిందేమీ లేదు..చివరి రెండు రోజుల్లోనే ఓటింగ్ చేసే విధానంపై ఆయా పార్టీల వాళ్లు వివరణాత్మకంగా చెప్పాల్సిందే. లేదంటే నష్టపోవాల్సిందే. ఓటమిని ఎదుర్కోవాల్సిందే. ఆయా పార్టీల అభ్యర్థుల తరపున ఎన్నికల్లో ప్రచారం చేసేవాళ్లు ఎంతసేపు ఉన్నా అభ్యర్థులు ఈవీఎం బాక్సులో తమ సీరియల్ చెప్పి తమ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను ప్రాధేయపడుతూ అంతవరకే పరిమితం అవుతున్నారు. కానీ, అంతిమంగా ఓట్లేసే సమయంలో ఇదే అభ్యర్థుల కొంప ముంచే ప్రమాదముంది. మునుగోడు ఉప ఎన్నికలో నాలుగైదు గ్రామాల్లో ఇదే పరిస్థితి తలెత్తింది. రెండో గుర్తుగా ఉన్న కారు గుర్తుకు ఓటేయాలని విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా పోలింగ్ రోజు ఓటు వేసే సమయంలో వృద్ధులు కొంత గందరగోళానికి గురై కుడివైపు నుంచి ఉన్న తొలి ఈవీఎంలోని రెండో గుర్తుకు కొందరు ఓటు వేశారు. మరికొందరు ఆ ఈవీఎంలో కారును పోలి ఉన్న గుర్తులపై ఓటేసిపోయారు. ఇలా వెళ్లి అలా చివర్లోనే ఓటేసి వస్తుండటంపై ఏజెంట్లు ఆందోళనకు గురై సమాచారానికి తమ పార్టీ నేతలకు ఉప్పందించారు. దీంతో అప్పుడు అలర్ట్ అయి వృద్ధులు, కంటిచూపు సరిగా లేనివారితో పాటు గందరగోళానికి గురయ్యే వారికి గుర్తుపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఎడమవైపు నుంచి మొదటి ఈవీఎంలోని రెండో గుర్తుగా ఉన్న తమ పార్టీ సింబల్‌పై ఓటేయాలని సూచించారు. ఆ తర్వాత ఇండిపెండెంట్లకు, కారును పోలి ఉన్న గుర్తులకు ఓట్లు పడటం తక్కువైపోయింది. ఈ ఎన్నికల్లోనూ రెండు కంటే ఎక్కువ ఈవీఎంలు(16 మంది అభ్యర్థుల కంటే ఎక్కువ పోటీలో ఉండటం) ఉన్న చోట ఇలాంటి పరిస్థితే ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయి. ఎంతసేపూ ఒకపేపర్ పట్టుకుని తమ అభ్యర్థి సీరియల్ నెంబర్, సింబల్ ముద్రించి దాన్నే చూపుతున్నారు. ఇలా కాకుండా నమూనా ఈవీఎంలతో ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. ముఖ్యంగా వృద్ధులు, పాక్షిక దృష్టిలోపం గలవారు, గందరగోళానికి గురయ్యేవారికి మరింత విడమర్చి చెప్పాల్సిన బాధ్యత ఆయా పార్టీల అభ్యర్థులపై ఉంది. అదే సమయంలో తమ ఓటు ఏ గుర్తుపై పడిందో చూసుకునే విధానంపైనా ఓటర్లకు అవగాహన కల్పించాలి. లేకపోతే వారి ఓట్లు ఇండిపెండెంట్‌లు, ఇతర పార్టీల అభ్యర్థులకు పడే ప్రమాదం పొంచి ఉంది తస్మాత్ జాగ్రత్త. పోలింగ్‌కు మూడు రోజుల సమయమే ఉంది కాబట్టి ఓటింగ్ ప్రక్రియపై అభ్యర్థులు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

29న దీక్షా దివస్..

- జయప్రదం చేయండి... :

బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి కేటీఆర్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ నిరాహారదీక్ష చేపట్టిన రోజైన నవంబరు 29 యావత్ రాష్ట్రానికి ప్రత్యేకమైన రోజని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. ఆయన పోరాటంతోనే కేంద్రం దిగొచ్చి... ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, సీనియర్ నేత దాసోజు శ్రావణ్ తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. బుధవారం సేవా కార్యక్రమాలను చేపట్టాలనీ, ఇండ్లపై బీఆర్ఎస్ జెండాలు ఎగరేయాలని సూచించారు. రైతుబంధుకు ఈనెలాఖరులో నిధులను విడుదల చేస్తున్న క్రమంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి... ఎందుకు ఉలికి పడుతున్నారంటూ ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. రైతు బంధు గురించి ప్రశ్నిస్తున్న రేవంత్... కేంద్ర పథకమైన పీఎం కిసాన్ సమ్మాన్ యోజన గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో బీజేపీతో ఆయనకు లోపాయికారీ ఒప్పందముందని విమర్శించారు. గోషామహల్, కరీంనగర్, కోరుట్ల స్థానాల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను ఎందుకు నిలబెట్టిందని ప్రశ్నించారు. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్... రైతాంగానికి రోజుకు ఐదు గంటల కరెంటే చాలని అంటున్నారు.. రేవంతేమో మూడు గంటల కరెంటే చాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ... కర్నాటకలో రెండున్నర లక్షల ఉద్యోగాలిస్తామన్న ఆ పార్టీ హామీ గురించి ఏం చెబుతారని అన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చిన రాష్ట్రం దేశంలో ఎక్కడైనా ఉందా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనే సత్తా ఒక్క బీజేపీకే ఉందని కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

రాజ్యాంగంపై సోషల్ ఆడిట్ జరగాలి

- తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై : రాజ్యాంగంపై సోషల్ ఆడిట్ జరగాలని, దానికి ఇదే సరైన సమయమని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తెలిపారు. దేశ రాజ్యాంగాన్ని కేవలం ఒక లీగల్ డాక్యుమెంట్ లేదా చట్టపరమైన వ్యక్తుల విశేషాధికారం అనుకునే స్థాయికి తగ్గించకూడదని గవర్నర్ అన్నారు. 'రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత వరకూ నెరవేర్చింది.

ఎందుకు నెరవేర్చలేకపోయింది. దీనిని తనిఖీ చేయడానికి సోషల్ ఆడిట్ జరగాలి' అని గవర్నర్ తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్శిటీ వద్ద జరిగిన ఒకరోజు కన్సార్టియంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం రూపకల్పనకు దాని నిర్మాతలు ఎంతో కష్టపడ్డారని, ఈ విషయంలో అంబేద్కర్ సారథ్యంలోని రాజ్యాంగ పరిషత్‌కు కృతజ్ఞులమై ఉండాలని చెప్పారు. అయితే ఇది సంపూర్ణ పత్రం కాదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. రవి చేసిన వ్యాఖ్యలను పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి నారాయణ స్వామి తప్పుబట్టారు.

భూబకాసురులను తరిమికొట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలో రోడ్ షో నిర్వహించారు. కళాకారుల ఆటపాటలు, నృత్యాలతో ర్యాలీ భారీగా సాగింది. అనంతరం సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో బృందాకారత్ ప్రసంగించారు. ప్రధాని మోడీ అదానీ, అంబానీలకు గులాంగిరీ చేస్తూ.. రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తూ.. పేదల సంపదను దోచిపెడుతున్న రాజకీయ పార్టీలను మట్టికరిపించేందుకు ప్రజలు రాజకీయ చైతన్యంతో ఆలోచించి.. తమ హక్కులను కాపాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను చట్ట సభలకు పంపించాలని కోరారు.

ఈ ప్రాంతంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న నాయకులు భూ దోపిడీకి పాల్పడ్డారు తప్ప.. ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. కమ్యూనిస్టులు పేదలకు పంచిన అసైన్డ్ భూములను లాక్కోవడం తప్ప వాటికి పట్టాలు ఇచ్చింది లేదన్నారు. 'ఫార్మాసిటీకి కేటాయించిన భూములు ఎవరివి.. ఆ భూములపై ఎవరికి హక్కు ఉంది' అని బృందాకారత్ ప్రజలను అడగ్గా.. 'ఆ భూములు మావి.. మా వద్ద బలవంతంగా లాక్కొన్నారు' అని ప్రజలు బదులిచ్చారు. ఎన్నో ఎండ్లుగా సాగు చేసుకుంటున్న పేదల పొట్టకొట్టిన ఈ పాలకులను ఓడించాలని బృందాకారత్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. నిరుద్యోగ సమస్యలను గాలి వదిలిందన్నారు. ఈ ప్రాంత రైతులకు సాగు నీరు ఇవ్వలేదన్నారు. తాగు నీటి సమస్యలు అట్లే ఉన్నాయన్నారు. రెండు సార్లు కేసీఆర్ ప్రజలను మోసం చేశారని చెప్పారు. మరోసారి మాయ మాటలతో ప్రజల ముందుకు వస్తున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండి సరైన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉంటారో పోతారో వారికే గ్యారంటీ లేదు.. ఆరు గ్యారంటీలు అమలుకు ఏంటీ గ్యారంటని ప్రశ్నించారు. ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా పోరాటం చేస్తుంటే.. కాంగ్రెస్ ఇన్నాళ్లు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు.

ఎర్రజెండా దళిత, గిరిజన, అసైన్డ్, పోడు భూముల కోసం నిర్విరామ పోరాటం చేసిందన్నారు. ప్రజల గొంతుకగా అసెంబ్లీలో ఎర్రజెండాను నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు భూపాల్, జయలక్ష్మి, ధర్మానాయక్, జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు సామెల్, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్, కవిత, రాజు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం

- వ్యక్తి సజీవ దహనం

నవతెలంగాణ- ఆదిభట్ల

ఓఆర్ఆర్‌పై ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగి వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ఆదిభట్ల సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన బడుగుల వెంకటేష్(25) కారులో హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆదిభట్ల శ్రీ శ్రీ ఏరోసిటీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఎగ్జిట్ నెం.12 అండ్ 13 మధ్య ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో కారులో మంటలు చెలరేగాయి.

సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

బలగాలనూ మోహరించినట్టు తెలిపారు. ఎన్నికల తనిఖీల సందర్భంగా ఇప్పటి వరకు రూ.709 కోట్లకు పైగా సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. 119 నియోజకవర్గాల్లో మొత్తం 2,290 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వారిలో పురుషులు 2,068 మంది, మహిళలు 221 మంది, ఒక్క ట్రాన్స్‌జెండర్ ఉన్నారని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 1,68,612 మంది సిబ్బందికి ఫెలిసిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్లు జారీ చేశామన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 1,00,135 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా, ఈసారి వాటి సంఖ్య మరింత పెరిగిందన్నారు. 49 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, 31 జిల్లాల్లో ఒక్కో కౌంటింగ్ సెంటర్, రంగారెడ్డి జిల్లాలో నాలుగు, హైదరాబాద్‌లో 14 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 45వేల మంది రాష్ట్ర పోలీసులు, మూడువేల మంది ఎక్సైజ్ సహా ఇతర శాఖల సిబ్బంది, టీఎస్ఎస్పీ నుంచి 50 కంపెనీలు, 375 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఎన్నికల బందోబస్తులో పాల్గొంటాయని తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి 23,500 మంది హోంగార్డుల్ని కూడా రప్పిస్తున్నామనీ, 1,866 స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద 1,020 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. మంత్రి కే తారకరామారావుకు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులకు ఇంకా సమాధానం తమకు అందలేదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 21,686 వీల్‌చైర్లు ఏర్పాటు చేశామనీ, బ్రెయిలీలో 76,532 ఓటర్ల స్లిప్పులు ముద్రించామన్నారు. తమకు వస్తున్న ఫిర్యాదులపై సాధ్యమైనంత వేగంగా స్పందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో అడిషనల్ సీఈఓ లోకేష్‌కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయప్రక్రియ వేగవంతానికి ఒక మార్గం

- పోటీతత్వం, పారదర్శకమైన ప్రక్రియకు ఏఐజెఎస్ వెసులుబాటు : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- కోర్టుకు వెళ్లడానికి భయపడొద్దు : సీజేఐ డివై చంద్రచూడ్



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీస్ (ఏఐజెఎస్) రూపకల్పన న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఒక మార్గమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఇది ప్రతిభ, పోటీతత్వం, పారదర్శకమైన ప్రక్రియ ద్వారా న్యాయమూర్తులను నియమించే వ్యవస్థను రూపొందించడమే అవుతుందని అన్నారు. ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీస్ (ఏఐజెఎస్)ను ఏర్పాటు చేయాలని అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీం కోర్టు ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "రాజ్యాంగంలో న్యాయవ్యవస్థకు ఉన్న ప్రాముఖ్యత అద్వితీయమైంది. బెంచ్ అండ్ బార్ లో అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తే సరైన న్యాయం అందించడం సాధ్యమవుతుంది. ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీస్‌ను ఏర్పాటు చేయడం మరింత మెరుగైన న్యాయాన్ని అందించేందుకు తోడ్పడుతుంది. అంతేకాకుండా దీన్ని ఏర్పాటు చేసి అన్ని వర్గాలకు చెందిన యువతకు అవకాశం కల్పించవచ్చు. ప్రతిభావంతమైన యువతను దీనికి ఎంపిక చేసి న్యాయమూర్తులుగా తీర్చి దిద్దవచ్చు. ఇది కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు వారి ప్రతిభను పెంపొందించగలదు" అని ముర్ము సూచించారు.

'ప్రజల కోర్టు'గా సుప్రీం కోర్టు: డివై చంద్రచూడ్

గత ఏడు దశాబ్దాల్లో భారత సుప్రీం కోర్టు 'ప్రజల కోర్టు'గా వ్యవహరించిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు. ప్రజలు కోర్టుకు వెళ్లడానికి ఏమాత్రం భయపడొద్దని సూచించారు. వ్యవస్థాపిత ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రక్రియల ద్వారా రాజకీయ వైరుధ్యాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పిస్తోందని అన్నారు. అదే తరహాలో అనేక భేదాభిప్రాయాలను పరిష్కరించేందుకు న్యాయ వ్యవస్థ సహాయపడుతుందని తెలిపారు. గత 70 ఏండ్లలో వేల మంది పౌరులు సుప్రీం కోర్టు తలుపుతట్టారని గుర్తుచేశారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతోనే వారు ఈ అత్యున్నత వ్యవస్థను ఆశ్రయించారని తెలిపారు. అక్రమ అరెస్టుల్లో జవాబుదారీతనం, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ, నిర్బంధ కార్మికుల హక్కులు, సామాజిక రుగ్మతల నిర్మూలన, గిరిజన భూముల హక్కులు.. ఇలా వివిధ అంశాల కోసం సామాన్య పౌరులు కోర్టును ఆశ్రయించారని చంద్రచూడ్ వివరించారు. ఈ ఉదంతాలన్నీ కేవలం కోర్టు గణాంకాల్లో సమాచారం మాత్రమే కాదన్నారు. సుప్రీంకోర్టుపై ప్రజలకు ఉన్న అంచనాలను ఇవి ప్రతిబింబిస్తాయని వివరించారు. తీర్పుల ద్వారా న్యాయాన్ని అందించడమే కాకుండా.. పౌర కేంద్రీకృత విధానాల రూపకల్పనకూ సుప్రీంకోర్టు నిరంతరం కృషి చేస్తోందని చంద్రచూడ్ వివరించారు. ఫలితంగా కోర్టు, ప్రజల మధ్య అనుసంధానం పెరిగేలా చూస్తున్నామన్నారు. ప్రజలు కోర్టుకు వెళ్లడానికి ఏ మాత్రం జంకొద్దని, అలాగే చివరి ప్రయత్నంగానూ భావించొద్దని సూచించారు. తమ హక్కులను రక్షించుకోవడానికి ఇదే సరైన వేదికని ప్రజలు భావించేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘవాల్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 27-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 326
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50



భూబకాసురులను తరిమికొట్టాలి

- ఇబ్రహీంపట్నం గడ్డపై సీపీఐ(ఎం) నిలవాలి
- అదానీ, అంబానీలకు మోడీ గులాంగిరీ
- కేసీఆర్ ప్రజలను మోసం చేశారు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే గ్యారెంటీ లేదు.. ఆరు గ్యారెంటీలకు దిక్కెవరు..?
- పేదల జెండా.. ఎర్రజెండాకు అండగా ఉండండి: పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్
- పగడాల యాదయ్య గెలుపును కాంక్షిస్తూ రోడ్ షో
- భారీగా తరలి వచ్చిన ప్రజానీకం

నవతెలంగాణ -రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

"రైతాంగ సాయుధ పోరాటం సాగిన నేల.. దేశంలో భూ సంస్కరణలకు కారణమైన పోరాట గడ్డపై సీపీఐ(ఎం) జెండా ఎగరాలి.. ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని భూ బకాసురులను తరిమికొట్టాలి" అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ...2లో



విప్లవచరిత్రను మరవొద్దు

సాయుధపోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులకు ఓటేయండి : సీతారాం ఏచూరి పిలుపు

- యాదాద్రి-భువనగిరిలో భారీ రోడ్డుషో
- వేలాది మంది హాజరు
- అంబేద్కర్ చౌరస్తా అరుణార్ణవం
- భువనగరి,మునుగోడు, నకిరేకల్ అభ్యర్థుల ప్రచారం

వివరాలు 7లో

త్యాగాలు చేసిన వారిని అసెంబ్లీకి పంపాలి

- సంక్షేమపథకాలన్నీ కమ్యూనిస్టుల పోరాట ఫలితాలే : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

వివరాలు 7లో

ఊరూరా ఎర్రజెండా..

- రోడ్ షోలు, బైక్ ర్యాలీలు, బహిరంగ సభలతో హోరెత్తుతున్న ప్రచారం
- అగ్రనేతల సుడిగాలి పర్యటనలతో కామ్రేడ్లలో ఫుల్ జోష్

కదం తొక్కిన కష్టజీవులు

'అంగబలం, అర్థబలం, మందీ మార్బలమున్న ధనస్వామ్యం వైపా..? ప్రజల కోసం, దేశం కోసం నికరంగా పోరాడే ఎర్రజెండా వైపా..?' అంటూ కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రశ్నల కొడవళ్లై ఊరూరా కదం తొక్కుతున్నారు. సుత్తీ కొడవలి నక్షత్రం గుర్తుకే ఓటేయాలంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కష్టజీవులు వారితో గొంతు కలుపుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి వివిధ నియోజకవర్గాల్లో సీపీఐ (ఎం) నిర్వహిస్తున్న రోడ్ షోలు, బైక్ ర్యాలీలు, బహిరంగ సభలు, సమ్మేళనాలకు శ్రామిక ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. సీపీఐ (ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాణిక్ సర్కార్, బృందా కరత్, సుభాషిణీ అలీ, బీవీ రాఘవులు, మాజీ ఎంపీ పి.మధు తదితర అగ్రనేతలు పార్టీ పోటీ చేస్తున్న 19 నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటలను చేస్తూ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారు. విలువలను వలువలుగా విసిరి పారేస్తున్న బూర్జువా పార్టీల తీరు తెన్నులను ఉదాహరణలతో వివరిస్తూ ఓటరన్నను జాగృతం చేస్తున్నారు. వారి ఉత్తేజభరిత ప్రసంగాలతో 'ఒరేయ్ బిడ్డా.. ఇది పోరాటాల తెలంగాణ గడ్డ... సీపీఐ (ఎం) జిందాబాద్.. ఎర్రజెండా వర్థిల్లాలి...' అంటూ జనం ఎర్రజెండాకు నీరాజనాలు పలుకుతున్నారు.

బీజేపీని ఓడించండి

సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి: తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న 19 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులను ఓడించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేండ్ల అనుభవం చూసిన తర్వాత శాసనసభలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరిగిందని తెలిపారు. డబ్బు, మద్యం పెద్దఎత్తున ప్రవహిస్తున్న ఈ పరిస్థితుల్లో ప్రజలు సీపీఐ(ఎం)ను ఆదరించాలనీ, ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కోరారు. వారు మాత్రమే శాసనసభను ప్రజా సమస్యలమీద చర్చించటానికి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి, ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఒక వేదికగా వినియోగిస్తారని తెలిపారు. ఇతర పార్టీలకు ఇవి పట్టవని విమర్శించారు. స్వార్థ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలే వారికి ముఖ్యమని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులు లేని శాసనసభలో అధికార, ప్రతిపక్షాలనే తేడా లేదని తెలిపారు. పరస్పర నిందలు తప్ప ప్రజా ప్రయోజనాల గురించి పట్టించుకోలేదని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు లేని ఈ లోటును ఈ ఎన్నికల సందర్భంగా పూడ్చటం అవసరమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓట్ల కోసం బీజేపీ నాయకత్వం మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు.

కులాన్ని, మతాన్ని పాచికగా ప్రయోగిస్తున్నదని పేర్కొన్నారు. కేంద్రంలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల దృష్టిని మళ్ళించేందుకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క సీటులో కూడా బీజేపీ గెలవకుండా ప్రజలు విజ్ఞతను ప్రదర్శించాలని కోరారు. ఆ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో దాన్ని ఓడించగల పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలో సీపీఐ, పినపాకలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, శేర్‌లింగంపల్లిలో ఎంసీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మిగిలిన స్థానాల్లో ఎవరిని బలపరచాలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీలు తగు నిర్ణయం తీసుకుని, ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక, పోరాట శక్తులకు మద్దతిస్తాయని తెలిపారు.



భువనగిరిలో అశేష జనవాహిని...



ముషీరాబాద్ బైక్‌ర్యాలీలో ఎర్రసైన్యం...

మోడీ విధానాలను తిప్పికొడదాం

- దేశవ్యాప్తంగా మహాపడావ్.. గొంతెత్తిన కార్మిక, కర్షకలోకం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా మహాపడావ్ నిర్వహించారు. మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం), వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన మహా పడావ్ ఆదివారం రాష్ట్ర రాజధానుల్లో రాజ్ భవన్ల ముందు ప్రారంభమైంది. దేశమంతటా ఆయా రాష్ట్రాలకు చెందిన రైతులు, కార్మికులు ముఖ్యంగా మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో భాగస్వాములయ్యారు. నేడు, రేపు (సోమవారం, మంగళవారం) కూడా మహాపడావ్ కొనసాగనుంది.. ఎస్కే ఎం, ...7లో

సర్వం సిద్ధం

- పూర్తయిన ఎన్నికల ఏర్పాట్లు
- 29న పోలింగ్ స్టేషన్లకు సామాగ్రి తరలింపు
- ఎన్నికల నిర్వహణలో 2 లక్షల మంది సిబ్బంది : సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. 28వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఎన్నికల సామాగ్రి చేరుతుందనీ, అక్కడి నుంచి 29న పోలింగ్ కేంద్రాలకు ఈవీఎమ్‌లు, ఇతర ఎన్నికల సామాగ్రిని తరలిస్తామన్నారు. ఈవీఎమ్‌ల తనిఖీలు ఈనెల 24, 25 తేదీల్లో పూర్తయ్యాయని ఆదివారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఎన్నికల నిర్వహణకు రెండు లక్షల 8 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారనీ, 12వేల పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామనీ, శాంతియుత నిర్వహణ కోసం ఆయా ప్రాంతాల్లో కేంద్ర ...2లో



ఆరు గ్యారంటీలు చూసి
మోసపోవద్దు

50 ఏండ్ల దారిద్ర్యాన్ని పదేండ్లలో పోగొట్టాం

- ఇందిరమ్మ రాజ్యంలో ఏవర్గమూ బాగుపడలేదు
- కేరళ మాదిరి పూర్తి అక్షరాస్యత రాష్ట్రంగా మార్చుచేయాలి
- ప్రజాస్వామ్య పరిణితితో ఆలోచించి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి : ప్రజాఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / జగిత్యాల / వేములవాడ/దుబ్బాక/ఖానాపూర్

"కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమంతో 50ఏండ్ల కాంగ్రెస్ పాలనా దారిద్ర్యాన్ని పదేండ్లలో పోగొట్టుకున్నాం. మళ్లీ వాళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెబుతున్నారు. ఆ రాజ్యంలో ఏ వర్గమూ బాగుపడలేదు" అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఈ ఎన్నికల్లో మాయమాటలు చెబుతూ వస్తున్న వారిని ప్రజాస్వామ్య పరిణితితో ఆలోచించి తిప్పికొట్టాలని, ...5లో



లిక్కర్ కుటుంబాన్ని జైలుకు పంపుతాం

కేసీఆర్‌కు విశ్రాంతి ఇవ్వండి

- గజ్వేల్‌లో ఓడిపోతాననే మరోచోటకు కేసీఆర్ : తూప్రాన్, నిర్మల్ విజయ్‌సంకల్ప్ సభల్లో ప్రదాని మోడీ

వివరాలు 7లో

డిసెంబర్ 2న అఖిలపక్ష సమావేశం

- ఎన్నికల ఫలితాలకు ఒక రోజు ముందు..
- డిసెంబర్ 4 నుంచి 22 వరకు పార్లమెంట్...



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా డిసెంబర్ 2న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు ...7లో

మోడీ, కేసీఆర్‌లను ఓడించాలి

ప్రజల స్వప్నం సాకారం కావాలి..

- కాంగ్రెస్‌తోనే అది సాధ్యం : బహిరంగ సభల్లో రాహుల్

నవతెలంగాణ-జోగిపేట, సంగారెడ్డి, కామారెడ్డి

కుటుంబ పాలనలో బానిస బతుకులకు చరమగీతం పాడి, గడీల కోటలను బద్దలు కొట్టి తెలంగాణ ప్రజల స్వప్నం సాకారం చేయబోతున్నట్టు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటే అనీ.. కేంద్రంలో ...7లో



ఆలోచన



హిమశిఖరం లా నిను నిలిపేది...
స్వర చరణంలా నిను నడిపేది....
నీ ఆలోచనా కిరణమే...
నీ ఆచరణాత్మక గమనమే....
వేకువ కొమ్మకు పూచిన
విశ్వాస సుమ పరిమళాలను
ఆస్వాదించు..
ప్రభాత రథం పై కొలువుదీరి
కళలు పంచే సూర్య ప్రతాపాన్ని ధరించు...
హరిత వేణు లయల సరిగమలుగా సాగే
అవని నయన తేజాన్ని ఎదన నిలుపు...
ఉదయ నది గలగలల మధురిమలకు
శతి కలిపే విపంచి ధ్వనిని ఆలకించు...
నిరాశా మేఘాల నీరస భావనా పద ధునులు కాదు
వినవలిసింది...
అడుగడుగున ఆటంకపు కంటకాలు
ఎదురవుతున్నా
తీరం చేరాలను ఆరాటంతో రెక్కలుతొడుక్కునే ఆశల
కెరటంలా ఆకసాన్ని తాకు..
ఈ ధరణి పై నీ జన్మ, ఓటమికి కుంగిపోవడానికి
అపజయాలకు వెన్ను చూపడానికి కాదు....
ఆకసాలకు ఎగిరే రెక్కలు నీలో దాగి ఉన్నాయని మరువకు..
పాకడం కాదు.పిడికిలి బిగించి ఊపిరి పీల్చి ఆకసాల్ని
దాటు...

- వెల్మల జయపాల్ రెడ్డి, 9441168976

ఓటరు భాష్యం

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
సందుల్లో, గొందుల్లో
ఏమది?
అదే,
ప్రచార పాటల హోరు!
నేతల జీవన ఘోష!

ఎంత ప్రచారం చేసినా
నేతలకి తీరిక దక్కదు.
ఓటరు ఆంతర్యం చిక్కదు!

మెర్క్యూరీ నవ్వుల నేతలు!
పాదరసం నడకల
కార్యకర్తలు!

ప్రచార పథంలో,
కొందరికి రెండు కాళ్లు
మరికొందరికి మూడు కాళ్లు
ఉన్నవాళ్లకి నాలుగుకాళ్లు!

అన్ని పక్కలా
సారించాలి మన చూపులు !
పొంచి ఉన్నాయి
ఓటుకు గాలం వేసే వలలు!

ఇది ఎన్నికల
వెరైటీ మేనిఫెస్టోల
ప్రచారాస్త్రం!

ప్రజాస్వామ్య పీఠం పై
ఓటరే మహారాజు!
ఓటు తిరుగులేని
బ్రహ్మాస్త్రం!!

(అలిశెట్టి ప్రభాకర్ నగర గీతం కవిత ప్రేరణతో...)

- కమలేకర్ శ్యాంప్రసాద్ రావు, 9441076632

మూలవాసులం

నేడు ప్రజలు లేని దేశంలో
నిన్నటిదాకా మేము దేశంలేని మనుషులం

పగతో కురిసిన బాంబుల వర్షంలో
పూర్తిగా తడిసిన మాంసం ముద్దలం
ఇప్పుడు రక్తం మా దేహంలో తప్ప
అంతటా స్వేచ్ఛగా ప్రవహిస్తోంది

కరెంటుకు తాగునీటికే కాదు
ఇక్కడ కన్నీటికీ అవకాశం లేదు

నిలువెల్లా గాయాలపుండైన శరీరంలోంచి
బయటపడిన ఎముకలగూడులా
అనంత శిథిలాలమధ్య అక్కడక్కడా
నగ్నంగా నిలబడిన బంగళాలు

గుడ్లుపీకేసిన కంటి బొరియల్లా
ధ్వంసమైన రక్షణ బంకర్లు

శరణార్థి శిబిరాలను కూడా వదలని
క్షిపణుల రాజ్యకాంక్షను ఎవరు చల్లార్చగలరు?

తెగిపడిన కాళ్ళూ చేతులు
సగం కాలిన మొండాలు
ఛిద్రమైన పిల్లలదేహాలు
ఏవీ బతికున్నవాళ్ళ లెక్క తేల్చడంలేదు

కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ప్రాణాలకు
ఆవిరైపోయిన ఆశతో వెతికేవారికి మధ్య
అంతకంతకు పెరుగుతున్న అగాధం

అటువైపు జరిగిన ఉత్పాతానికి
ఇటువైపు జరుగుతున్న ఉన్మాదమే
సమాధానమని సమాధానపడుతున్న
సంకుచిత ప్రపంచం
మా ఆత్మగౌరవానికి ఆక్సిజన్ లాగేసింది

నీ తరువాతి దాడిలో కూడా బలయ్యేది
మరికొన్ని శాంతి పావురాలేనని మర్చిపోకు

నిన్ను నాదేశంలోకి అనుమతించి
ఆనక నాఅస్తిత్వాన్ని నీకే అప్పగించి
అనాథల్లా మిగిలిపోయిన మేమంతా
మీరెవరు గుర్తించకపోయినా సరే
ఇక్కడి మూలవాసులమని గుర్తుపెట్టుకోండి

నన్ను నన్నుగా ప్రకటించుకోనీయక
నిలువనీడ లేకుండాచేసిన వాళ్ళప్రక్కన
నిస్సిగ్గుగా నిలబడుతున్న రాజ్యాలుమాత్రం
ఈ యుద్ధభూమికి జవాబు బాకీపడ్డాయి

- పెనుగొండ బసవేశ్వర్, 9441159615

జానపద గేయాల్లో పుట్టిల్లు

> **"దేశీయతా ముద్ర ప్రగాఢంగా వున్న యేవో కొన్ని తావుల్లో తప్ప, ఆంధ్ర సాహిత్య వీధుల్లో సగటు మనిషి ఇంచుమించుగా మనకు కన్పించడు. ఇక అతని రుచులూ అభిరుచులూ, ఆశలూ ఆశయాలూ మున్నగు వాటి ముచ్చట కలలోని వార్త". జానపద విద్వాంసులు ఆచార్య తూమాటి దొణప్ప ఈ అంచనా అక్షరాలా నిజమే. మామూలు మడిసి స్వరూప స్వభావాల్ని తెలుసుకోవాలంటే మనం జాపద సాహిత్యం వైపే దృష్టి మళ్లించాలి. పొట్టపొడిస్తే అక్షరం ముక్క కనపడని పల్లె ప్రజల గుండె లోతుల్లోంచి ఉబికి వచ్చిన మాటల వూపూ, పాటల తీపూ చూసి తీరవలసిందే, పరవశించవలసిందే మరి.**

జానపద సంస్కృతికి ఆటపట్టులైన పుట్టిల్లు, అత్తవారిల్లు గురించి కొంత తెలుసుకుందాం. జానపద గేయ సాహిత్యంలో అత్తగారిల్లు చోటు చేసుకున్నంతగా, పుట్టిల్లు ఆ పుణ్యం చేసుకోలేకపోయింది. అయినా స్త్రీ జీవితంలో బాల్య, యౌవ్వనాలు పుట్టింట్లోనే సాధారణంగా, తియ్యగా గడుస్తాయి కనుక దాని గొప్ప దానిది. వెలుగు చీకట్లలా పుట్టిల్లు, అత్తిల్లు జీవితంలో పడుగూ పేకల్లా అమరి వుండడం సర్వసాధారణం.

పుట్టింటిని తల్చుకుంటే చాలు, ఏ స్త్రీకైనా సరే కడుపు చల్లపడుతుంది. కళ్లు చెమరుస్తాయి. ఆమె కళ్లముందు చిన్న నాటి ఆటపాటలు, పండుగలు, పబ్బాలు, సరసాలు, విరసాలు సినిమా రీళ్లలా గిర్రున తిరిగి ఆమె మనసు ఆనందంతో నిండిపోతుంది.

పుట్టింటి కళాకాంతుల గురించి కర్నాటక లంబాడీల భాషలో ఓ సామెత ఇలా వుంది...

"బాపే బనా ఘర్ సునో/ మాయే బనా చూలా సూనో/ భేనే బనా ఆంగణ సూనో"

(తండ్రి లేకపోతే ఇల్లు బోసిపోయి వుంటుంది. తల్లి లేకపోతే పొయ్యిలో నిప్పుండదు. అక్కచెల్లెళ్లు లేకపోతే ఆటపాటలు సున్న)

పుట్టిల్లు అమ్మానాన్నలతో, అన్నాతమ్ములతో, అక్కచెల్లెళ్లతో ఎప్పుడూ కళకళలాడుతూ వుండాలని పల్లెపడుచు కోరుకుంటుంది.

పుట్టిల్లు పూరిల్లైనా సరే, అది ఆడపిల్లకు రాజభవనమే. అందచందాలు వొలికే బృందావనమే. అందుకనే కర్నాటకలోని ఓ లంబాడీ స్త్రీ తన అన్నతోనో, తమ్ముడితోనో ఇలా అంటుంది...

"ఛూట్ మత్ జయేసీ హవేలీ/ మారేజ్ నాయర్ బాపురీ హేవలీ/ తారేజ్ రాజేమా ఆచోజ్ ఖాది/ ఆచోజ్ పీది హవేలీ అహీంయా"

(మా నాన్నగారి రాజభవనం నాకు దూరం కారాదు. నీ రాజ్యంలో కడుపు నిండా తిన్నాను, తాగాను)

తెలుగు జానపద స్త్రీ కూడా పుట్టింటిని పదే పదే తల్చుకుంటుంది ఇలా...

"ఆరళ్ల అత్తయిన, సవతి పోరాన/ తల్లిల్లు దూరమైన భరియించలేము"

పెళ్లయిన తర్వాత ఆడపిల్ల అత్తగారింటికి పోయి, అక్కడే కలకాలం బతకాలిగా. ఆమె ఆడపిల్లే కాని, ఈడ పిల్ల కాదుగా. "పుట్టిల్లు పండక్కే గాని కాపరానికి కాదు' అని కర్నాటక కోలారు జిల్లా లోని ఓ సామెత చెప్తుంది.



'తల్లి చస్తే నాలుక చచ్చినట్లు, తండ్రి చస్తే కళ్లు పోయినట్లు" అని చెప్పే సామెత కూడా ఇక్కడిదే. పుట్టింట్లో తల్లి లేకపోతే ఒకవేళ సవతి తల్లి వుంటే, ఆమె నోరు విప్పలేదు. తండ్రే లేకపోతే ఆమె బతుకే చీకటి. అంటే అన్నా వదినో, తమ్ముడూ మరదలూ మాత్రమే వుండే ఆ ఆడబిడ్డకు అన్ని సుఖాలూ కొదవే.

తల్లీదండ్రీ లేకున్న పుట్టింటికి పోతే వదినమ్మ చేసిన మర్యాదకు ఓ పల్లె పడుచు ఇలా వాపోతుంది కన్నడ జానపదగేయంలో...

"అణ్ణన హెండతి కణ్ణీగె ఒళ్లెవళు/ సుణ్ణదనీర ఒలిముంద ఇటగొండు/ ఎమ్మీహాలెందు బడస్సాళో"

(అన్న భార్య చూపాకారానికి చక్కనిదే. సున్నం నీళ్ల పొయ్యి మీద కాచి, గేదెపాలని వడ్డించింది)

చూడండి.. ఆ వదినమ్మ ఆడపడుచుకు చేసిన మర్యాద ఎంత ఘనమైందో.

ఇల్లూ వాకిలీ, గొడ్డూగోదా, పొలమూ గిలమూ లేని వారికి తన బిడ్డ నిచ్చి, ఆమె బతుకు కూల్చానే అని ఓ తల్లి గొల్లుగొల్లునా ఏడ్చింది ఇలా...

"ఏమీ లేనోనికి డమ్మి తాలియాలో/ నా బిడ్డనిస్తిని డమ్మి తాలియాలో
గిట్టించుకుందునా డమ్మి తాలియాలో/ గొడ్డు లేనిటికి డమ్మి తాలియాలో/ నా బిడ్డ నిస్తినిడమ్మి తాలియాలో/ గా ముచ్చటెరుకుంటె డమ్మి తాలియాలో"

ఏ తల్లైనా సరే తన కూతుర్ని కలిగినోళ్ల ఇంటికి ఇవ్వాలనే తాపత్రయ పడుతుంది కదా. ఈ పాట నల్గొండ జిల్లాలోనిది. (నల్గొండ జిల్లా జానపద గేయాలు - సమగ్ర పరిశీలన. పేజీ.36 - 37. రచయిత : డా॥మేక ఉమారెడ్డి)

ఓ ఆడబిడ్డ తన పుట్టింటికి పోయింది. అక్కడ ముగ్గురన్నలు ఆమెను ఎలా ఆదరించారో, వాళ్లిచ్చిన ప్రేమకానుకలకు ఆమె ఎలా ప్రతిస్పందించిందో చూడండి...

"పెద్దన్న ఇచ్చిన పెయ్యి ఈనీ కట్టింది/ నడిపన్న బెట్టిన నాను నడిమి కింగింది
సిన్నన్న బెట్టిన సీర సినిగిపోయింది/ పెద్దన్న ఇంట్లోనా ఏమీ కావాలి
పెద్దన్న ఇంట్లోనా పెండ్లీ కావాలి/ నడిపన్న ఇంట్లోనా ఏమీ కావాలి
నడిపన్న ఇంట్లోనా రథము కావాలి/ సిన్నన్న ఇట్లోనా ఏమీ కావాలి
సిన్నన్న ఇంట్లోనా పిల్ల సావాలి"

అంతటిదో ఆ మహాతల్లి ఆగిందా? ఏమి శాపనార్థాలు పెట్టిందో వినండి...

"చిన్నోళ్లు పెద్దోళ్లు ఏడువంగ సూతు/ వారి చిటికనేలూకు తేలు కరవాలి"

(పై సిద్ధాంత గ్రథమే. పేజీ. 36).

రాగద్వేషాలూ, ప్రీతి విశ్వాసాలూ లేనివారెవ్వరు చెప్పండి. ఇవి కొందర్లో తక్కువగానూ, ఇంకొందర్లో ఎక్కువగానూ వుంటాయి. కోపతాపాల్ని అణచుకున్న వాళ్లు బాగుపడతారు, అణచుకోలేనివాళ్లు బాధల పాలవుతారు.

సుభద్ర తన కొడుకైన అభిమన్యునికి అన్న బలరాముని కూతుర్నిమ్మని అడిగింది ఇలా... "పుట్టింటిలోనా కన్యా బుట్టిందనీ/ బామ నడగనా వొస్తీమో, బలరామన్న/ బామ నడగనా వొస్తీమో బలరామన్న/ సెసిరేకా సిన్నాదీ బలమంతూ డబిమన్యా బలరామన్న/ ఇద్దరికీ ఈడు లేదాన్నా, బలరామన్నా/ ఇద్దరికీ జోడి వుందన్నా బలరామన్నా"

బలరాముడు తన కూతురు శశిరేఖను తన ప్రియశిష్యుడైన దుర్యోధనుని కుమారుడు లక్ష్మణ కుమారునికి ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడతను పాండవుల్ని ఈసడిస్తూ తన కూతుర్ని ఆ ఇంటికివ్వనన్న భావనతో చెల్లెలు సుభద్రతో ఇలా అంటాడు...

"అడవూలా అడవూలా ఆకులా మేసేటీ అడువు సెంచులూ మీరమ్మా సుబద్దరమ్మా అడువుసెంచులూ మీరమ్మా"

అప్పుడా సుభద్రమ్మతల్లి బాధతో అత్తవారింటికి వెళ్లిపోయిందే కాని అన్నయ్యకు శాపాలు వడ్డించలేదు.

సాధారణంగా పుట్టింటి వారికీ, అత్తింటి వారికీ సయోధ్య కంటే అయోధ్యే ఎక్కువ. ఆడపిల్లలు పుట్టింటిని మరవలేరు. అత్తవారింట్లో అన్నీ సజావుగా సాగుతున్నా, వాళ్లు ఏ రెండేళ్లకో, మూడేళ్లకో ఓ సారయినా పుట్టింటికి వెళ్లి అమ్మానాన్నలతో, అన్నదమ్ముళ్లతో నాలుగురోజుల పాటు కులాసాగా వుండి వస్తారు. 'కన్నతల్లి కొంగు నీడ గానుగనీడ' అని కర్నాటకలోని ఓ సామెత పుట్టింటి సుఖసంతోషాల్ని ఎంచక్కా చాటుతుందంటారు.

స్త్రీలు అత్తగారింటి ఆరళ్లను ఎండగట్టి ఎంత చాటి చెప్పినా, పుట్టింటి లోపాల్ని మటుకు గుండెల్లోనే దాచుకుని వుండిపోతారు.



- ఘట్టమరాజు, 9964082076

వజ్రాయుధ కవికి శత జయంతి



- సబ్బని లక్ష్మీనారాయణ, 8985251271

కవిత్వం ఒక ఆయుధమే ఎప్పటికీ. అందుకే గన్ను కంటే కూడా పెన్ను గొప్పది అంటుంటారు సాహిత్యాభిలాషులు. అలా నిరూపితం అయిన కావ్యమే 'వజ్రాయుధం'. సోమసుందర్ 'వజ్రాయుధం' సమాజం దుర్మార్గం, దురాగతాలపై, దుష్టపాలనపై ఎక్కుపెట్టిన వజ్రాయుధం. ఈ పుస్తకం మొదటిసారి విరోధి ఉగాది మార్చి, 1949వ సంవత్సరంలో కళాకేళి ప్రచురణగా సామర్లకోట నుండి ప్రచురింపబడినది. సోమసుందర్ పుట్టింది 18 నవంబర్ 1924 నాడు. ఈ పుస్తకం ప్రచురించేనాటికి సోమసుందర్‌కు పాతిక సంవత్సరాలు మాత్రమే. నవయవ్వనంలో ఉండి అభ్యుదయ భావాలతో దుష్ట పాలనపై వీరావేశంతో రాసిన కావ్యం 'వజ్రాయుధం'.

ఈ పుస్తకాన్ని నైజాం పైశాచిక నిర్బంధాల నుంచి తెలుగు జాతిని విముక్తం చేయడానికి అకుంఠిత దీక్షతో పోరాడి తమ సర్వస్వాన్నీ సమర్పించిన అమరవీరులందరికీ, తెలంగాణ పోరాట జ్యోతిగా భాసించిన శ్రామిక జన మహానాయకులు శ్రీ రావినారాయణ రెడ్డికి హృదయపూర్వక నీరాజనంగా అంకితం చేశారు సోమసుందర్. ఇలా ఈ కావ్యం యొక్క ఆత్మ, నేపథ్యం తెలంగాణ నేల, తెలంగాణ ఉద్యమ నేపథ్యం అని ఇట్టే తెలుస్తుంది. ఈ పుస్తకం ప్రచురణ అయ్యేనాటికి తెలంగాణ సాయుధ పోరాటం ఇంకా నడుస్తూనే ఉంది నిరంకుశ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా.

ఇందులో మూడు భాగాల్లో కవిత్వముంది. మొదటి భాగంలో సమధర్మం పేరిట ముప్పయి పేజీల్లో 9 కవితా ఖండికలున్నాయి. రెండవ భాగంలో 'బానిసల దండయాత్ర'. ఇది అప్పటికి సాగుతున్న తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంగా ఎనిమిది విభాగాల్లో రాసిన 26 పేజీల్లో కవితా ఖండికలున్నాయి. మూడవ భాగంలో అంతర్జాతీయ నేపథ్యంలో రాసిన మలయా ప్రభంజనం, ఇందులో 10 విభాగాల్లో 10 పేజీల్లో కవితా ఖండికలున్నాయి. ఈ మూడు కవితా విభాగాల నేపథ్యం సూత్రం ఒకటే. స్వేచ్ఛ, విముక్తి, పోరాటం, సమానత్వం.

సమధర్మం మొదటి కవితా ఖండికలో ఇలా అంటారు సోమసుందర్... "తన చరిత్ర తనే పఠించి/ ఫక్కున నవ్వింది ధరణి/ తన గాథను తనే స్మరించి/ బోరున ఏడ్చింది ధరణి"

చరిత్ర కాలగమనంలో ఇప్పటికినీ నిరంకుశ ప్రభుత్వాల కింద ప్రజలు నలిగిపోతూనే ఉన్నారు ప్రపంచంలో ఎక్కడో ఒక దగ్గర. అందుకే తన చరిత్రను తెలుసుకొని తనే నవ్విందట ధరణి. ఇంకా తన దీన గాథను స్మరించి బోరున ఏడ్చిందట ధరణి. ఈ ప్రశ్నలకు సమాధానమే ఈ కవిత్వం, వాటి పరిష్కారం, విముక్తి సాధనకే ఈ కవిత్వం.

"వద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవించును నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళకువ పుట్టును" అని ఆశాభావం వ్యక్తం చేస్తాడు కవి.

"ఓ లెనిన్!... మా లెనిన్!!/ నిరాశానలమ్మునపడి
అణగారే మా ఎదలన్/ నీ వచస్సుధా లహరిన్
ముంచిన మహనీయ లెనిన్" అని ఈ రష్యా విప్లవాన్ని సాధించిన లెనిన్ ను కీర్తిస్తాడు.

మూడవభాగం 'ఖరార్ నామా'లో... "రక్తం అర్పించుము నరుడా!/ నీ త్యాగం వృథా కాదు/ నీ త్యాగం వృథా కాదు" అని చేయవలసిన కర్తవ్యమును ప్రబోధిస్తాడు.

నాల్గవ భాగం 'మౌన ఘోష'లో "ఆకలి వేస్తోందమ్మ!/ అన్నం పెట్టమ్మా!!" అంటూ... "నరులందరికీ సరిపోయే/ సరిపోయే సిరి సంపదలతో/ తులతూగే ఈ దేశం నాదమ్మ!/ తల్లీ! విడువలేను/ నా, మీ అందమైన లోకం!/ అమ్మా! ఆకలి... ఆకలి.." అని అంటాడు కవి.

లక్షలాది పీడిత జన/ సందోహమ్మదిగదిగో!/ కదులుతోంది బారులుగా. కార్మిక కోపాగ్నిచ్ఛటలకు/ తాళలేని శలభం వలె/ ధనస్వామి తపతపమని పాదాంతం వణికిపోయి/ విప్లవశక్తికి/ పాదాక్రాంతుడయే శుభ సమయమ్మిదె" అంటాడు.

ఏడవ కవితా ఖండిక, 'బాడుగ గోడీలు' లో...

"పాపం/ లోకం కోపం/ విసిరిన శాపం అంటూ.../ పాపం పండిన/ ఈ లోకం/ నెత్తిమీద నిండు కుండ/ రేపో ఎల్లుండో / భళ్ళున బద్దలవక మానదు" అంటాడు.


సమధర్మం, చివరి ఎనిమిదవ కవితా ఖండిక 'ఆకలి నాలుకలన్నీ.'

"ఆకలి నాలుకలన్నీ/ ఏకంగా, ఉప్పెనలా, ఉప్పొంగుచు/ దుశ్శాసన రాజ్యంలో.../ ధనస్వామ్య కఠోర పరిపాలనలో/ కుబేర దుర్గాలను/ గుభిల్లు గుభిల్లుమని కూలుస్తున్నవి" అని సమధర్మాన్ని కాంక్షిస్తాడు కవి.

'వజ్రాయుధం'లో 2వ భాగం కవితా ఖండికల భాగం 'బానిసల దండయాత్ర'. అందులో ఎనిమిది విభాగములు, అది తెలంగాణ ఉద్యమ నేపథ్యంగా రాయబడింది. కవిది ఎప్పుడైనా ధర్మాగ్రహమే, అవినీతిపై, అక్రమంపై, అన్యాయాలపై, ఉద్యమాల గడ్డ తెలంగాణ గురించి,

"తెలగాణ ! తెలగాణ!!/ ధీరులకు మొగసాల/ తెలగాణ! తెలగాణ!/ విప్లవోజ్వల గాథ" అంటాడు.

నిరంకుశ నిజాం పాలకున్ని... "హైదరాబాద్ ఖిల్లా/ లోని తొర్రలో, పుర్రెలో/ దాచుకున్నడంట!/ రాక్షసుడు



ప్రాణాలు/ దేశముఖ్ కుక్కలను/ కాపలాలుంచాను" అంటాడు.

"ఒక వీరుడు మరణిస్తే/ వేలకొలది ప్రభవింతురు!/ ఒక నెత్తుటి బొట్టులోనె/ ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు" అనే, అజరామమైన అమరమైన కవితా వాక్యాలు అందించిన అవంత్స సోమసుందర్ చిరస్మరణీయులు.

"అతడెవరు? అతడెవరు??/ జనగామలో జమ్మి/ కొమ్మపై ఎక్కాడు./ అతడెవరు? అతడెవరు??"

....

"అతడా? తెలంగాణ/ గెరిల్లా నాయకుడు" అని తెలంగాణ సాయుధ పోరాట వీరున్ని ఘనంగా కీర్తిస్తాడు.

ఇంకా, "తెలుగు తల్లి ముద్దుబిడ్డగా వీరుడు/ పేదల శ్రమజీవుల కన్నతండ్రి/ ఆంధ్రమాత దివ్యచరిత/ ప్రసవించిన ధీరగెరిల్లా!/ తెలుగుతల్లి నోము పండి ప్రభవించిన వీరగెరిల్లా!!/ బాలచంద్రునికి సోదరుడట!/ రుద్రమాంబ తోబుట్టినవాడట" అని కీర్తిస్తాడు.

రక్తం పారిన తెలంగాణ సాయుధ పోరాట త్యాగాలకు ప్రతీకారంగా... "నాజీ నైజాం రాక్షస రజాకార్ల పోలీసుల, ద్రోహుల రక్తంతో/ మన తమ్ముల ఆత్మల శాంతికి/ దోసిళ్ళతో తర్పణమిద్దాం" అంటాడు.

ఇంకా నైజాం రాజ్యం దుష్టపాలనకు చరమగీతం వస్తుందంటూ... "తెలుగుతల్లి పసిడి కాన్పు/ కొత్తపంట ధరిస్తుంది/ నవజీవం సుమిస్తుంది/ ఈ యాగం ఫలిస్తుంది" ఆశిస్తాడు కవి.

"ఎగరేయ్! ఎగరేయ్!/ ఎర్రెర్ర జెండా!/ మన ఎర్ర జెండా!"

"సర్వజన సౌభాగ్య త్రాతా!/ అభ్యుదయ శాంతి ప్రదాతా!" అంటూ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ తెలంగాణ విముక్తి గీతాన్ని ఆలపిస్తాడు, సమ సమాజాన్ని కాంక్షిస్తాడు. తెలంగాణ నాటికీ నేటికీ ఒక కావ్య వస్తువు. ధన్యుడు సోమసుందర్ తెలంగాణ పై కవిత్వం రాసినందుకు.

'వజ్రాయుధం' కావ్యంలోని చివరి కవితా విభాగం 'మలయా ప్రభంజనం' అది పది చిన్న విభాగాల్లో ఉన్న పది పేజీల కవిత!

కవి లోకానికి చెందినవాడు నిజంగా రవిలా! కవికి తన ప్రాంతం, తన దేశమే కాదు, విశ్వజనీన సత్యాలు తెలిసి అంతర్జాతీయ దక్పథం కూడా ఉండాలి! ప్రపంచంలో ఎక్కడ అన్యాయం, అక్రమం ఉంటుందో అక్కడ ఉండాలి కవి! సోమసుందర్ చేసింది అదే!

"ఓహో హో మలయా/ క్రాంతికల నిలయా/ ఏనాడో చికాగోలో - మాస్కోలో/ ఏనాడో పారిస్‌లో - బెర్లిన్‌లో/ ఏనాడో మీరట్ లో - క్యాన్టన్‌లో/ కరిగిన శ్రామిక విప్లవ మహానదులు నీలో/ నీ నాడులలో, నరాలలో ప్రవహిస్తున్నవి మలయా!" అని చెపుతూ...

"మాక్డొనాల్డు - నియన్తలను, చరిత్ర/ డస్టుబిన్‌లో పడేస్తుందిలే మలయా!" అంటాడు. ఒకనాటి 'మలయా' ద్వీప సముదాయం నేటి 'మలేసియా' ఒకనాటి బ్రిటిష్ వలస పాలనలో ఉన్న ప్రాంతం.

అలనాటి మలయా విప్లవం గురించి,

"నిప్పువంటి ఆకలి కీలల్లో కాలిన/ ఎర్రని నాలుక లూదిన గాలిదుమారం/ మలయా విప్లవం" అంటాడు కవి.

అవంత్స సోమసుందర్ 'వజ్రాయుధం' కావ్యం రాసేనాటికి (1949) అభ్యుదయ రచయిత సంఘంలో కార్యనిర్వాహక ప్రముఖుల్లో ఒకరు. ఆవేశం, ఆలోచన, అభ్యుదయం... వెరసి సోమసుందర్ 'వజ్రాయుధం' ఆనాటి కాలంలో అలాంటి రచన చేయడం ఒక సాహసమే! మార్చి 1949లో ప్రచురింపబడిన 'వజ్రాయుధం' ప్రతుల్ని 1950 ఫిబ్రవరిలో సోమసుందర్ కళాకేళి ప్రచురణాలయం మీద దాడి చేసి వజ్రాయుధం ప్రతుల్ని మొత్తం పట్టుకుపోయారు. అప్పటికే ఎందరో కవుల్ని, పాఠకుల్ని చేరుకుంది ఆ కావ్యం. ఆ కావ్యాన్ని అందుకొని ఉత్తేజితులై ఆరుద్ర 'త్వమేవాహం', అనిశెట్టి 'అగ్నివీణ', దాశరథిలు 'అగ్నిధార'లు, 'రుద్రవీణ'లు, రమణారెడ్డి 'అడవి' లాంటి కావ్యాలు వెలువరించారు.

కొన్ని రచనలు సామాజిక ప్రయోజనం ఆశించి పుడతాయి, రాయబడతాయి! అలాంటిదే 'వజ్రాయుధం'! ధన్యుడు అవంత్స సోమసుందర్. అణగారిన నేలకోసం, ప్రజల కోసం కవిత్వం రాసినందులకు! అది ప్రాంతీయం, జాతీయం, అంతర్జాతీయ పరంగా కూడా తన ఆలోచనా ధారల్ని కురిపించి, ఆవేశపూరితంగా, ఆలోచనా పూరితంగా తన ఇరువది ఐదేండ్ల వయసులో రాసిన కావ్యమే 'వజ్రాయుధం'.

సాహితీ వార్తలు

మాతృభాష ఉనికి - కర్తవ్యాలపై సదస్సు

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో '2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు - 2024' జనవరి 5,6,7 తేదీలలో, రాజమహేంద్రవరంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల సౌజన్యంతో 'మాతృభాష తెలుగు - ఉనికి, కర్తవ్యాలు' అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఒక వ్యాస సంకలనం ముద్రిస్తున్నట్లు, దీనిలో తెలుగు పరిశోధకులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు భాషాభిమానులు, మాతృభాష పరిరక్షణకు కృషి చేస్తున్న వివిధ సేవా సంస్థల నుండి వ్యాసాలను ఆహ్వానిస్తున్నారు. రచనలు పంపేవారు తమ అంశాన్ని, పేరును, విద్య, ఉద్యోగ వివరాలను నవంబర్ 15వ తేదీలోపు aspprasad2k23@gmail.com ఈమెయిల్ కు పంపి నమోదు చేసుకోవలెను. అందిన రచనలలో ఉత్తమమైన మూడు రచనలకు బహుమతులు ఉంటాయి. ఈ వ్యాస సంకలనం ISBN ఆమోదంతో ముద్రించబడుతుంది. వ్యాసాల రచనకు పంపవలసిన అంశాలు : మాతృభాష పరిరక్షణకు భాషోపాధ్యాయుల కర్తవ్యం. నైతిక విలువల పరిరక్షణ. సాంకేతిక పరిజ్ఞానంతో మాతృభాషాభివృద్ధి. మారుతున్న కాలానికి అనుగుణంగా మాతృభాష బోధనలో తీసుకురావలసిన మార్పులు. సాహిత్యం - మాతృభాషల తులనాత్మకత. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బాలలకు తెలుగు భాష పట్ల ఆసక్తి కలిగించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చేపట్టాల్సిన కర్తవ్యం. మాతృభాష పరిరక్షణకు వివిధ సామాజిక సేవా సంస్థలు ఏ విధంగా సహకరించవచ్చు. రచనల నిడివి 500 పదాలు మించరాదు. పాస్ పోర్ట్ సైజు ఫొటోతో సహా డిసెంబర్ 1 వ తేదీలోపు నమోదు చేసుకోవాలి. పూర్తి రచనలు డిసెంబర్ 10 వ తేదీ లోపు పంపించాలి. వివరాలకు : ర్యాలి ప్రసాద్ - 9494553425

పుస్తకావిష్కరణ

పొత్తూరి అన్నపూర్ణమ్మ శతజయంతి మహోత్సవాలను పురస్కరించుకుని డా॥ పొత్తూరి వెంకటేశ్వరరావు 'అమ్మ అన్నపూర్ణమ్మ' (సంక్షిప్త జీవిత చరిత్ర) పుస్తకాల ఆవిష్కరణ డిసెంబర్ 3వ తేదీ గుంటూరు సాహితీకిరణం కార్యాలయంలో ఆవిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎల్.కిస్మత్ కుమార్, బైస దేవదాసు,గుదిబండి వెంకటరెడ్డి, విడదల సాంబశివరావు, కొసరాజు సుబ్రమణ్యం, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, జానీ బాషా, తూమూలూరి రాజేంద్రప్రసాద్, వల్లూరి శివకోటేశ్వరరాజు, పి.వి.ఎల్.నరసింహారావు, పొత్తూరి ప్రేమగోపాలకృష్ణ తదితరులు పాల్గొంటారు. మాతృదేవోభవ అంశంపై నిర్వహించే కవి సమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రులు పాల్గొంటారు.



ఆడబిడ్డలకు అండ ఐద్వా

- సమస్యలతో సహవాసం
- మహిళలతో మమేకం
- వెరసీ మహిళా కమిషన్ నియామకం
- పోరుబాటలో 'ఆమె' కోసం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

'స్త్రీ'యే సృష్టికి మూలం. మనం నేతలపై పడ్డమరుక్షణం నుంచి బంధం కోసం, బాధ్యత కోసం, కుటుంబం కోసం, అందరిని కనుపాపలా తలచి, ఆత్మీయత పంచి, తన వారి కోసం అహర్నిశలు కష్టించి, వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి తన ఇంటిని నందనవనం చేసే మహిళా మూర్తులు నేడు ఎందరో. ఆడపిల్ల కాదు..ఆడపులి అని నిరూపించే ఘటనలు ఎన్నో. కుటుంబ భారాన్ని మోస్తుంది. బీజేపీ పాలనలో పురుషాధిక్య సిద్ధాంతం మహిళల్ని వంటింటికి కుందేళ్లుగా పరిగణిస్తున్నారు. ఈ స్థితిలో వారికి నిరంతరం అండగా నిలుస్తూ అక్కున చేర్చుకుంటున్నదే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా). ఆమె తరపున రణనినాదం చేస్తూ పిడికిలి బిగిస్తున్నది ఐద్వా తెలంగాణ కమిటీ. ఒక్కటేమిటీ, ఎన్నో సమస్యలపై మేమున్నామంటూ ముందుకు వచ్చి ధైర్యాన్నిస్తున్నది. ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నది. గత ఐదేండ్ల కాలంలో అనేక పోరాటాలు, ఉద్యమాలకు ఊపిరి పోసింది. తెగించి నిలబడింది. అసువులు బాసిన అభాగినుల కుటుంబాలకు అండగా ఉండి న్యాయం కోసం కదంతొక్కుతోంది. ఎన్నో సమస్యలు, మరేన్నో పరిష్కారాలతో ఐద్వా ఆమె కోసం నిరంతరం పరితపిస్తున్నది. పరుగులు పెడుతున్నది.

దేశంలో ప్రస్తుతం 33 శాతం రిజర్వేషన్ల బిల్లుపై చర్చ అంతాఇంతా కాదు. దీనికోసం ఏండ్లతరబడి గళాన్ని విప్పుతూనే ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ తదితర సామాజిక తరగతుల మహిళలనే కాకుండా అందరికీ ఆసరాగా ఉంటున్నది.

ఓంటరి మహిళలకు చేదోడు,వాదోడుగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నది. ఆదరిస్తున్నది. సమస్యలపై రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలతో న్యాయం కోసం ఉద్యమిస్తున్నది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకై అనేక కార్యక్రమాలు చేసింది. అంతెందుకు నిన్నమొన్న ఢిల్లీ సరిహద్దుల్లో రైతు ఉద్యమంలాగే మహిళా రెజ్లర్ల కోసం చేయందించింది. అణువణువునా అండగా ఉంది. ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

మహిళా కమిషన్ నియామకం

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి రాష్ట్రంలోని పాత మహిళా కమిషనే కొనసాగింది. ఆ పదవీకాలం ముగిసిన తర్వాత కొత్త నియామకం లేదు. అలాగే కేసీఆర్ మంత్రివర్గంలో మహిళలకు చోటులేదు. దీని కోసం ఐద్వా గొంతును సవరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆ రాష్ట్ర కమిటీ గర్జించింది. అన్ని జిల్లాల్లో ఆందోళనకు పూనుకుంది. రిలే నిరాహార దీక్షలకు దిగింది. వరుసగా 26 రోజులు ఉద్యమించింది. కమిషన్ చైర్‌పర్సన్‌ను ప్రకటించేవరకు ఆందోళనను విరమించేది లేదన్నట్టుగా నిరసనలు చేసింది. హైదారాబాద్‌లోని ఇందిరాపార్క్ ముందు బైఠాయించింది. అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నాలు జరిపింది. చివరకు అసెంబ్లీలో చర్చకు దారితీసింది.ప్రభుత్వం మెడలు వంచింది. ఫలితంగా గులాబీ సర్కారు దిగొచ్చింది. మహిళా కమిషన్ తెలంగాణ చైర్‌పర్సన్‌గా సునీతా లక్ష్మారెడ్డిని నియమించింది.

ఇది ప్రభుత్వంపై ఐద్వా సాధించిన విజయం. అలాగే కేసీఆర్ ప్రభుత్వం తొలి ఐదేండ్ల కాలంలో మహిళా మంత్రులే లేరు. ఐద్వా కార్యాచరణ ఫలితంగా ఇప్పుడు ఇద్దరు మహిళలకు మంత్రులుగా సమాజానికి సేవలందించే అవకాశం చిక్కింది.

నిలువనీడ కోసం..

మనిషికి కావాల్సిన సాధారణ అవసరాలైన కూడు, గూడు, గుడ్డ. అందులో గూడు కోసం 'ఐద్వా'గా ప్రజాసంఘాల పోరాట వేదికతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా



పనిచేసింది. అన్ని జిల్లాల్లో బస్సుయాత్ర చేపట్టింది. నిలువనీడలేని పేదలను పరామర్శించింది. మహిళ ఇబ్బందులు, కష్టాలను స్పృశించింది. ప్రభుత్వం ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇస్తామని ప్రకటిచేంతవరకూ పోరాడింది.

బలిదానాలకు వ్యతిరేకంగా..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో అవకతవకలు జరిగాయనే కారణంతో రాష్ట్రవ్యాప్తంగా 16 మంది విద్యార్థుల ఆత్మబలిదానం చేసుకున్న ఘటనలు ఇప్పటికీ కండ్లల్లో కదలాడుతూనే ఉన్నాయి. మరీ తల్లుల పరిస్థితి ఏంటి ? గ్లోబరినా సంస్థ పనిపట్టేవరకు వెనుదీయకుండా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐతో కలిసి ఉద్యమించింది. ఆ సంస్థతో ఉన్న ఒప్పందాన్ని రద్దుచేయించింది. కేసులు పెట్టించింది.

ఆస్పత్రులపై సర్వే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తోపాటు జిల్లాల్లో స్థానిక ఆస్పత్రులపై డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐతో కలిసి ప్రత్యేకంగా సర్వే చేపట్టింది. కనీస వసతుల్లేని సంగతిని గుర్తించింది. వైద్యం అందని పరిస్థితిని ఎజెండా చేసింది. వైద్య,ఆరోగ్యశాఖలో మూడో వంతు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ప్రభుత్వానికి చెప్పింది. బస్తీదవఖానాలు ఏర్పాటుకు కారణమైంది. పీహెచ్‌సీలో 50 రకాల వైద్యపరీక్షలు చేయడానికి పోరుసల్పింది. కరోనాకాలంలో గర్భిణీల కోసం కోట్లాడింది. కుటుంబ నియంత్రణ అపరేషన్ల సందర్భంగా ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో నలుగురు మహిళలు చనిపోయిన ఘటనలో బాధ్యులను సస్పెండ్ చేసేవరకూ పోరాడింది. లాక్‌డౌన్ కాలంలో పౌరసేవలు అందించింది. దాదాపు 176 క్వింటాళ్ల బియ్యం, 1230 క్వింటాళ్ల కూరగాయలు, 10 వేల మాస్కులు, ఇతరాలు సైతం పంపిణీ చేసింది.

పసిపాప..అమ్మాయి..అమ్మ

రాష్ట్రంలో మహిళలపై చోటుచేసుకున్న దారుణాలు, అఘాయిత్యాలు అన్నీ ఇన్నీ కావు. ఒకచోట పసిపాప, మరోచోట అమ్మాయి, ఇంకోచోట అమ్మ, అమ్మమ్మలపై జరిగిన లైంగికదాడుల ఘోరాలు అనేకం. ఒకటిరెండు కాదు, ఎన్నో, ఎన్నెన్నో. వయస్సులో తేడానే తప్ప, ఎక్కడైనా కామాధుల కబంధ హస్తాల్లో చిక్కుకున్న అబలల కష్టాలు వర్ణనాతీతం. హాజీపూర్, హన్మకొండ, అమీన్‌పూర్, యాదాద్రి తదితర అమానవీయ దుర్ఘటనలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవే. వాటిపై ఐద్వా అవిరళ పోరాటం సాగించింది. ఒక్కో ఘటనపై సామాజిక ఉద్యమాలు చేస్తూ న్యాయస్థానాల్లోనూ బాధితులకు అండగా నిలబడింది. చట్టం ద్వారా బాధితులకు భరోసా కల్పించింది. అంతేందుకు బిల్కిస్‌బానో కేసులోనూ, కాశ్మీర్‌లో జరిగిన ఘటనలకు సంఘీభావాన్ని తెలియజేసింది. ఇకపోతే ఐద్వా అదాలత్, ఎన్నార్సీ-ఎన్పీఆర్, ఆర్టికల్ 370 రద్దు, పరువుహత్యలపై పోరాడింది. ఇలా అనేక పోరాటాలు, ఉద్యమాలు ద్వారా ఐద్వా మహిళల కోసం గొంతెత్తి గళం వినిస్తున్నది. అన్యాయాన్ని అడ్డుకునేందుకు నిరంతర ప్రయత్నం చేస్తున్నది.

నిరంతరం అండగా ఉంటాం

రాష్ట్రంలో మహిళల పట్ల అనేక దారుణాలు జరుగుతున్నాయి. లైంగిక దాడులతోపాటు నిత్యం అవమానాలకు గురవుతున్నారు. ఇక్కడా, అక్కడా అని కాదు అన్నిచోట్లా ఈ అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయి. సాంఘీక దురాచారాలు, మూఢనమ్మకాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. మంచి, చెడుల విషయంలో మహిళలతోపాటు పురుషులకు అవగాహన అవసరం. అందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. ఐద్వా ఆధ్వర్యంలో ఐద్వా అదాలత్ పేర కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. సామాజిక అవగాహన కార్యక్రమాలు సైతం చేపడుతున్నాం.

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి
ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి

ఛత్తీస్‌గఢ్‌లా ఇక్కడా గ్యారంటీలను అమలు చేస్తాం..

- కేసీఆర్ తెలంగాణను అప్పుల్లోకి నెట్టారు : ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘేల్



నవతెలంగాణ - కరీంనగర్/కాజీపేట

ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం గ్యారంటీలను అమలు చేస్తోందని.. అలాగే తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో, వరంగల్ జిల్లా కాజీపేటలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సభల్లో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోడీకి బీఆర్ఎస్, ఎంఐఎం బీటీమ్ అని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మోజార్టీతో గెలిపించి గిఫ్ట్‌గా ఇవ్వాలని ఓటర్లను కోరారు.

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను దోచుకొని పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలను దోచుకుంటున్న ఆ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రజలపై భారాలు వేస్తూ ఆస్తులు కూడపెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఎన్నికల్లో నాలుగు రాష్ట్రాల్లో తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని, ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మతోన్మాద బీజేపీ, ఎంఐఎం, జనసేనలను ఓడించండి

- సామ్యవాద, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను గెలిపించాలి : ఆప్ రాష్ట్ర కన్వీనర్ దాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, ఎంఐఎం, జనసేన పార్టీలను ఓడించి, సామ్యవాద, లౌకిక శక్తులను గెలిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామ్యవాద, లౌకిక శక్తుల ఓట్ల చీలిక నివారించేందుకే ఎన్నికల్లో ఆప్ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం, ఆప్ 11వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆప్ జెండాను ఆవిష్కరించారు. 11 ఏండ్లలో అనేక అవరోధాలను అధిగమించి ఆప్ జాతీయ పార్టీగా ఎదిగిందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు, విభజన రాజకీయాల కారణంగా రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మతతత్వాన్ని పెంచి పోషించడం వల్లే ఉగ్రవాదం పెరుగుతుందనీ, ఇందుకు ముంబయి ఉగ్ర దాడులే ఉదాహరణ అని, మతతత్వాన్ని అణిచివేస్తే ఉగ్రవాదం వేర్లు తెగుతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడకుండా ఆప్ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందరికీ ఉచిత వైద్యం, ఉచిత తాగునీరు, ఉచిత విద్యుత్, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, సీనియర్ సిటీజన్లకు ఉచితంగా తీర్థయాత్రలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిర్మూలన తదితర సేవలనందించిన ఆప్‌ను ఢిల్లీ ప్రజలు మూడో సారి అధికారంలోకి తెచ్చారని తెలిపారు. బీజేపీ హయంలో సీబీఐ, ఈడీలు మూడు వేల కేసులు నమోదు చేస్తే 23 మందికి మాత్రమే శిక్ష పడిందని తెలిపారు. మిగిలిన వారిలో పలువురు బీజేపీలో చేరిన తర్వాత వారి కేసులు మాఫీ చేసి వారికి మరింత పెద్ద రాజకీయ పదవులిచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు మొహమ్మద్ మజీద్, సోలొమన్ రాజు, డాక్టర్ అన్సారీ, అధికార ప్రతినిధి వినయ్ రెడ్డి, జావీద్ షరీఫ్, ఫణి భూషణ్, పరీక్షిత్ రాజ్, నేతలు మోమిన్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు చూసి మోసపోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జగిత్యాల, వేములవాడ, దుబ్బాక, ఖానాపూర్ నియోజకవర్గాలలో ఆదివారం జరిగిన ప్రజాఆశీర్వాద సభల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి ఎక్కడా లేదని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజాసామ్య పరిణితితో ఓట్లు వేస్తారని, ఇక్కడా అలాంటి వాతావరణమే రావాలని అన్నారు. తనకు పదవులపై ఆశలేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన దానికంటే మించిన పదవి ఏముంటుందన్నారు. పేదరికం లేని తెలంగాణను చూడాలన్నదే తన కోరిక అని, ఆ దిశగా రాష్ట్రాన్ని బాగు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ వరుసగా పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగలేదని, తాను మాత్రమే ఉన్నానని తెలిపారు. కేరళలో మాదిరిగా వందశాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా తెలంగాణను తయారు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు.. అసలు ఆ రాజ్యంలో కరువు కాటకాలే తప్ప జనాలకు ఒరిగిందేమిటో చెప్పాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలోనే తన పెండ్లి జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే రమేష్‌బాబు నిజాయితీపరుడని, అయినా ఆయనపై కోర్టులో ఉన్న దిక్కుమాలిన కేసు మూలంగా ఆయన స్థానంలో విద్యావంతుడు లక్ష్మీనర్సింహారావుకు అవకాశం ఇచ్చామని తెలిపారు.

రైతుబంధు పదాన్ని పుట్టించిందే కేసీఆర్. కాంగ్రెస్‌ది భూమాత కాదు.. భూ మేత. రఘునందన్‌కు ఏకాణా పైసా తెల్వదు. ప్రజాస్వామ్యంలో ఓటే ప్రజల ఆయుధం. ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండి. దుబ్బాక అభివృద్ధి నేను చూసుకుంటా' అని సీఎం కేసీఆర్ అన్నారు. 'దుబ్బాకను కాపాడే అవసరం ఉందనే కొత్త ప్రభాకర్ రెడ్డిని నిలబెట్టా. ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నెలలోపే ఆర్డీఓ ఆఫీసు, రింగ్ రోడ్డు, కళాశాలను మంజూరు చేస్తా' అని అన్నారు. ఉప ఎన్నికల్లో నేను రాలే.. అందుకే ఓడిపోయాం.. నేను వచ్చుంటే రఘునందన్ పని వొడిషిపోవు.. నోటికి వచ్చిన వాగ్దానాలు ఇచ్చి 'ఏకాణా పని చేయలేదని ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై నిప్పులు చెరిగారు. మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటేస్తే గోసపడతామన్నారు. కాంగ్రెస్ రూపొందించిన ఆరు గ్యారెంటీలను నమ్మి వారికి ఓటేస్తే మోసపోతారని ఖానాపూర్‌లో సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఓటు వేసేటప్పుడు ఆగమాగం కావద్దని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దేశంలో రైతుబంధును పుట్టించింది తానేనని గుర్తుచేశారు..

జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు

- కాంగ్రెస్‌తోనే కరెంట్ కష్టాలు
- రేవంత్ రెడ్డికి రెండు చోట్లా ఓటమి ఖాయం
- సునీతారెడ్డిని గెలిపిస్తే నర్సాపూర్‌ను ఐటీ హబ్‌గా మారుస్తా :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ- నర్సాపూర్/గంభీరావుపేట/ ఎల్లారెడ్డిపేట/ వీర్నపల్లి

"కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు మొదలవుతాయి.. రేవంత్‌రెడ్డికి రెండు చోట్లా ఓటమి ఖాయం.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే జనవరిలో కొత్త రేషన్ కార్డులు ఇస్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్, సిరిసిల్ల నియోజకవర్గంలోని వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో రోడ్ షోల్లో ఆయన ప్రసంగించారు.

2014 కంటే ముందు కరెంటు కోసం ఎన్నో కష్టాలు పడ్డామని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు కష్టాలు తొలగిపోయాయని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న ప్రధానమంత్రి మోడీ మాటలు ఎక్కడా అని ప్రశ్నించారు. రైతుబంధు దుబారా అన్న రేవంత్‌రెడ్డి మాటలను అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణకు నష్టం చేసిన వాళ్లు ఇప్పుడు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారని, అలాంటి వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్డ్ భూములను పట్టా భూములుగా మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జోన్‌లో ఉన్న నర్సాపూర్‌ను చార్మినార్ జోన్‌లోకి మారుస్తామన్నారు. నర్సాపూర్ టికెట్ విషయంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి బీసీ బిడ్డ గొంతు కోసి డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కొడంగల్, కామారెడ్డి రెండు స్థానాల్లోనూ ఓటమి చెందడం ఖాయం అన్నారు. పనిమంతురాలైన సునితారెడ్డిని మీ ముందు ఉంచామని, ఆమెను భారీ మెజారిటీతో గెలిపిస్తే నర్సాపూర్‌ను ఐటీ హబ్‌గా మార్చడంతోపాటు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత జనవరి నెలలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ చెప్పారు. రేషన్ కార్డులున్న అందరికీ సన్న బియ్యం ఇస్తామన్నారు. పోడు రైతులకు హక్కు పత్రాలు ఇస్తామన్నారు. బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు.

రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సాధించిన ప్రగతని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ రోడ్ షో ఏర్పాట్లలో ఎల్ఈడీ స్క్రీన్ అమరుస్తున్న సమయంలో కుప్పకూలి బిగించే వారిపై పడింది. పలువురికి గాయాలయ్యాయి.

జనవరిలో గల్ఫ్ పాలసీ -మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారికోసం ప్రత్యేకంగా గల్ఫ్ పాలసీని తీసుకొస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు ప్రకటించారు. అధికారంలోకి రాగానే జనవరిలో ఆ పాలసీని అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రధానంగా గల్ఫ్ లో ఉపాధి కోసం వెళ్ళిన వారికి సైతం గల్ఫ్ బీమా కార్యక్రమాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. రైతు బీమా మాదిరే రానున్న ప్రభుత్వంలో గల్ఫ్ ప్రవాసీలకు కూడా బీమా అందిస్తామని తెలిపారు.

ఈ బీమా పథకం కింద రూ. ఐదు లక్షల బీమా కవరేజ్ ప్రతి ఒక్క వ్యక్తికి అందుతుందని తెలిపారు. దీంతోపాటు గల్ఫ్ పాలసీలో భాగంగా ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా కలిపి సమగ్రమైన పాలసీని అమల్లోకి తెస్తామని వివరించారు. ఈ మేరకు కేటీఆర్ ఒక ప్రకటన చేశారు.

నెంబర్‌వన్ స్టేట్‌గా చేస్తాం..

- అవినీతిపై విచారణ జరిపి కేసీఆర్‌ను జైల్లో పెడతాం : విజయసంకల్ప సభల్లో అమిత్‌షా



నవతెలంగాణ-భువనగిరి/ ములుగు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి, ములుగు జిల్లాల్లో సకల జనుల విజయ సంకల్ప సభల్లో ఆయన ప్రసంగించారు. యాదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామి ప్రాంతానికి వచ్చినందుకు ఎంతో అదృష్టవంతుడిన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే భువనగిరి ఖిల్లాను రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. మూసీ ప్రక్షాళన కూడా చేస్తామని చెప్పారు. అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తమ ఓటు ద్వారా గద్దె దింపాలని కోరారు. భూదాన్ పోచంపల్లిలో వినోబాబావే భూదానోద్యమం చేస్తే.. ఇప్పుడు కేసీఆర్ భూకబ్జా ఉద్యమం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కేసీఆర్ కబ్జా చేశారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే కేసీఆర్ అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి జైలులో పెడ్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయహోదా విషయంలో కేసీఆర్ ఎన్నడూ ప్రధాని మోడీని కలవలేదని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కేసీఆర్‌కు వేసినట్టేనన్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.పథకాల పేరుతో వేలకోట్లు ముంచిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని ములుగులో అమిత్‌షా అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే జాతీయ గిరిజన యూనివర్సిటీకి భూమి ఇస్తామని, రూ.300 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ను ప్రధాని మోడీ ఇస్తుంటే సీఎం కేసీఆర్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఏజెన్సీలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ సభల్లో బీజేపీ భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే అభ్యర్థి పడాల శ్రీనివాస్, ములుగు అభ్యర్థి అజ్మీర ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక రండి... వాస్తవాలు తెలుసుకోండి...

సీఎం కేసీఆర్‌కు కర్నాటక సీఎం సిద్ధ రామయ్య సూచన

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కర్నాటక ప్రభుత్వంపైనా, ఐదు గ్యారంటీలపై తెలంగాణ సీఎం కేసీఆర్, ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం సిద్ధ రామయ్య విమర్శించారు. కర్నాటకకు రండి...వాస్తవాలు తీసుకోండి అని సీఎం కేసీఆర్‌ను కోరారు. కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను అమలు జరిపామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆ రాష్ట్ర మంత్రులు బోస్‌రాజు, లక్ష్మి, నాగేంద్ర, తెలంగాణ సీనియర్ నేత వీ. హనుమంతరావుతో కలిసి ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేయలేదంటూ కేసీఆర్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అందులో వాస్తవం లేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి క్యాబినెట్‌లోనే ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. శక్తి యోజన ద్వారా మొదటి గ్యారంటీ పథకాలను జూన్ 11న అమలు చేశామన్నారు.

రోజుకు 62 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని వివరించారు.తన భార్యతోపాటు మహిళా మంత్రులు కూడా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఎన్నికల కోసం అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. కానీ ఇతరులు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్నాటకకు బియ్యం ఇవ్వకపోవడం వల్ల ఒక్కో కేజీకి 34 రూపాయలు చెల్లిస్తున్నామన్నారు. గృహజ్యోతి పథకాన్ని జులై నుంచి అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు తెలిపారు. యువనిధి ద్వారా వచ్చే జనవరి నుంచి నిరుద్యోగులకు రూ. 3వేలు అందిస్తామన్నారు. ఇచ్చిన 165 హామీల్లో ..158 ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. గతంలో బీజేపీ ఇచ్చిన 600 హామీల్లో కేవలం 10 శాతం మాత్రమే అమలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజలను ఎప్పుడు మోసం చేయదనీ, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదని చెప్పారు. కర్నాటక దివాళా తీస్తుందన్న వాదనల్లో వాస్తవం లేదన్నారు. తమకు డబ్బులకు కొదవ లేదన్నారు. రాష్ట్రంలో నూటికి నూరుశాతం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కర్నాటక బీజేపీపై 40 శాతం కమిషన్ ఆరోపణ కాంగ్రెస్ ది కాదనీ, అది కాంట్రాక్టర్లు చేసిందన్నారు. వాటిపై కాంగ్రెస్ సర్కారు విచారణ జరుపుతుందన్నారు.

మెట్‌పల్లి గురుకుల విద్యార్థిని దాసరి విశ్వాని మృతి

- హాస్టల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి : టీజీపీఏ వ్యవస్థాపకులు యాదయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి బాలికల గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతున్న దాసరి విశ్వాని మృతికి హాస్టల్ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మోతుకూరి యాదయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై గురుకులా కార్యదర్శి నవీన్ నికోలస్ పూర్తి విచారణ చేసి సంబంధిత ప్రిన్సిపాల్, హౌస్ టీచర్, సూపర్‌వైజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి న్యాయం జరిగేలా కార్యదర్శి చర్యలు చేపట్టాలనీ, లేని పక్షంలో ఆదే హాస్టల్ ముందు మృతి చెందిన విశ్వాని మృతదేహంతో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రాజ్‌భవన్‌లో రాజ్యాంగ దినోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్ భవన్ లో మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, అధికారులు, సిబ్బంది పాల్గొని రాజ్యాంగ పీఠికను పఠించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు ఘనంగా నివాళులర్పించారు.

సంధి వేళా.. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం

- వెస్ట్‌బ్యాంక్‌పై దాడి ..8 మంది పౌరులు మృతి

గాజా స్ట్రిప్ : కాల్పుల విరమణ, బంధీల మార్పిడి ఒకవైపు కొనసాగుతుండగానే...సంధి కాలంలోనూ ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోయింది. శరణార్థి శిబిరాలను, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని నెతన్యాహూ సైన్యం దాడులకు పాల్పడింది. శని, ఆదివారాల్లో 24 గంటల పాటు సాగిన ఇజ్రాయిల్ కాల్పుల్లో వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో 8 మంది సాధారణ పౌరులు చనిపోయారు. ఈ విషయాన్ని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. జెనిన్ శరణార్థి శిబిరంలో ఐదుగురు చనిపోగా.. సెంట్రల్ వెస్ట్‌బ్యాంక్‌లో ఒకరు, ఇతర ప్రాంతాల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అయితే కాల్పులను సమర్థించుకునేందుకు ఇజ్రాయిల్ వక్రభాష్యాలను తెరపైకి తీసుకొచ్చింది. ఇజ్రాయిల్‌కు చెందిన తండ్రీకొడుకులను కారుతో ఢీకొట్టి చంపిన కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు వెళ్లగా..అక్కడివారు తమపై దాడి చేయడంతో కాల్పులు జరిపినట్లు నెతన్యాహూ సైన్యం బుకాయిస్తోంది. ఈ ఘటనలో చనిపోయినవారంతా ఉగ్రవాదులేనని ప్రకటించింది.

హమాస్ సీనియర్ కమాండర్ మృతి

కాగా ఇజ్రాయిల్ జరిపిన మరో దాడిలో హమాస్ సీనియర్ కమాండర్ ఒకరు చనిపోయారు. ఈ విషయాన్ని హమాస్ కూడా ధ్రువీకరించింది. ఉత్తర గాజా ప్రాంతానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న అహ్మద్ అల్ ఘూందౌర్ అనే బ్రిగేడ్ కమాండర్ ఇజ్రాయిల్ దాడిలో మరణించినట్లు హమాస్ పేర్కొంది. అయితే ఆయన ఎప్పుడు, ఎక్కడ మరణించారనే వివరాలు మాత్రం వెల్లడించలేదు.

బ్రూక్ భారం దించేశారు




- టైటాన్స్‌తోనే హార్దిక్ పాండ్య
- మరో సీజన్‌కు ధోని సిద్ధం

ఐపీఎల్ 2024 రిటెన్షన్ జాబితా

174 మంది క్రికెటర్లు. 2024 ఐపీఎల్ సీజన్ ముంగిట పది ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు. 81 మంది క్రికెటర్లు. 2024 ఆటగాళ్ల మినీ వేలం ముంగిట పది ఫ్రాంచైజీలు వదిలేసుకున్న క్రికెటర్లు. డిసెంబర్ 19న దుబాయ్‌లో ఐపీఎల్ మినీ ఆటగాళ్ల వేలానికి ముందు ప్రక్రియ ముగిసింది. ఊహించినట్టే గత సీజన్లో జట్టుకు భారంగా నిలిచిన క్రికెటర్లను ఫ్రాంచైజీలను వదులుకున్నాయి. హార్దిక్ పాండ్య గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గానే నిలువగా.. ఎం.ఎస్ ధోని మరో సీజన్‌లో సందడి చేయనున్నాడు. ఆటగాళ్ల అట్టిపెట్టుకునే జాబితాను పది ఫ్రాంచైజీలు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఆదివారం సమర్పించాయి.

నవతెలంగాణ-ముంబయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 సందడి మొదలైంది. ఆటగాళ్ల మినీ వేలానికి ముందు ఐపీఎల్ ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్న, వదిలేసుకున్న ఆటగాళ్ల జాబితాను ఆదివారం వెల్లడించాయి. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య వచ్చే సీజన్‌కు ముంబయి ఇండియన్స్‌కు ఆడతాడనే ఊహాగానాల నడుమ.. అతడిని టైటాన్స్ నిలుపుకుంది. వేలంలో కోట్లు కుమ్మరించి దక్కించుకున్న ఇంగ్లాండ్ యువ సంచలనం హ్యారీ బ్రూక్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ వదిలేసుకుంది.



బుమ్రా జతగా అరాచకం చేస్తాడనుకున్న జోఫ్రా ఆర్చర్‌ను ముంబయి ఇండియన్స్ వేలంలోకి వదిలేసింది. ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్‌ను చెన్నై సూపర్ కింగ్స్ వదిలిపెట్టగా.. ఎం.ఎస్ ధోని కెప్టెన్‌గా మరో సీజన్‌లో ఆడతాడని అధికారికంగా అభిమానులకు తీపి కబురు చెప్పేసింది. రిటెన్షన్, రిలీజ్ జాబితా సమర్పించేందుకు ఆదివారంతో గడువు ముగియగా.. డిసెంబర్ 19న దుబాయ్ వేదికగా ఐపీఎల్ 2024 ఆటగాళ్ల మినీ వేలం నిర్వహించనున్నారు.

బ్రూక్ అవుట్

రూ.13.25 కోట్లు. హ్యారీ బ్రూక్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌లో వెచ్చించిన మొత్తం. భారీ అంచనాలతో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన బ్రూక్.. దారుణంగా విఫలమయ్యాడు. ఓ సెంచరీతో మెరిసినా.. సీజన్‌లో నిలకడ లేని ప్రదర్శనతో జట్టుకు భారమయ్యాడు. యువ బ్రూక్‌కు మరో అవకాశం ఇవ్వాలనే వాదన ఉన్నప్పటికీ.. సన్‌రైజర్స్ ఇంగ్లాండ్ స్టార్‌పై విశ్వాసం ఉంచలేదు. బ్రూక్‌ను వేలంలోకి వదిలేసింది. ఆదిల్ రషీద్, అకీల్ హొసేన్ సహా కార్తీక్ త్యాగి, సమరత్ వ్యాస్‌లను సైతం హైదరాబాద్ విడిచిపెట్టింది. రానున్న వేలంలో రూ.34 కోట్ల డబ్బుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లను కొనుగోలు చేయనుంది.

టైటాన్స్‌తోనే హార్దిక్?!

2015లో రూ.10 లక్షల కనీస ధరకు ముంబయి ఇండియన్స్ గూటికి చేరిన హార్దిక్ పాండ్య.. లీగ్ స్టార్‌గా ఎదిగేందుకు పెద్దగా సమయం పట్టలేదు. రెండేండ్ల క్రితం గాయంతో ఇబ్బందిపడుతున్న తరుణంలో టైటాన్స్ పాండ్యను తీసుకుని ఏకంగా కెప్టెన్సీ అప్పగించింది. కెప్టెన్‌గా అరంగేట్ర సీజన్లో టైటిల్ కొట్టిన పాండ్య.. రెండో సీజన్‌లో రన్నరప్‌గా నిలబెట్టాడు. రోహిత్ శర్మ వారసుడి అన్వేషణలో ఉన్న ముంబయి ఇండియన్స్ మళ్లీ హార్దిక్ పాండ్యను తెచ్చుకోవాలని గట్టి ప్రయత్నం చేస్తోంది. రూ.15 కోట్ల నగదుతో పాటు భారీ మొత్తంలో బదిలీ ఫీజు చెల్లించేందుకు ముంబయి ఇండియన్స్ సిద్ధమైంది. అయితే, రిటెన్షన్ జాబితా వెల్లడి సమయానికి కాంట్రాక్టు ఖరారు కాలేదని తెలిసింది. రిటెన్షన్ జాబితా వచ్చినా.. పాండ్యను తీసుకునేందుకు ముంబయికి అవకాశం ఉంది. అయితే, ఇప్పుడు నగదు బదిలీ కుదరదు. పాండ్యకు బదులుగా ముంబయి నుంచి మరో ఆటగాడిని ఎంచుకునే స్వేచ్ఛ గుజరాత్ టైటాన్స్‌కు ఇచ్చేందుకు అంబాని ఫ్రాంచైజీ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఎం.ఎస్ ధోని అభిమానులకు చెన్నై సూపర్‌కింగ్స్ తీపి కబురు అందించింది. మహి మరో సీజన్‌లో నాయకుడిగా సందడి చేయనున్నాడు. అయితే, సీజన్‌కు అందుబాటులో ఉండని స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను చెన్నై వదులుకుంది. అంబటి రాయుడు రిటైర్మెంట్‌తో దూరమవగా..ప్రిటోరియస్, కైల్ జెమీసన్, ఆకాశ్ సింగ్, భగత్ వర్మలను సూపర్‌కింగ్స్ విడిచిపెట్టింది. ఇక ముంబయి ఇండియన్స్ అనూహ్యంగా జోఫ్రా ఆర్చర్‌ను వదులుకుంది. గాయంతో ఇబ్బందిపడుతున్న ఆర్చర్ ఐపీఎల్‌కు అందుబాటులో ఉండటం లేదు. దీంతో అతడితో పాటు స్టబ్స్, జాన్సెన్, రిచర్డ్‌సన్, మెరెడిత్, క్రిస్ జోర్డాన్‌లను ముంబయి వదులుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. వానిందు హసరంగ, హర్షల్ పటేల్ సహా జోశ్ హేజిల్‌వుడ్, వేనీ పార్నెల్ సహా మైకల్ బ్రాస్‌వెల్, ఫిన్ అలెన్‌ను వేలంలోకి వదిలేసింది. శార్దుల్ ఠాకూర్, లాకీ ఫెర్గుసన్‌ను కోల్‌కత నైట్‌రైడర్స్ వదులుకోగా.. యువ ఆల్‌రౌండర్ షారుక్ ఖాన్‌ను పంజాబ్ కింగ్స్‌కు వద్దనుకుంది.

వేలంలో అందుబాటులో ఉన్న డబ్బు (రూ. కోట్లలో)

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్	: 40.75
సన్‌రైజర్స్ హైదరాబాద్	: 34.00
కోల్‌కత నైట్‌రైడర్స్	: 32.70
చెన్నై సూపర్‌కింగ్స్	: 31.40
పంజాబ్ కింగ్స్	: 29.10
ఢిల్లీ క్యాపిటల్స్	: 28.95
ముంబయి ఇండియన్స్	: 15.25
లక్నో సూపర్‌జెయింట్స్	: 13.90
గుజరాత్ టైటాన్స్	: 13.85

వదులుకున్న ఆటగాళ్ల జాబితా

చెన్నై సూపర్‌కింగ్స్ : అంబటి రాయుడు, బెన్ స్టోక్స్, డ్వేన్ ప్రిటోరియస్, భగత్ వర్మ, సుభాన్షు సేనాపతి, ఆకాశ్ సింగ్, కైల్ జెమీసన్, సిసండ మంగళ.

ఢిల్లీ క్యాపిటల్స్ : రిలే రొసొ, చేతన్ సకారియ, మనీశ్ పాండే, ఫిల్ సాల్ట్, ముస్తాఫిజుర్ రెహమాన్, కమలేశ్ నగర్‌కోటి, రిపాల్ పటేల్, సర్ఫరాజ్ ఖాన్, ఆమన్ ఖాన్, ప్రియాం గార్గ్, రోవ్‌మాన్ పావెల్.

రాజస్థాన్ రాయల్స్ : జేసన్ హోల్డర్, మెక్‌కాయ్, జో రూట్, అబ్దుల్ బాసిత్, ఆకాశ్ వశిష్ట్, కుల్దీప్ యాదవ్, మురుగన్ అశ్విన్, కెసి కరియప్ప, కెఎం అసిఫ్.

పంజాబ్ కింగ్స్ : భానుక రాజపక్స, మోహిత్ రాతీ, బాల్తేజ్ దండ, రాజ్ భవ, షారుక్ ఖాన్.

కోల్‌కత నైట్‌రైడర్స్ : షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్, డెవిడ్ వైసీ, ఆర్య దేశాయ్, ఎన్. జగదీశన్, మన్‌దీప్ సింగ్, కుల్వంత్ ఖెజ్రోలియ, శార్దుల్ ఠాకూర్, లాకీ ఫెర్గుసన్, ఉమేశ్ యాదవ్, టిమ్ సౌథీ, జాన్సన్ చార్లెస్.

సన్‌రైజర్స్ హైదరాబాద్ : హ్యారీ బ్రూక్, సమరత్ వ్యాస్, కార్తీక్ త్యాగి, విబ్రాంత్ శర్మ, అకీల్ హొసేన్, ఆదిల్ రషీద్.

లక్నో సూపర్‌జెయింట్స్ : డానియల్ శామ్స్, కరుణ్ నాయర్, జైదేవ్ ఉనద్కత్, మనన్ వోహ్రా, కరణ్ శర్మ, సుర్యాంశు షెడ్గె, స్వప్నిల్ సింగ్, అర్పిత్ గులెరియ. (ట్రేడ్ ఇన్ : షెఫర్డ్, అవేశ్ ఖాన్. ట్రేడ్ అవుట్ : దేవదత్ పడిక్కల్)

గుజరాత్ టైటాన్స్ : యశ్ దయాల్, కె.ఎస్ భరత్, శివం మావి, ఉర్విల్ పటేల్, ప్రదీప్ సంగ్వాన్, ఒడీన్ స్మిత్, అల్జారీ జోసెఫ్, శనక.

ముంబయి ఇండియన్స్ : అర్షద్ ఖాన్, రమన్‌దీప్ సింగ్, హృతిక్ షోకీన్, రాఘవ్ గోయల్, జోఫ్రా ఆర్చర్, ట్రిస్టన్ స్టబ్స్, డ్యాన్ జాన్సెన్, జై రిచర్డ్‌సన్, రైలీ మెరెడిత్, క్రిస్ జోర్డాన్, సందీప్ వారియర్.

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : వానిందు హసరంగ, హర్షల్ పటేల్, జోశ్ హేజిల్‌వుడ్, ఫిన్ అలెన్, మైకల్ బ్రాస్‌వెల్, డెవిడ్ విల్లే, వేనీ పార్నెల్, సోను యాదవ్, అవినాశ్ సింగ్, సిద్దార్థ్ కౌల్, కేదార్ జాదవ్.

బంతితోనూ మెరిసి..!

- రెండో టీ20లో భారత్ గెలుపు
- యశస్వి, కిషన్, గైక్వాడ్ అర్థ సెంచరీలు
- భారత్ 235/4, ఆస్ట్రేలియా 191/9



నవతెలంగాణ-తిరువనంతపురం : రెండో టీ20లో భారత్ 44 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. బ్యాటర్లు పరుగుల వరద పారించగా, బౌలర్లు కంగారూ బ్యాటర్లను కట్టడి చేసి ఆతిథ్య జట్టుకు వరుసగా రెండో విజయాన్ని కట్టబెట్టారు. దీంతో ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. యశస్వి జైస్వాల్ (53, 25 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (58, 43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (52, 32 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో కదం తొక్కటంతో తొలుత భారత్ 235/4 పరుగుల భారీ స్కోరు చేసింది. రింకూ సింగ్ (31 నాటౌట్, 9 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) తనదైన ధనాధన్ ఆటతో అలరించాడు. ఛేదనలో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులే చేసింది. స్టొయినిస్ (45), వేడ్ (42 నాటౌట్), డెవిడ్ (35) పోరాడినా కంగారూలకు ఓటమి తప్పలేదు. సిరీస్‌లో మూడో టీ20 మంగళవారం గువహటిలో జరుగనుంది.

పరుగుల వరద : తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (53) అదిరే ఆరంభం అందించాడు. స్వింగ్ లభించిన పిచ్‌పై ఆరంభంలో వికెట్లు ఆశించిన ఆసీస్‌కు జైస్వాల్ భంగపాటే మిగిల్చాడు. సీన్ అబాట్ ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో విశ్వరూపం చూపించిన జైస్వాల్.. 24 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. జైస్వాల్ జోరుతో భారత్ 3.5 ఓవర్లలోనే 50 పరుగుల మార్క్ దాటింది. జైస్వాల్ నిష్క్రమించినా.. మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (58) జతగా ఇషాన్ కిషన్ (52) రెచ్చిపోయాడు. గైక్వాడ్ స్ట్రయిక్ రొటేట్ చేయగా.. కిషన్ సిక్సర్ల వర్షం కురిపించాడు. కిషన్ 29 బంతుల్లో అర్థ సెంచరీ సాధించగా, గైక్వాడ్ 39 బంతుల్లో కొట్టాడు. సూర్య కుమార్ (19) తొలి బంతినే సిక్సర్‌గా మలిచి జోరు కొనసాగించగా.. ఇన్నింగ్స్‌కు రింకూ సింగ్ (31 నాటౌట్) అదిరే ముగింపు అందించాడు. అబాట్ వేసిన ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. చివర్లో తెలుగు తేజం తిలక్ వర్మ (7 నాటౌట్) సైతం ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎలిస్ (3/45) మూడు వికెట్లు పడగొట్టాడు.

రన్నరప్ సాత్విక్ జోడీ

ఫైనల్లో టాప్ సీడ్ ఓటమి
చైనా మాస్టర్స్ సూపర్ 750

షెంజెన్ (చైనా) : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ సూపర్‌స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీ రన్నరప్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో వరల్డ్ నం.1 చైనా జోడీ చేతిలో టాప్ సీడ్ సాత్విక్, చిరాగ్ పోరాడి ఓడారు. మూడు గేముల పాటు హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో సాత్విక్ జోడీ 19-21, 21-19, 19-21తో టైటిల్‌ను చేజార్చుకుంది. 71 నిమిషాల పాటు సాగిన ఫైనల్లో మనోళ్లు రెండో గేమ్ నెగ్గినా.. తొలి, చివరి గేమ్‌లను ఆఖర్లో ఓడారు. తొలి గేమ్‌లో 19-19 వద్ద నుంచి వరుసగా రెండు పాయింట్లు కోల్పోయిన సాత్విక్, చిరాగ్‌లు.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 13-19 నుంచి వరుస పాయింట్లతో పుంజుకున్నా ఫలితం లేకపోయింది. ఈ ఏడాది నాలుగు టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరిన సాత్విక్, చిరాగ్‌లకు టైటిల్ పోరులో ఇదే తొలి పరాజయం. మహిళల సింగిల్స్‌లో చెన్ యుఫెయ్ (చైనా), మెన్స్ సింగిల్స్‌లో కొడాయ్ నరొక (జపాన్) చాంపియన్స్‌గా నిలిచారు.



నవచిత్రం

మట్కా కోసం భారీ హంగులు



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్, 'పలాస' దర్శకుడు కరుణ కుమార్ కాంబోలో వస్తున్న తొలి పాన్ ఇండియన్ చిత్రం 'మట్కా'. ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ ఎత్తున నిర్మించనున్న ఈ చిత్రం డిసెంబర్ నుండి సెట్స్‌పైకి వెళ్లనుంది.

ప్రీ-ప్రొడక్షన్ ఫార్మాలిటీస్‌తో టీమ్ బిజీగా ఉంది. 1958-1982 మధ్య జరిగే కథ కావడంతో 50, 80ల మధ్య వాతావరణాన్ని రిక్రియేట్ చేయడానికి భారీ సెట్‌లు రూపొందించారు. యావత్ దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కనున్న ఈ కథ వైజాగ్ నేపథ్యంలో సాగుతుంది. హైదరాబాద్‌లో ఓల్డ్ వైజాగ్ సిటీని తలపించే భారీ సెట్‌ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. నలుగురు ఫైట్ మాస్టర్‌లు యాక్షన్‌ని పర్యవేక్షిస్తారు.

24 ఏళ్ల స్పాన్ కలిగిన ఈ కథలో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్‌లలో కనిపించనున్నారు. వరుణ్ తేజ్‌కు హయ్యస్ట్ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా ఉండే ఈ సినిమా కోసం ఆయన పూర్తి మేక్‌ఓవర్ అవుతున్నారు. వరుణ్ తేజ్ సరసన నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర, కన్నడ కిషోర్ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు అని చిత్ర బృందం తెలిపింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైన్: ఆశిష్ తేజ, ఆర్ట్: సురేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - ఆర్కే జానా.

సీట్ ఎడ్జ్ ఎమోషనల్ థ్రిల్లర్



బసవతారకరామ క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం 1గా తన కుమారుడు చైతన్య కృష్ణని హీరోగా పరిచయం చేస్తూ నందమూరి జయకృష్ణ నిర్మించిన సీట్ ఎడ్జ్ ఎమోషనల్ థ్రిల్లర్ 'బ్రీత్'. వైద్యో నారాయణో హరి అనేది ట్యాగ్ లైన్. వంశీకృష్ణ ఆకెళ్ళ దర్శకుడు.

డిసెంబర్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. హీరో నందమూరి చైతన్య కృష్ణ మాట్లాడుతూ,'మా తాతయ్య నందమూరి తారక రామారావు, మా నాన్నమ్మ బసవతారకం నాకు స్ఫూర్తి. వారి ఆశీస్సులతో 'బసవతారకరామ క్రియేషన్స్' బ్యానర్ పెట్టి పరిశ్రమలోకి అడుగుపెడుతున్నాను. నాన్న మంచి కథతో సినిమా చేయమని చెప్పారు. దర్శకుడు వంశీకృష్ణ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మంచి సందేశంతో సమాజానికి అవసరమైన కథ ఇది. వంశీ అద్భుతమైన కాన్సెప్ట్‌తో అన్నీ విషయాల్లో జాగ్రత్త తీసుకుని ఈ సినిమాని తీర్చిదిద్దారు. భవిష్యత్‌లో మేము మళ్ళీ కలసి పని చేస్తాం. మా బాబాయ్ బాలకృష్ణ, బి గోపాల్, కోడిరామకృష్ణది ఎలా హిట్ కాంబినేషన్‌గా నిలిచిందో మాది కూడా తప్పకుండా హిట్ కాంబినేషన్ అవుతుంది' అని అన్నారు.

నందమూరి జయకృష్ణ మాట్లాడుతూ,'ఇదొక మంచి ఎమోషనల్ థ్రిల్లర్. చైతన్య కృష్ణ చాలా అద్భుతంగా చేశాడు. దర్శకుడు వంశీ కథ, స్క్రీన్‌ప్లేతో పాటు చాలా గొప్పగా డైరెక్ట్ చేశారు. సినిమా చూశాను. చాలా వండర్ ఫుల్‌గా వచ్చింది. తప్పకుండా మీరంతా ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.

'ఈ చిత్రానికి కర్త,కర్మ,క్రియ నందమూరి చైతన్య కృష్ణ. ఈ సినిమాతో ఆయన ఒక వెర్సటైల్ హీరోగా ప్రూవ్ అవుతారు. చేసిన మొదటి సినిమానే చాలా వెర్సటైల్ కాన్సప్ట్ చేశారు. సినిమా అంతా ఒకే ఎమోషన్‌ని మెంటైన్ చేయడం కష్టం. అలాంటి అరుదైన పాత్ర చేశారు. ఆ పాత్రలోని ఎమోషన్ అందరికీ కనెక్ట్ అవుతుంది' అని అన్నారు.

ప్రతీకార జ్వాలతో వచ్చేస్తోంది

హారర్ కామెడీ జోనర్‌లో అంజలి ప్రధాన పాత్రధారిగా నటించిన బ్లాక్‌బస్టర్ 'గీతాంజలి'. అయితే ప్రతీకార జ్వాలతో మళ్లీ వచ్చేస్తోంది గీతాంజలి అంటూ గీతాంజలి సీక్వెల్‌ను స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. 'గీతాంజలి మళ్లీ వచ్చింది' అనే పేరుతో సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. రైటర్, ప్రొడ్యూసర్ కోన వెంకట్ సమర్పణలో ఈ సీక్వెల్‌ను ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్య నారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. శివ తుర్లపాటి డైరెక్టర్‌గా ఈ చిత్రంతో పరిచయం అవుతున్నారు.



కథానాయిక అంజలి నటిస్తున్న 50వ సినిమా ఇది. అంజలి, శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్, షకలక శంకర్‌లతో పాటు ఈ సీక్వెల్‌లో సత్య, సునీల్, రవిశంకర్, శ్రీకాంత్ అయ్యంగార్, మలయాళ నటుడు రాహుల్ మాధవ్ ఇతర పాత్రల్ని పోషిస్తున్నారు. 'ఇప్పటి వరకు 80 శాతం చిత్రీకరణను పూర్తి చేశాం. ఊటీలో ఓ షెడ్యూల్‌ను చిత్రీకరించాల్సి ఉంది. ఆ షెడ్యూల్‌తో చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది. సినిమాను వచ్చే ఏడాది ప్రారంభంలో దక్షిణాది భాషల్లో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని మేకర్స్ తెలిపారు.

దేవుడిని రాజకీయాలకు వాడుకుంటున్నారు

ధర్మం పేరిట మతాల మధ్య చిచ్చు : బీజేపీ నేతలపై దిగ్విజయ్‌సింగ్ ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'రాముడు అందరివాడు.అందరికీ ప్రియమైనవాడు' బీజేపీ మాత్రం దేవుని రాజకీయాలకు వాడుకుంటున్నదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్ ఆరోపించారు. ధర్మం పేరిట మతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతున్నదని విమర్శించారు. విభజన రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని ఆ పార్టీ బలహీనపరుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదరికం, నిరుద్యోగం భారీగా పెరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలోనూ అలాంటి పరిస్థితే ఉన్నదనీ, ఎవరూ సంతోషంగా లేరని తెలిపారు. రైతులు, నిరుద్యోగులు అందరూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పేపర్ లీకులతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు.



26/11 దాడుల్లో మరణించిన వారికి ఆయన నివాళులర్పించారు. భారత రాజ్యాంగంలో అన్ని వర్గాలకూ సమన్యాయం జరిగేలా, వారి బతుకులు బాగుపడేలా అంబేద్కర్ హక్కులు కల్పించారని తెలిపారు.

తెలంగాణ అమర వీరుల ఆకాంక్షలు నెరవేరలేదు
ఏఐసీసీ జాతీయ నేత కన్నయ్య కుమార్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమర వీరుల ఆకాంక్షలు నెరవేరలేదని ఏఐసీసీ జాతీయ నేత కన్నయ్య కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ నేతలతో కలిసి ఆయన 'తెలంగాణ ఎలక్షన్ క్వశ్చన్ పేపర్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కన్నయ్యకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజు ఈ పేపర్ ఫలితాలు వస్తాయని ఎద్దేవా చేశారు. విద్యార్థిని ప్రవళికది ఆత్మహత్య కాదనీ, ఈ వ్యవస్థలో సర్కార్ చేసిన హత్య అని చెప్పారు. పదేండ్లలో ఉద్యోగాల భర్తీ సక్రమంగా జరగలేదన్నారు.తెలంగాణ ప్రజలకు వచ్చిన ఏ ఒక్కహామీని సీఎం కేసీఆర్ నెరవేర్చలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం ఓయూ కేంద్రంగా జరిగిందన్నారు. ఆ విద్యార్థులను బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదని విమర్శించారు.

మార్పు కోరుతున్న తెలంగాణ ప్రజలు

ఏమీ ఇయ్యని ఈ సీఎం మనకు అవసరమా?

ఎన్నికల ప్రచార సభల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు/ నారాయణపేట టౌన్

కేసీఆర్ పాలనలో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు మార్పు కోరుతున్నారు.. మనకు ఏమీ ఇయ్యని ఈ ముఖ్యమంత్రి అవసరమా? అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో, మహబూబ్‌నగర్, నారాయణపేటల్లో సభలు, రోడ్‌షోల్లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష.. ఆత్మగౌరవం నిలబెట్టే విధంగా ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతానికి వచ్చి ఉపాధి అవకాశాలు పొందుతున్నారంటే ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవేనని చెప్పారు. ఒకప్పుడు రబ్బరు చెప్పులు లేనోళ్లు.. ఇప్పుడు విమానాల్లో తిరుగుతూ ఫామ్‌హౌస్‌లో గడుపుతున్నారని విమర్శించారు. మీ ఊరు చింతమడకలో నువ్వు చదివిన బడి, గుడి, నీళ్ళు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. 2014లో మహిపాల్ రెడ్డి ఆస్తి ఎంత.. ఇప్పుడు ఎంత అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దగ్గర నాయకులు ఉండొచ్చు, ఆక్రమించుకున్న భూములు ఉండొచ్చు కానీ తమ దగ్గర ప్రజాబలం ఉందన్నారు. ఏమి ఇయ్యని వ్యక్తి.. మూడోసారి ముఖ్యమంత్రిగా అవసరమా అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక తప్పకుండా కేసీఆర్‌కు చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామని హెచ్చరించారు.

ఈసారి ప్రజలంతా ముక్తకంఠంతో మార్పు కోరుకుంటున్నారని, ఈ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కాటా శ్రీనివాస్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.నారాయణపేట గడ్డ కాంగ్రెస్‌కు అడ్డ అని రేవంత్ రెడ్డి అన్నారు. నాడు రాష్ట్రం ఏర్పడితే నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొందరికి మాత్రమే లాభం చేరుకుందన్నారు. 69 జీవో ప్రకారం సాగునీరు అందుతుందని, కానీ ఆ జీవోను అమలు పరచక తమ సొంత లాభాల కోసం జీఓని మూసి పెట్టారని చెప్పారు. అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నట్టు ప్రకటించిన రాజేందర్ రెడ్డి ఎందుకు అభివృద్ధి పరచలేదని ప్రశ్నించారు. ఎందుకు రైల్వే లైన్ మంజూరు చేయించలేదని, కొడంగల్ - నారాయణపేట పథకం ఎందుకు కాలేదని ప్రశ్నించారు. ప్రతి ఎకరాకు నీరు అందించిన తర్వాతే ఎన్నికల్లో పాల్గొంటానని శపథం చేసిన ఎస్ రాజేందర్ రెడ్డి.. అది చేయకుండా ఎన్నికల బరిలో ఎందుకు నిలబడ్డారని నిలదీశారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. చిట్టెం పర్ణికరెడ్డికి ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



కర్నె శిరీష... నిండా పాతికేండ్లు కూడా లేని నిరుపేద అమ్మాయి. అయినా పెద్ద పెద్ద రాజకీయ నాయకులకు ముచ్చెమటలు పట్టిస్తుంది. రెండేండ్ల కిందట సోషల్ మీడియాలో ఆమె పెట్టిన ఓ చిన్న వీడియో రాష్ట్ర వ్యాప్తంగా హల్‌చల్ చేసింది. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యను ముప్పై సెకండ్ల ఆ వీడియోలో ఎత్తి చూపింది. అప్పటి నుండి బర్రెలక్కగా అందరికీ పరిచయమయింది. ఇప్పుడు కొల్లాపూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా స్వతంత్రంగా పోటీ చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

మా అమ్మమ్మలకు పెన్షన్ కాదు
మాకు ఉద్యోగం కావాలి

'ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేస్తూ హైదరాబాద్‌లో ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం చేసేదాన్ని. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఏడు వరకు పని చేసినా ఇచ్చే జీతం తక్కువ. నాకు చిన్నప్పటి నుండి ప్రశ్నించే తత్వం ఎక్కువ. పని గంటల గురించి బాగా అడిగేదాన్ని. దాంతో ఉద్యోగం నుండి తీసేశారు. దాంతో డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించా. గ్రూప్ పరీక్షలు వాయిదా పడుతూనే ఉన్నాయి. దాంతో ఊరికి వచ్చేసి అమ్మకు తోడుగా ఏదో ఒక పని చేయాలనుకున్నా. ఏం చేయాలా అని ఆలోచిస్తుంటే బర్రెలు కొనుక్కుందామని నాలుగు బర్రెలు కొన్నా. అప్పటికే సరదాగా చిన్న చిన్న కామెడీ రీల్స్ చేసి పోస్ట్ చేస్తుండేదాన్ని. బర్రెలు కొన్న తర్వాత రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు అందరికీ తెలియాలని ఓ వీడియో చేసి పెట్టా. అంతే నాపై కేసు పెట్టారు. నిజాలు చెప్తే ఇలా చేస్తారా? అనే ఆలోచన అప్పుడే వచ్చింది. అలాగే మా నాన్న రెండేండ్ల కిందట మమ్మల్ని వదిలిపెట్టి ఎటో వెళ్ళిపోయాడు. ఆయన బాగా తాగుతాడు. మాకు పది కుంటల పొలం వుండేది. ధరణి వచ్చిన తర్వాత ఎవరి పేరున ఉన్న పొలం వాళ్ళకు అమ్ముకునే హక్కు వచ్చిందంట. దాంతో మా నాన్న మాకెవ్వరికీ తెలియకుండా ఆ కాస్త పొలం అమ్ముకొని పొయ్యాడు. ఆ పొలం కోసం ఎంతో మందిని కలిశాను. ఎమ్మార్వోలు, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగాను. కేసుపై కోర్టుకు వెళితే నన్ను ఎగతాళి చేసేవారు. ఇవన్నీ నా మనసులో అలాగే ఉండిపోయాయి. అందుకే యువత సమస్యలు అసెంబ్లీలో వినిపించాలని ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనుకున్నా' అంటుంది శిరీష.

యువత మొత్తం అమ్మ పిల్లలే

'ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అమ్మకు చెబితే ముందు నవ్వింది. నీకెందుకే ఇవన్నీ అని తిట్టింది. నేను చేస్తానని గట్టిగా చెప్పే సరికి మన దగ్గర చిల్లి గవ్వ లేదు. ఎమ్మెల్యే అంటే పది నుండి ఇరవై లక్షలు ఖర్చు పెట్టాలి. అంత డబ్బు ఎక్కడి నుండి తెస్తావు వద్దు' అని కోప్పడింది. నేను మాత్రం తర్వాత రోజు కాలేజీలో పనుందని చెప్పి వచ్చి నామినేషన్ వేశాను. ఆ విషయం తెలుసుకుని మా అమ్మ బాగా తిట్టింది. కానీ తర్వాత నాకు వస్తున్న మద్దతు, మా ఇంటికి వచ్చి అనేక మంది సపోర్ట్ చేయడం చూసి అమ్మ కూడా సంతోషించింది. ప్రచారంలో ఉన్న మా తమ్ముడిపై దాడి చేసినప్పుడు అమ్మ భయపడింది. కానీ మాకు అందరూ మద్దతుగా నిలబడడంతో ధైర్యం వచ్చింది. ఇప్పుడు మా అమ్మకు మేము మాత్రమే కాదు ఈ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువత మొత్తం పిల్లలే. కాబట్టి మాకు ఎలాంటి భయం లేదు' అంటూ ధైర్యంగా చెబుతుంది శిరీష.

తల్లికి భారం కాకూడదని

శిరీష పుట్టింది నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం, మరికల్ గ్రామం. తల్లి అనురాధ, శిరీషకు ఓ తమ్ముడు ఉన్నాడు. తండ్రి మద్యానికి బానిసై ఇల్లు పట్టించుకునే వాడు కాదు. తల్లి చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టుకొని ఇద్దరు పిల్లలను పెంచుకుంటుంది. ఇప్పుడు అదే శిరీష ప్రచార కేంద్రం. ఊళ్లోని స్కూల్లోనే ఏడోతరగతి వరకు పూర్తి చేసింది. తర్వాత కస్తూర్బా హాస్టల్లో పదో తరగతి వరకు చదివింది. డిప్లొమా కోర్సు చేస్తే ఉద్యోగం వస్తుందని విని అగ్రికల్చర్ డిప్లొమా చేసింది. కానీ రాలేదు. దాంతో ఇంటర్ చదివింది. అయినా ఉద్యోగం రాలేదు. ఇక తన చదువు తల్లికి భారం కాకూడదని ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేస్తూ హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం చేసేది. ఇక్కడ ఉన్నప్పుడు నిరుద్యోగ యువత పడుతున్న కష్టాలను ఆమె కండ్లారా చూసింది.



నిరుద్యోగుల గొంతుకను

'హైదరాబాద్‌లో ఉద్యోగం మానేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుదామనుకున్నా. అయితే ఏడేనిమిది మంది ఒకే రూములో ఉంటూ గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అవుతుండేవారు. తినడానికి తిండి లేక గుడి దగ్గర పెట్టే అన్నదానం దగ్గరకు వెళ్లడం చూశాను. మాలాంటి వారంతా ఏదో ఒక ఉద్యోగం వస్తుందనే కష్టపడి చదువుకుంటారు. కానీ ప్రభుత్వాలు నోటిఫికేషన్లు వేయకుండా మమ్మల్ని మోసం చేస్తున్నాయి. చాలా బాధగా అనిపించింది. అందుకే నేను నిరుద్యోగుల గొంతుక కావాలనుకున్నాను. ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి యువతకు న్యాయం చేద్దామనుకుంటున్నాను. అమ్మమ్మలకు, నాయనమ్మలకు పెన్షన్ ఇస్తే సమస్య పరిష్కారం కాదు, మనవళ్ళకు, మనవరాళ్ళకు ఉద్యోగాలు ఇస్తే ఆ కుటుంబ సమస్య పరిష్కారం అవుతుంది' అంటుంది శిరీష.

ఏం చేస్తుందిలే అనుకున్నారు

నవంబర్ 8న నామినేషన్ వేసినపుడు శిరీష వెనక ఒక్కరు కూడా లేరు. కానీ ఇప్పుడు ఆమె వెంట వేల మంది ఉన్నారు. యువత విజిల్ గుర్తుకే మా ఓటు అంటూ సోషల్ మీడియాలో మెసేజ్లు పెడుతున్నారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యపై గట్టిగా మాట్లాడుతున్న శిరీషకు పూర్తి మద్దతు లభిస్తుంది. స్వతంత్ర అభ్యర్థి, నిరుపేద కుటుంబం నుండి వచ్చింది అందులోనూ ఆడపిల్ల. ఏం చేస్తుందిలే అనుకున్నారు పెద్ద పార్టీల వారు. కానీ ఇప్పుడు నియోజక వర్గంలో ప్రతి గ్రామం నుండి ఆమెకు మంచి ఆధరణ లభిస్తుంది. బర్రెలక్క గెలుపు ఖాయం అనే నినాదం బలంగా వినబడుతోంది. దాంతో ఇప్పుడు పెద్ద పార్టీల వారికి చెమటలు పడుతున్నాయి.



ఇదే నా విజయం...

'ఇప్పటి వరకు పరిపాలించిన వారంతా ఒక్కొక్కరు 20 ఏండ్లు పదవుల్లో ఉన్నారు. ప్రజాప్రతినిధులుగా జీతాలు తీసుకుంటున్నారు, కానీ మా ప్రాంతం మాత్రం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదు. ఇన్నేండ్లు ఏమీ చేయని పాలకులు ఇప్పుడు మాత్రం మాలాంటి వాళ్ళకు ఏదో చేస్తారనే నమ్మకం లేదు. అందుకే నేను ధైర్యంగా నామినేషన్ వేశాను. అందురూ డబ్బు మనుషులే ఉండరు. కాబట్టే చాలా మంది నాకు మద్దతు ఇస్తున్నారు. ప్రచారం చేసుకోవడానికి కార్లు ఇస్తున్నారు. డబ్బు సాయం చేస్తున్నారు. ప్రచారానికి అవసరమైన సామాగ్రి మొత్తం ప్రజలే అందిస్తున్నారు. ఇదే నాకు గొప్ప విజయంగా అనిపిస్తుంది' అంటూ తన గెలుపుపై శిరీష ఎంతో నమ్మకంగా ఉంది.

శిరీషకు ధైర్యం ఎక్కువ

నామినేషన్ వేస్తా అంటే నవ్వి కోప్పడ్డాను. ఏడ్చి ఊరుకుంది. తర్వాత నామినేషన్ వేస్తున్నట్టు కూడా నాకు తెలీదు. కొల్హాపూర్‌లో ఆమెపై కేసు ఉంది ఆ కేసు చూస్తున్న లాయర్ దగ్గర 'అన్నా నేను ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనుకుంటున్నా, అమ్మకు చెప్తే తిట్టింది. నేను ఎలాగైనా నామినేషన్ ఏస్తా' అన్నదంటా. ఆ లాయర్ బాబే శిరీషకు కావల్సిన పేపర్లన్నీ తయారు చేసి ఇచ్చాడంట. దానికి ఐదు వందలు ఖర్చు అయితే ఆ డబ్బు కూడా అతనే ఇచ్చాడు. నామినేషన్ వేసిన తర్వాత ఆమె ఫ్రెండ్స్ నాకు ఫోన్ చేసి చెప్పారు. నాకు ఒకటే భయం. చెప్తే వినదు అని కంగారు పడ్డాను. పైసలు పంచితే తప్ప గెలిచే పరిస్థితి లేదు. మాకేమో వచ్చిన వాళ్ళకు మంచి నీళ్ళు ఇచ్చే శక్తి కూడా లేదు. ఇదంతా అవసరమా అని తిట్టినా. తర్వాత రోజు వెనక్కు తీసుకుంటదిలే అనుకున్నా. కానీ వాళ్ళ సార్‌తో నాతో చెప్పించింది. శిరీష మంచి పని చేస్తుంది. పోటీ చేయనియ్యమని నాకు నచ్చజెప్పారు. తర్వాత చాలా మంది ఇంటికి రావడం చూశాక ధైర్యం వచ్చింది. అయితే కొంత మంది ఇంటికి వచ్చి మీ అమ్మాయిపై ఉన్న కేసు ఎత్తేస్తాం, ఆర్థిక సాయం చేస్తాం' వెనక్కు తీసుకోమని చెప్పు అన్నారు. కానీ ఆమె ఒప్పుకోలేదు. శిరీషకు ధైర్యం ఎక్కువ. తప్పు జరిగితే అస్సలు భరించలేదు. తనని చూస్తుంటే గర్వంగా అనిపిస్తుంది.

- అనూరాధ, శిరీష తల్లి



బలపరుచుకోవాల్సిన బంధం

ఎంత బాధలో ఉన్నాసరే.. ప్రాణ స్నేహితులతో పంచుకుంటే ఆ బాధ తగ్గిపోతుంది. జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. స్నేహితుల తోడు ఉంటే చాలు ప్రపంచాన్ని జయించిన అనుభూతి కలుగుతుంది. విషయం ఏదైనా సరే.. వారితో కష్టసుఖాలను పంచుకోనిదే నిద్ర పట్టదు. మన జీవితంలో స్నేహానికి అంత విలువ ఉంటుంది. కానీ కారణాలు ఏవైనా, కొన్నిసార్లు స్నేహం వికటించే ప్రమాదం ఉంది. మీ స్నేహ బలం పల్చబారుతుందని గుర్తించడానికి కొన్ని మార్గాలున్నాయి. అవేంటంటే...

- ఎంత పెద్ద సమస్యయినా సరే, ఫ్రెండ్‌తో చర్చించడానికి మీరు ఇష్టపడట్లేదంటే ఇద్దరి మధ్య బంధం బలహీనపడుతోందని భావించాలి. వారితో సెట్ కాదు అనుకున్నప్పుడు.. మీరు వారితో మాట్లాడటానికి కూడా ఆసక్తి చూపరు.
- స్నేహితుల్ని తరచూ కలవడం, సరదాగా మాట్లాడటం ఒక ట్రీట్ లాగా అనిపిస్తుంది. కానీ ఇద్దరి మధ్య సఖ్యత లేనప్పుడు ఎందుకు ఎదురుపడ్డామనే భావన కలుగుతుంది. వారు పక్కన ఉన్నంత సేపు ఇబ్బందిగా అనిపిస్తుంది.
- సాధారణంగా స్నేహితుల మధ్య కోపతాపాలకు చోటుండదు. ఒకవేళ కోప్పడినా వెంటనే సారీ చెప్పుకుని కలిసిపోతారు. కానీ స్నేహం సన్నగిల్లుతున్నప్పుడు మాత్రం ఇందుకు వ్యతిరేకంగా అనిపిస్తుంది. వారు మీతో మాట కలిపినా, మీరు వారితో మాట్లాడినా ఏదో ఒక సందర్భంలో చిరాకుగా, కోపంగా అనిపిస్తుంది. మీ స్నేహితులతో చేసే ఎలాంటి చర్చలైనా కోపం తెప్పిస్తాయి.
- ఒకరంటే ఒకరికి పడనప్పుడు, ఎదుటి వారి ప్రవర్తన మారుతుంది. ఒక్కోసారి విచిత్రంగా ప్రవర్తిస్తారు. మీరు మీ స్నేహితుడి గురించి ఆరా తీస్తూనే ఉంటారు. కానీ ఎదుటి వారు మాత్రం.. మీరంటే తనకి ఇష్టం లేనట్లు, మీరు తనకు ముఖ్యమైన వ్యక్తి కాదన్నట్లు ప్రవర్తిస్తారు.
- స్నేహితుల మధ్య మంచి బంధం ఉంటే, ప్రతి చిన్న విషయానికి ప్రశంస లభిస్తుంది. కానీ స్నేహం తగ్గితే, వారు ఎంత పెద్ద లక్ష్యం సాధించినా మీరు పట్టించుకోరు. వారిని మెచ్చుకోవాలనే ఆలోచన కూడా ఇబ్బందిగా అనిపిస్తుంది.
- మీరు మాత్రమే వారిని స్నేహితుడిగా భావిస్తే సరిపోదు. ఇద్దరికీ అదే భావన ఉండాలి. వారు మిమ్మల్ని సరిగా పట్టించుకోకుండా, అంటీ ముట్టనట్లు ఉంటే మాత్రం మీరు ఆలోచించాల్సిందే. మీరు మాత్రమే మీ స్నేహితుడిని పలకరిస్తూ, వారి గురించి ఆరా తీస్తూ ఉంటారు. కానీ వారు మాత్రం మీ కోసం అలా చేయరు.

మోడీ విధానాలను తిప్పికొడదాం



(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ ట్రేడ్ యూనియన్‌లు, ఫెడరేషన్‌లకు చెందిన నాయకులు ఆయా రాష్ట్రాల రాజధానులలో జరిగిన మహాపడావ్‌ల్లో పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే...

మహాపడావ్ లో "ప్రధాన డిమాండ్లలో అన్ని పంటలకు సి2ం50 శాతంతో కూడిన ఎంఎస్పీతో సేకరణకు చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి. అన్ని రైతు కుటుంబాలకు సమగ్ర రుణమాఫీ చేయాలి. విద్యుత్ బిల్లు 2022ను ఉపసంహరించుకోవాలి. నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి. కనీస వేతనం నెలకు రూ. 26,000 ఇవ్వాలి. నిరుద్యోగాన్ని నిర్మూలించాలి. ఉపాధిని ప్రాథమిక హక్కుగా అమలు చేయాలి. రూ.600 రోజువారీ వేతనంతో ఏడాదికి 200 రోజుల ఉద్యోగంతో ఉపాధి హామీని బలోపేతం చేయాలి. ప్రభుత్వ రంగ యూనిట్ల ప్రయివేటీకరణను ఆపాలి. ధరల పెరుగుదలను అదుపు చేయాలి. లఖింపూర్ ఖేరీ రైతుల హత్యకు ప్రధాన కుట్రదారుడు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను తొలగించాలి. ప్రాసిక్యూట్ చేయాలి" వంటి డిమాండ్లను కార్మికులు, రైతులు లేవనెత్తారు.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో గవర్నర్ కార్యాలయాల వద్ద మహా పడావ్ కొనసాగింది. హర్యానా, పంజాబ్ రాజధాని చండీగఢ్, పంచకుల, హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా, ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్, జమ్ము కాశ్మీర్ రాజధాని శ్రీనగర్, ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో, బీహార్ రాజధాని పాట్నా, జార్ఖండ్ రాజధాని రాంచీ, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా, అసోం రాజధాని గౌహతి, ఒడిశా రాజధాని భువనేశ్వర్, ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ, తమిళనాడు రాజధాని చెన్నై, కర్నాటక రాజధాని బెంగుళూరు, కేరళ రాజధాని తిరువనంతపురంతో సహా రాష్ట్ర రాజధానులలో చారిత్రాత్మకమైన ఆందోళనలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు భాగస్వాములయ్యారు.

మోడీ విధానాలపై కన్నెర్ర

మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై నేతలు మండిపడ్డారు. ఈ పోరాటం కార్పొరేట్, మతోన్మాద బంధాన్ని ఓడించడానికి, శ్రమించే ప్రజల ప్రయోజనాలను ముఖ్యంగా రైతులు, కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడానికి దేశంలో విధాన మార్పును నిర్ధారిస్తుందని అన్నారు.

మహాపడావ్ తొలిరోజును విజయవంతం చేసిన కార్మికులు, రైతులందరికీ ఎస్కే ఎం అభినందనలు తెలిపింది. మోడీ ప్రభుత్వం పెత్తనం చేస్తున్న కార్పొరేట్, మతపరమైన ముప్పుల నుంచి దేశాన్ని రక్షించడానికి ఈ మహాపడావ్ చరిత్రలో ఒక సాహసోపేతమైన చర్యగా పేర్కొంది.

హర్యానా, పంజాబ్‌లోని చండీగఢ్ లో ఏఐకేఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, తమిళనాడులోని చెన్నైలో ఏఐకేఎస్ అధ్యక్షుడు విజ్జూ కృష్ణన్, నేతలు షణ్ముగం, డి. రవీంద్రన్, ఒరిస్సాలోని భువనేశ్వర్ లో ఏఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, బీహార్‌లోని పాట్నాలో ఏఐకెఎస్ నేతలు బాదల్ సరోజ్, అవదేష్ కుమార్, బినోద్ కుమార్, హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో ఏఐకెఎస్ ఉపాధ్యక్షులు ఇంద్రజిత్ సింగ్, పుష్పేంద్ర త్యాగి, కేరళలోని తిరువనంతపురంలో ఏఐకెఎస్ నేతలు ఎం. విజయకుమార్, వల్సన్ పనోలీ, మహారాష్ట్రలోని ముంబాయిలో అజిత్ నావలే, త్రిపురలోని అగర్తలాలో పబిత్రా కర్, ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో పుష్పేంద్ర త్యాగి, ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో ఏఐకేఎస్ కోశాధికారి పి.కృష్ణప్రసాద్, ముక్తా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవచరిత్రను మరవొద్దు

యాదాద్రి-భువనగిరి నుంచి బి.బసవపున్నయ్య

సాయుధ తెలంగాణ పోరాట స్ఫూర్తితో అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ అఖిల భారత ప్రధానకార్యదర్శి సీతారాంఏచూరీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విప్లవ చరిత్రను మరవొద్దని హితవు పలికారు. "రజకార్లకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర మనది, మరోసారి ఆ తెగువ ప్రదర్శించాలి, అసెంబ్లీకి ఎర్రజెండా అభ్యర్థులను పంపాలి" అని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) అభ్యర్థులకు ఓటేస్తే, మీకు మీరు ఓటేసుకున్నట్టేనని వ్యాఖ్యానించారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సాయుధ పోరాట అనంతరం 10 వేల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర మన గడ్డకు ఉందని గుర్తు చేశారు. భూసంస్కరణలకు మూలం తెలంగాణ సాయుధ పోరాటమని స్పష్టం చేశారు. ఆదివారం యాదాద్రి-భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి, మునుగోడు, నకిరెకల్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ భారీ రోడ్డుషో నిర్వహించారు. దీనికి ఆయా నియోజకవర్గాల నుంచి వేలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏచూరీ మాట్లాడుతూ కమ్యూనిస్టుపార్టీ నేత రావినారాయణరెడ్డిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అప్పటి ఎన్నికల్లో పోటీచేసిన రావినారాయణరెడ్డికి భారత తొలి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ ఓట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల అధికారాలను కాపాడుకోవాలన్నా, గౌరవించాలన్నా మనం చైతన్యవంతులం కావాలని అన్నారు. ప్రజా సమస్యలను శాసనసభలో సమగ్రంగా చర్చించే సత్తా సీపీఐ(ఎం) అభ్యర్థులకే ఉంటుందన్నారు. అసెంబ్లీలో సీపీఎం ఎమ్మెల్యేలు లేని లోటు ఇటీవల సమావేశాలను పరిశీలిస్తే స్పష్టంగా కనిపిస్తున్నదని అభిప్రాయపడ్డారు. మన కోసం మనం ముందుకు రావాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ రాజకీయాలను వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. ఆ పార్టీలు, వారి నాయకులు ప్రజాసేవ చేస్తున్నారా ? సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారా ? అంటూ ప్రశ్నించారు. గత పదేండ్ల కాలంలో కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు కార్పోరేట్లకు 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా ప్రజల సొమ్మని గుర్తు చేశారు. రైతుల రుణాలు మాత్రం మాఫీ చేయలేదని విమర్శించారు. ఒక్క శాతంగా ఉన్న ధనికుల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని తప్పుబట్టారు. పేదలను నష్టపరుస్తూ, బడాపెట్టుబడిదారులకు లాభం చేకూర్చడాన్ని ఖండించారు. మానవాభివృద్ధి సూచికల్లో భారతదేశం చాలా వెనుకబడిందని చెప్పారు. దేశంలో 70 శాతం యువజనులకు ఉపాధి లేకపోవడం అత్యంత దారుణమని అన్నారు. ఈ దేశానికి కావాల్సింది నేతలు, నాయకులు కాదనీ, విధానాలు, నీతి, నిజాయితీ కావాలని చెప్పారు. ఎన్నికలు రాగానే గ్యాస్ ధర గుర్తొంచిందా ? రూ.400 ఉన్న రేటును రూ.1000కి పెంచి, ఎన్నికలు దగ్గరకురాగానే రూ. 200 తగ్గిస్తే సరిపోతుందా అని మోడీ సర్కారును ప్రశ్నించారు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో మెజారిటీ లేకున్నా, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్న దుష్ట చరిత్ర బీజేపీదని చెప్పారు. గోవా, మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో ఈతరహాలోనే బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలుగా గెలుస్తారు, అమ్ముడుపోతున్నారని ఆవేదన, అసహనం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించడం ద్వారా అలాంటి రాజకీయాలను తిరస్కరించాలని ప్రజలను కోరారు. తద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

భువనగిరి నిండా ఎర్రజెండా

సీతారాంఏచూరీ రోడ్డుషోకు వేలాది మంది హాజరయ్యారు. భువనగిరిలోని రైల్వేస్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డుషో సాగింది. ప్లకార్డులు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఎర్రజెండాలతో భువనగిరి జిల్లా కేంద్రం అరుణారుణవర్ణమైంది. యువత, మహిళలు, విద్యార్థులు, పిల్లలు, వృద్ధులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన రోడ్డు షో దాదాపు గంటన్నరపాటు సాగింది. డప్పు, కోలాటాల బృందాలు పదం పాడుతూ కదం తొక్కుతూ ముందుకు నడిచాయి. భువనగిరి, మునుగోడు, నకిరెకల్ నియోజకవర్గాల నుంచి వాహనాల్లో భారీగా తరలివచ్చారు. ఎరుపులో మెరుపుంది పోరాడే శక్తుంది, ఎర్రజెండా వర్ధిల్లాలి, సుత్తికొడవలి నక్షత్రం గుర్తుకే మన ఓటు అంటూ నినాదాలు హోరెత్తాయి.

త్యాగాలు చేసిన వారిని అసెంబ్లీకి పంపాలి

ప్రజాసమస్యల కోసం పోరాడిన వారిని, త్యాగాలు చేసిన వారిని చట్టసభలకు పంపాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు వ్యాఖ్యానించారు. వందల కోట్లతో ఎమ్మెల్యేలుగా ఎన్నికై ప్రజలను పట్టించుకోకుండా తమ ఆస్తులను పెంచుకుంటున్నారన్నారు. ఓట్లు కొనుక్కోవడానికి వచ్చే అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఆకోవకు చెందినవారేనని గుర్తు చేశారు. వ్యాపారాలు, కాంట్రాక్టుల కోసం రాజకీయాలు చేస్తున్నవారిని ఎన్నికల్లో ఓడించాలని కోరారు. నిరంతరం ప్రజల కోసం, ప్రజల మధ్య ఉంటు ప్రజాఉద్యమాలు చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తమ ఓటు పోటుతో సమాజంలోని అసమానతలను తొలగించుకునే అవకాశం ఉందన్నారు. మతోన్మాదం పేరుతో రెచ్చగొట్టి ప్రజలమధ్య చిచ్చుపెట్టే బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఉపాధి హామీ పథకం, పింఛన్లు, రైతుబంధు, ఉచిత కరెంటు పథకాలు నేడు అమలవుతున్నాయని గుర్తు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన బహిరంగసభకు సీపీఐ(ఎం) యాదాద్రి-భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అధ్యక్షత వహించగా భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొండమడుగు నర్సింహ, మునుగోడు అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి, నకిరెకల్ అభ్యర్థి బొజ్జ చినవెంకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బట్టుపల్లి అనురాధ, మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేషం, మాటూరి బాలరాజు, మంగ నర్సింహులు, దాసరి పాండు, రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, ఆనగంటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ, కేసీఆర్‌లను ఓడించాలి

(మొదటిపేజీ తరువాయి)

మోడీ, రాష్ట్రంలో కేసీఆర్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేట, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభల్లో ఆయన ప్రసంగించారు. దేశంలో నరేంద్ర మోడీ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీకి బీఆర్ఎస్, ఎంఐఎంలు సపోర్ట్ చేస్తున్నాయని విమర్శించారు. అందుకే రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వానికి మోడీ అండగా ఉంటున్నారని ఆరోపించారు. అసోం, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎంఐఎం పార్టీకి అభ్యర్థులు లేకున్నా.. బీజేపీ వారికి అభ్యర్థులను ఇచ్చి పోటీకి ప్రోత్సహిస్తున్నదన్నారు. తెలంగాణలో అవినీతి ప్రభుత్వానికి, ప్రజలకు ఈ ఎన్నికల యుద్ధం జరుగుతోందని చెప్పారు. కాంగ్రెస్ ఏం చేసిందని కేసీఆర్ అంటున్నారని.. కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చిందని, తెలంగాణలో ప్రతి ఒక్కటీ తెచ్చిందని చెప్పారు.

కేసీఆర్ దోచుకున్న సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే జప్తు చేసి ప్రభుత్వానికి అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ధరణితో పేదల భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. నిరుద్యోగ యువతను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను అధికారంలోకి రాగానే నెరవేరుస్తామ న్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, దేశంలోనూ తమ ప్రభుత్వం ఏర్పడటానికి ఇక్కడి నుంచే నాంది పలుకుతున్నామని చెప్పారు. జోగిపేటలో దామోదరను, సంగారెడ్డిలో జగ్గారెడ్డిని, కామారెడ్డిలో రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, నాయకులు షబ్బీర్ అలీ, కేసి గోపాల్, సురేష్ షెట్కార్, అద్దంకి దయాకర్, త్రిష, కృష్ణారెడ్డి, పద్మనాభ రెడ్డి, సంగమేశ్వర్, సురేందర్ గౌడ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ కుటుంబాన్ని జైలుకు పంపుతాం

నవతెలంగాణ/గజ్వేల్, తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)/ ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

"రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పట్టని ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ఇక విశ్రాంతి ఇద్దాం.. లిక్కర్ కుటుంబాన్ని జైల్‌కు పంపుదాం" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్, నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభల్లో మోడీ ప్రసంగించారు. 'ప్రజలకు అందుబాటులో ఉండరు.. ప్రగతి భవన్, ఫాంహౌజ్‌కు పరిమితమైన ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రానికి అవసరం లేదు. ఆయన సేవలకు సెలవు ఇద్దాం. పదేండ్లలో కేసీఆర్ కనీసం సచివాలయానికి కూడా వెళ్లలేదు' అని మోడీ విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. స్కాంల పేరిట ఈ రెండు కుటంబాలు స్కాంలు చేస్తున్నాయని ఆరోపించారు. సోనియాగాంధీ, కేసీఆర్ కుటుంబాల స్కాంలపై విచారణ జరుగుతోందని, మొబైల్ మార్చినంత మాత్రాన మోసాలు బయటకు రాకుండా ఉండవన్నారు. కొందరు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, బీజేపీ ప్రభుత్వం రాగానే వారిని జైల్‌కు పంపడం మోడీ గ్యారంటీ అని అన్నారు. గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై ఓడిపోతాననే కేసీఆర్ మరో నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని ప్రజలను కోరారు. బీజేపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, నందీశ్వర్‌గౌడ్, మురళీదర్‌యాదవ్, పంజా విజయ్‌కుమార్, రాజు ముదిరాజ్, దేవి శ్రీకాంత్‌రెడ్డి తూప్రాన్ సభలో పాల్గొన్నారు.

ధరణి పేరుతో బీఆర్ఎస్ భూ మాఫియా

తెలంగాణ ప్రభుత్వం పేదల భూములు లాక్కొనేందుకే ధరణి తీసుకొచ్చిందని భూమాఫియాకు పాల్పడుతోందని ప్రధాని ఆరోపించారు. తెలంగాణలో వేల కోట్ల సాగునీటి కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ సుల్తాను పాలన సాగిస్తే.. బీఆర్ఎస్ నిజాం పాలనను తలపిస్తోందని తెలిపారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బీజేపీ అధికారంలోకి రాగానే పెట్రోల్ ధరలు తగ్గిస్తామని హామీనిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు కమిటీ వేశామన్నారు. 2024లోనూ కేంద్రంలో తమ ప్రభుత్వమే వస్తుందన్నారు.

డిసెంబర్ 2న అఖిల పక్ష సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. సమావేశాలు డిసెంబర్ 4న ప్రారంభమై డిసెంబర్ 22న ముగుస్తాయి. సమావేశం ప్రారంభానికి ఒక రోజు ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. కానీ డిసెంబర్ 3న ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు కారణంగా ఈసారి అది ఒక రోజు ముందుకు అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కీలక బిల్లులను ఆమోదించడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై వచ్చిన "క్యాష్ ఫర్ క్వైరీ" ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ నివేదికను లోక్‌సభ సెషన్‌లో ప్రవేశపెట్టనున్నారు. ప్యానెల్ సిఫారసు చేసిన బహిష్కరణ అమలులోకి రాకముందే సభ నివేదికను ఆమోదించాల్సి ఉంటుంది. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో మూడు కీలక బిల్లులను సెషన్‌లో పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే హెూమ్‌పై స్టాండింగ్ కమిటీ ఇప్పటికే మూడు నివేదికలను ఇటీవల ఆమోదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన మరో కీలక బిల్లు పార్లమెంటులో పెండింగ్‌లో ఉంది. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ ప్రతిపక్షాలు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ల నిరసనల మధ్య పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో ఆమోదానికి రాలేదు. ఎందుకంటే ఇది క్యాబినెట్ కార్యదర్శి హెూదాతో సమానంగా సీఈసీ, ఈసీల హెూదాను తీసుకురావాలని కోరుతోంది.

ఆ ఇద్దరు కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోండి.. : బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీకి చెందిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌పై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నేతలు ఎ.తిరుపతిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్... ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో ఫసియుద్దీన్‌పై వారు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు.



హక్కుల కోసం పోరాడేది సీపీఐ(ఎం) ఒక్కటే

ప్రజలందరి సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యం : పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

- సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- ఎర్ర జెండాల రెపరెపలతో ఎరుపెక్కిన పటాన్‌చెరు
- మల్లికార్జున్ గెలుపునకు వేలాది బైక్‌లతో భారీ ర్యాలీ

ప్రజలు, కార్మికుల హక్కుల కోసం చట్ట సభల్లో నిలదీసేందుకు సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. పటాన్‌చెరులో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, రియల్ ఎస్టేట్ దందా చేసేవాళ్లు కావాలా..? కార్మిక, శ్రామిక ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టులు కావాలో.. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

నవతెలంగాన-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి జె.మల్లికార్జున్ గెలుపును కాంక్షిస్తూ ఆదివారం బీరంగూడ నుంచి రుద్రారం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్మికులు ఎర్రజెండాలు చేతబూని దండుగా కదం తొక్కారు. పటాన్‌చెరు ఎరుపుమయమైంది. ఐదు గంటల పాటు బైక్ ర్యాలీ కొనసాగింది. బైక్ ర్యాలీని ప్రారంభించిన రాఘవులు అనంతరం మాట్లాడారు.

సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంకేమం కోసం పాటుపడేది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై శాసన సభలో గళమెత్తే అవకాశం వచ్చిందని, సీపీఐ(ఎం) అభ్యర్థిని ఆదరించి.. ఓట్లేసి ఆశీర్వదించాలని కోరారు. యాజమాన్యాల మేలు కోరే పాలకులు కార్మికులకు ఆపద వస్తే ఎలా ముందుకు వస్తారని ప్రశ్నించారు. పారిశ్రామిక ప్రాంతంగా విస్తరించినా నియోజకవర్గంలో కార్మికులు, ప్రజలకు కనీస సౌకర్యాలను మెరుగుపర్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృషి చేయలేదన్నారు.

పటాన్‌చెరు ప్రాంతంలో పాలకులు అప్రమత్తంగా లేకపోవడం వల్లే కాలుష్యం కోరలు చాచి ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, మరి ప్రతి ఇంట్లో ఆర్వో వాటర్ మిషన్లు ఎందుకు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ విధానాలు ఒక్కటేనని విమర్శించారు. ఒకరు చేసిన తప్పులను మరొకరు ఎత్తిచూపుకోవడం వల్ల ప్రజలకు జరిగే మేలేముందన్నారు. కార్మికులు, పేదలు, శ్రామికుల పక్షాన ఎళ్ల వేలలా నిలిచేది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. పటాన్‌చెరులో ధన బలం.. సేవా బలం మధ్యనే ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండి మీ కోసం పోరాడే అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఐదేండ్ల భవిష్యత్‌ను కాపాడుకునేందుకు డబ్బుకు కాకుండా సమస్యలపై పనిచేసే సీపీఐ(ఎం)కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల గుండె చప్పుడు ఎర్రజెండా..

కార్మికుల పక్షాన పోరాడేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని, సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లికార్జున్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు ఓటర్లను కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనాల కోసం పోరాడిన పార్టీ సీపీఐ(ఎం) ఒక్కటేనని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు యాజమాన్యాల ప్రయోజనాల కోసం పనిచేస్తారు తప్ప కార్మికుల వేతనాలు, సమస్యల గురించి పట్టించుకోరన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్లెవ్వరూ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, అభ్యర్థి జె.మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, నాయకులు కె.రాజయ్య, బీరం మల్లేశం, అతిమేల మాణిక్, జి.సాయిలు, నాయిని నర్సింహ్మారెడ్డి, రామచంద్రం, నాగేశ్వర్‌రావు, ప్రవీణ్, యాదగిరి, విద్యా సాగర్, మహిపాల్, పాండురంగారెడ్డి, వాజీద్ అలీ, అనంతరావు, రాజు, అశోక్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ప్రజలను నమ్ముకుంది

బీఆర్ఎస్, కాంగ్రెస్ డబ్బులను నమ్ముకున్నయ్

- ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బీజేపీని ఓడించాలి: త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్
- పోరాడేవాళ్లకు ఓటు వేయండి : తమ్మినేని
- కూసుమంచిలో రోడ్‌షో, బహిరంగ సభ





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్, కాంగ్రెస్ డబ్బులను నమ్ముకు న్నాయి.. ఓట్లను కూరగాయల్లా కొంటున్నయ్.. సీపీఐ(ఎం) మాత్రం ప్రజలను నమ్ముకుని ఈ ఎన్నికల్లో పోటీ చేస్తోందని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అన్నారు. ఓట్లను కొనుక్కునే వాళ్లను ఓడించి మీ కోసం పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి రోడ్‌షో, బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువలను హరించివేస్తున్న బీజేపీని ఐదు రాష్ట్రాల్లో ఓడించి తీరాలన్నారు. రైతులు, కూలీలను కాంగ్రెస్ తన పాలనలో విస్మరించిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే గత పరిస్థితులు రావని గ్యారంటీ ఏంటని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ హామీలను నిలుపుకోలేదన్నారు. అటువంటి బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలని, పదేండ్లుగా ఏమి చేసిందని ప్రశ్నించారు. ఇండ్ల పట్టాలు, నిరుద్యోగ సమస్య, కేజీ టూ పీజీ ఫ్రీ ఎడ్యుకేషన్ ఏమైనట్టు అన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన, ప్రజాపోరాటాలు చేసిన అనుభవం తమ్మినేనికి ఉందన్నారు. ఈ దేశ, రాష్ట్ర ప్రగతి, సమస్యల గురించి అసెంబ్లీలో మాట్లాడే శక్తి ఉన్న నాయకులు తమ్మినేని అన్నారు. అలాంటి ప్రజా నాయకున్ని అసెంబ్లీకి పంపించాలని ఓటర్లను కోరారు. డబ్బులిచ్చే వాళ్లకు కాకుండా జనం కోసం పోరాడే వాళ్లకు ఓట్లు వేస్తే అసెంబ్లీ వెలుపలా.. లోపలా ప్రజల తరఫున పోరాటం చేస్తారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే పడవలో వెళ్తున్నాయని, ఆ పడవ మనది కాదు.. ఆ పడవలో సాధారణ ప్రజలుండరని చెప్పారు.

పోరాడేవాళ్లకే ఓటు వేయండి: తమ్మినేని



పోరాడే వాళ్లకే మీ ఓటు వేయాలని పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం కోరారు. 2004లో సింగిల్‌గా ఖమ్మంలో గెలిచిందన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇస్తున్న డబ్బులకంటే.. ప్రజా పోరాటాలు చేసి మీ సమస్యలను పరిష్కరించడం ద్వారా ఎంతో సేవ చేశామని అన్నారు. పాలేరుకు సీతారామ, భక్తరామదాసు తెచ్చింది తుమ్మల కాదన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధనకు 2,600 కి.మీ తాను పాదయాత్ర చేశానని, తద్వారా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ స్వయంగా తనను తీసుకెళ్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత నిధుల కోసం కూడా పాదయాత్ర ప్రారంభించి రూ.600 కోట్లు సాధించానన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రిగా చేసిన జలగం వెంగళరావు, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న శీలం సిద్ధారెడ్డిల్లో ఎవరికీ ఆ ఆలోచన రాలేదన్నారు.

తెలంగాణను కాపాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు బి.వెంకట్ అన్నారు. భూస్వాముల కోరలు పీకే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బజ్జూరి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండల కార్యదర్శులు కేవీ రెడ్డి, కొమ్ము శ్రీను, నాయకులు బషీరుద్దీన్, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

పదేండ్లుగా మోసగించిన కేసీఆర్

కులమతాలకతీతంగా పనిచేసేది కాంగ్రెస్సే.. కర్నాటక సీఎం సిద్ధరామయ్య

నవతెలంగాణ - ముషీరాబాద్/ఊట్కూర్

పదేండ్లుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. దేశంలో అన్ని వర్గాలు, కులమతాలకతీతంగా ప్రజల సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. ఆదివారం మక్తల్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సిద్ధరామయ్య మాట్లాడారు.

పార్లమెంట్‌లో కేసీఆర్‌కు ఎంపీలు లేకపోయినా సోనియాగాంధీ ధైర్యం చేసి రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. నేడు రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తూ.. ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు. అందువల్ల అయన్ను గద్దె దింపి.. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, రైతులు, యువతకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధనిక తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని చెప్పారు. ఒక్కొక్కరిపై సుమారు రూ.95 వేల అప్పు చేశారని తెలిపారు.

పేద ప్రజల కోసం బీజేపీ ఏనాడూ ఏమీ చేయలేదని విమర్శించారు. రాజ్యాంగాన్ని 100 శాతం అమలు చేసేది కాంగ్రెస్ పార్టీ అయితే.. దాన్ని తుంగలో తొక్కింది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలని, వాటిని ఎన్నికల్లో తరిమి కొట్టాలని ప్రజలను కోరారు. రాజ్యాంగం కారణంగానే అన్ని వర్గాలు, ప్రజలకు సమాన హక్కులు లభిస్తున్నాయని చెప్పారు. కానీ, బీజేపీ మన రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యులకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.



పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఆలోచన చేస్తోందని.. అందుకే కర్ణాటకలో 5 గ్యారంటీలు ఇచ్చామని చెప్పారు. నాలుగు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, జనవరి నుంచి ఐదోది కూడా అమలు చేయబోతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. కర్ణాటకలో గ్యారంటీ పథకాలు అమలు కావడం లేదని కేసీఆర్, కేటీఆర్ ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. వాళ్లకు ఛాలెంజ్ చేస్తున్నా.. కర్ణాటకకు వచ్చి చూడాలని.. కానీ ఆ ధైర్యం వారికి లేదని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్‌కు అందరి ఆశీస్సులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఒకటే విధానాలు అనుసరిస్తున్నాయని మక్తల్‌లో సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటకలో డీజిల్, పెట్రోల్ ధరలు తక్కువగా ఉన్నాయని.. అదే తెలంగాణలో డీజిల్ పెట్రోల్ రేట్లు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



పోరాడే శక్తులనే గెలిపించండి..

బీజేపీకి పోయే కాలం దగ్గర పడ్డది

ముషీరాబాద్ సీపీఐ(ఎం) బైక్‌ర్యాలీలో మాజీ ఎంపీ పి మధు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కమ్యూనిస్టులు ఎక్కడున్నారు? వారి పనైపోయిందనే విమర్శకుల నోళ్లు మూయించేలా ముషీరాబాద్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం దశరథ్ గెలుపును కాంక్షిస్తూ ఆదివారం భారీ బైక్‌ర్యాలీ జరిగింది. ర్యాలీ అనంతరం సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో రాజ్య సభ మాజీ సభ్యులు పి మధు మాట్లాడుతూ ప్రజల క్షేమం కోసం నిరంతరం పోరాడేది మార్క్సిస్టు పార్టీయేనని చెప్పారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలు అవకాశవాదం, ఒంటెత్తుపోకడతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దీన్ని ప్రజలు ఆమోదించరన్నారు. బీజేపీ మతోన్మాదంతో పాటు ప్రభుత్వ రంగాన్నంతా ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ గప్పాలకు పోయిన మోడీ.. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బీజేపీకి పోయే కాలం దగ్గర పడ్డదని హెచ్చరించారు. గవర్నర్ల వ్యవహార శైలిపై సుప్రీం కోర్టు చివాట్లు పెట్టిందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీతో మిలాఖత్ కావటమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి దశరథ్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి, నగర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, ఎం.మహేందర్, రాజన్న,ఎం వెంకటేశ్, నాగలక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతమొందించండి

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



నవతెలంగాణ-ఆమనగల్

రాష్ట్రంలో అవినీతి, అక్రమాల కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారికి మద్దతుగా ఆదివారం ఆమనగల్ పట్టణంలోని అయ్యప్పకొండ సమీపంలో ప్రజాదీవెన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో యోగి మాట్లాడుతూ.. నీళ్ళు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణ.. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని తొమ్మిదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా భూ మాఫియా, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియాలతో జత కట్టి లక్షల కోట్ల రూపాయలు కూడబెట్టుకున్న కేసీఆర్ కుటుంబానికి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. అన్నిరంగాల్లో వెనుకబడిన కల్వకుర్తి ప్రాంతంలో రైల్వే లైన్, నాలుగు లైన్ల జాతీయ రహదారి, మెడికల్ కాలేజీ తదితర అభివృద్ధి పనులు జరగాలంటే డబుల్ ఇంజన్ సర్కార్‌కే సాధ్యమౌతుందని చెప్పుకొచ్చారు.

ఢిల్లీ పార్టీలను ఓడించాలి



- గల్లీ పార్టీ నేత కేసీఆర్‌ను గెలిపించాలి
- ప్రకాష్‌గౌడ్‌కు అవకాశం ఇవ్వాలి : మణికొండ బీఆర్ఎస్ ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-గండిపేట్

ఎన్నికలప్పుడు వచ్చి మాయ మాటలు చెప్పే ఢిల్లీ పార్టీలను ఓడించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గల్లీ పార్టీ నేత కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిచెట్టు వద్ద బీఆర్ఎస్ రాజేంద్ర నగర్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను గెలిపించి కష్టాలు తెచ్చుకోవద్దన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే కేసీఆర్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ హయాంలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. మళ్లీ గెలిస్తే మూడు నెలల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే రిస్క్‌తోపాటు కరెంట్ కోతలు, నగరంలో అల్లర్లు వస్తాయన్నారు. ఇసుక మాఫీయా రాజ్యమేలుతుందని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చి ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. తమ పార్టీని విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాక గాంధీ, అమిత్ షా, ఇతర ఢిల్లీ నేతలు మూడు రోజులైతే తిరిగి వెళ్లి పోతారని.. సీఎం కేసీఆర్ ఇక్కడే ఉంటారని, తెలంగాణ కోసమే పనిచేస్తారని చెప్పారు. ప్రకాశ్‌గౌడ్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి ప్రకాష్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వరం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.





పస్రాలో వివాదాస్పదమైన పోల్ చీటీల పంపిణీ

ఎన్నికల అధికారికి కాంగ్రెస్ ఫిర్యాదు

నవతెలంగాణ-గోవిందరావుపేట

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తలు కారు గుర్తు.. బడే నాగజ్యోతి ఫొటోతో ఉన్న పోల్ చీటీలు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. పస్రాలో విధులు నిర్వర్తిస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి శ్రీనివాస్‌కు సంబంధిత పోల్ స్లిప్పులను చూపించారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్టు అధికారి శ్రీనివాస్ తెలిపారు. వాస్తవానికి ఓటరు పోల్ స్లిప్పులను ఇప్పటికే బూత్ లెవెల్ అధికారి, ఆశా కార్యకర్తలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు పోల్ స్లిప్పులను పంపిణీ చేయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అతిక్రమించి పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి సంఘటనలు తలెత్తినా సి విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ప్రపంచ గమనం

గాజాలో కాల్పుల విరమణ వెనుక...!

హమాస్‌ను నాశనం చేయటం దుస్సాధ్యమని అంగీకరించటమే!



నెల్లూరు నరసింహారావు

హమాస్ తో కాల్పుల విరమణ ఆలోచననే కొట్టిపారేసిన ఇజ్రాయిల్ గాజాలో నాలుగు రోజులపాటు కాల్పుల విరమణను, బంధీల పరస్పర మార్పిడిని ప్రకటించింది. ఆరు వారాలపాటు అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ కొనసాగించిన మారణహోమం తరువాత పశ్చిమ దేశాల నాయకులు భావించినట్టుగా హమాస్ అంతం అయివుండాలి. అయితే అలా జరగలేదు. హమాస్ ప్రతిఘటన అరబ్ దేశాలలోను, ఆవలా పాలస్తీనా ఉద్యమ ప్రతిష్టను పెంచింది. శుక్రవారం నాలుగురోజుల కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. దీనితో గాజాలో జరుగుతున్న యుద్ధంలో తీవ్రంగా నష్టపోయిన వారికి ఉపశమనం కలుగుతుంది. కానీ ఇది ఇజ్రాయిలీ ప్రభుత్వ బలహీనతలను బయటపెడుతుంది. ఈ కాల్పుల విరమణతో ఇజ్రాయిల్, హమాస్ ల చెరలో బంధీలుగావున్న మహిళలు, పిల్లలు తమతమ కుటుంబాలతో ఏకమవటానికి మార్గం సుగమం అవుతుంది.

కాల్పుల విరమణ తరువాత 46రోజులుగా కొనసాగుతున్న యుద్ధాన్ని కొనసాగించటం హమాస్ కు కష్టమౌతుంది. అక్టోబర్ 27వ తేదీ గాజాలో కాల్పుల విరమణ జరగాలని ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ పెద్ద మెజారిటీతో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానం అమలు తప్పనిసరి కానప్పటికీ 120 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. ఈ తీర్మానాన్ని ఇజ్రాయిల్, అమెరికా పూర్తిగా తిరస్కరించాయి. అరబ్ దేశాలు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని "నాజీ టెర్రరిస్టులను పరిరక్షించేది" అని ఐక్యరాజ్య సమితిలోని ఇజ్రాయిల్ రాయబారి గిలద్ ఎర్డన్ అన్నారు. ఇది హమాస్ నలుగురు ఇజ్రాయిలీ పౌరులను మానవతా కారణాలతో విడుదల చేసిన తరువాత జరిగింది. హమాస్ ను నాశనం చేయటమే తమ లక్ష్యమని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు ప్రకటించారు. ఆరు వారాలపాటు అత్యంత జనసాంద్రతగల గాజాపైన బాంబుల వర్షం కురిపించి దాదాపు 20000మంది ప్రాణాలను తీసినా ఇజ్రాయిల్ హమాస్ ను నాశనం చేయలేకపోయింది. నిజానికి ఇజ్రాయిలీ సైన్యం పాలస్తీనా సాయుధ గ్రూపులపైన చెప్పుకోదగినంత పైచేయిని సాధించలేకపోయింది. గత రెండు వారాల యుద్ధంలో హమాస్ 355 ఇజ్రాయిలీ సాయుధ శకటాలను ధ్వంసం చేసింది. బంధీలను బలవంతంగా విడుదల చేయటం, సొరంగ మార్గాలను బయటపెట్టటం, ఇజ్రాయిల్ సీనియర్ హమాస్ నాయకులను, పెద్ద సంఖ్యలో హమాస్ యోధులను హతమార్చటంవంటి విషయాలలో ఇజ్రాయిల్ ఘోరంగా విఫలం అయింది. ఇక ఆర్థిక విషయాలను తీసుకుంటే ఇజ్రాయిల్ హమాస్ పైన చేస్తున్న యుద్ధంలో ఇప్పటివరకు 50బిలియన్ డాలర్లను వ్యయం చేసింది. ఇది ఇజ్రాయిల్ స్థూల జాతీయోత్పత్తిలో 10శాతానికి సమానం. ఇదే కాకుండా ఇజ్రాయిల్ తన ఉత్తర సరిహద్దులో హమాస్ మిత్ర సాయుధ మిలీషియా గ్రూపు హెజ్బొల్లా దాడులలో గూఢచర్య ఇతర పర్యవేక్షక యంత్రాంగాన్ని చాలా నష్టపోయింది. యెమెన్ లోని అన్సరల్లా గ్రూపు ఒక ఇజ్రాయిలీ వ్యాపారవేత్తకు చెందిన నౌకను ఎర్ర సముద్రంలో స్వాధీనం చేసుకుంది. దీని ప్రభావం దక్షిణ నౌకాశ్రయ నగరం ఎయిలాత్ నుంచి జరుగుతున్న వాణిజ్యంపైన పడింది. ఇవన్నీకాకుండా సిరియా, ఇరాక్ దేశాలలో తిష్టవేసిన అమెరికా సైన్యంపైన, సైనిక స్థావరాలపైన నిరంతరం కొనసాగుతున్న దాడులతో అమెరికా వత్తిడికి గురౌతోంది. ఈ దాడులు గాజాపైన ఇజ్రాయిలీ దాడులను ముగించేలా అమెరికా చేయాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాయి. యావత్ అరబ్ ప్రపంచంలో పశ్చిమ దేశాలకు చెందిన కంపెనీలు సరఫరా చేసిన వస్తువులను ఎన్నడూలేని స్థాయిలో సాధారణ ప్రజలు బహిష్కరిస్తున్నారు. పశ్చిమ దేశాల పాలక వర్గాల, ఆయా దేశాల మీడియా పాటిస్తున్న ద్వంద ప్రమాణాలు తీవ్ర విమర్శలకు గురౌతున్నాయి.

యావత్ ప్రపంచ తీవ్ర విమర్శలకు, అణచివేతకు గురవటానికి బదులుగా హమాస్ బ్రతికి బయటపడటమే కాకుండా ప్రజల్లో మరింతగా తన ప్రతిష్టను పెంచుకుంది. హమాస్ కు స్థావరాలుగావున్నాయన్న నెపంతో గాజాలోని ఆస్పత్రులపైన ఇజ్రాయిల్ చేసిన దాడులను అమెరికా ఎంతగా సమర్థించినప్పటికీ ఆ దాడులు పాలస్తీనా భూభాగంపైన జరగటాన్ని యావత్ ప్రపంచం నిరసించింది. గాజాలో అమెరికా ఇజ్రాయిల్ కు పరిమితులను విధించకపోవటంవల్లనే కనీవినీ ఎరుగని మానవతా సంక్షోభం ఏర్పడిందని ఐక్యరాజ్య సమితికి చెందిన రిలీఫ్ అధినేత మార్టిన్ గ్రిఫ్ఫిత్స్ అన్నాడు.

ఇదిలావుండగా హమాస్ తన గెరిల్లా యుద్ధ తంత్రాన్ని విజయవంతంగా అములు చేస్తూ తన సైనిక సామర్థ్యాన్ని తగ్గకుండా చూసుకుంటోంది. అక్టోబర్ 7వ తేదీనాడు ఇజ్రాయిల్ పైన హమాస్ చేసిన మెరుపు దాడి, దాని తక్షణ పర్యవసానాలవల్ల హమస్ పాలస్తీనా సమస్యవైపు ప్రపంచం ద్రుష్టిని ఆకర్షించేలా చేయగలిగింది. బారక్ ఒబామా పాలనలో ప్రతిపాదించిన "కెర్రి పీస్ ప్లాన్" తరువాత పాలస్తీనా రాజ్య స్థాపనకు అమెరికా ఎటువంటి ప్రయత్నం చేయలేదు. నిజానికి అక్టోబర్ 7వ తేదీదాకా పాలస్తానా రాజ్యం ఏర్పాటు గురించి ఎవ్వరూ మాట్లాడలేదు. నేడు యావత్ ప్రపంచం పాలస్తీనా రాజ్యం ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను గురించి మాట్లాడుతోంది. గాజాపైన 17ఏండ్లపాటు సాగుతున్న ఆర్థిక దిగ్బంధాన్ని ముగించి పాలస్తీనా అధికారాన్ని స్థాపించాలనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అలాగే జెరుసలెంలోని అల్ అక్సా మసీదును రక్షించవలసిన అవసరం ప్రాంతీయ ఏజెండాగా మారింది.

ఒకవేళ ఇజ్రాయిల్, దాని సమర్థకులైన అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలు సమస్యను శాంతియుతంగా పరిష్కరించటానికి బదులుగా యుద్ధాన్ని తీవ్రతరం చేయదలిస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుంది. అటువంటి పరిస్థితి ఆ ఘర్షణలో పాల్గొంటున్న దేశాలన్నింటి స్థిరత్వానికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగితే అది ఈ యుద్ధంలో కొత్త అధ్యాయం అవుతుంది. దానిలో హమాస్ మిగిలే ఉంటుంది. ఆ ప్రాంతం మొత్తం ప్రయోజనాలకు శాంతి ఆవశ్యకత ఉంటుంది. ఇజ్రాయిలీ సైన్యం సామాన్య ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేసిందితప్ప పాలస్తీనా సాయుధ గ్రూపులను ఓడించలేకపోయింది. ఈ వాస్తవాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. పాలస్తీనా సమస్యని శాంతియుతంగాతప్ప హింసాత్మకంగా పరిష్కరించటం సాధ్యంకాదనే విషయాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే ఇజ్రాయిల్, దాని మద్దతుదారైన అమెరికాకు అంత మంచిది.

కేరళ తరహాలోనే రాజస్థాన్

156 సీట్లను గెలుస్తాం..సీఎం అశోక్ గెహ్లోట్

కేరళలో ఆచారం మారితే ఇక్కడ ఎందుకు మారదని మేము పూర్తిగా ఆశిస్తున్నాం? రాజస్థాన్ ప్రజలు తెలివి తక్కువ వారేమీ కాదు. 1998లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు 156 సీట్లు ఉన్నాయి. తాము గుర్తించిన అంచనాల ప్రకారం ఈసారి 156 వైపు దూసుకుపోతున్నాం. చూద్దాం ఎన్ని సీట్లు వస్తాయో....రాజస్థాన్ సీఎం అశోక్‌గెహ్లోట్



అన్ని ఊహాగానాలు ఉన్నప్పటికీ, ఈ రాజకీయ మాంత్రికుడు రాజస్థాన్ ఆచారాలను మార్చడంలో నమ్మకంగా ఉన్నారు. మొత్తం ఐదేండ్లుగా, సచిన్ పైలట్‌కు సంబంధించిన వివాదం అతన్ని ఇబ్బంది పెట్టింది. అతనికి సంబంధించిన ప్రశ్నతో రాజస్థాన్ సీఎం గెహ్లోట్ కొంత అసహనంగా కనిపించారు. కానీ ఒక అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడిలా, ఆ ప్రశ్నకు మాత్రం దూరంగా ఉన్నారు. అశోక్ గెహ్లోట్ ఇచ్చిన సమాధానాలు ఇవే..

ఒకవైపు మీకు ఏడు హామీలు, మరోవైపు మోడీ పథకాలు. ఈ ఎన్నికలు అశోక్ గెహ్లోట్ వర్సెస్ ప్రధాని మోడీగా మారాయి. మీరు దానిని ఎలా చూస్తారు?

సీఎం గెహ్లోట్: ఈ ఎన్నికలు రాష్ట్రానికి సంబంధించినవి. ఇక్కడ మోడీ గురించి మాట్లాడకూడదు. ఇది మోడీ ఎన్నికలే కాదు, ఆయనకు ఎలాంటి హామీ లేదు. వారి హామీ 25వ తేదీ వరకు ఉంటుంది. మా హామీలు ఐదేండ్లపాటు కొనసాగుతాయి. వారి వద్ద ఈడీ మాత్రమే ఉంది, మాకు ప్రజలకిచ్చిన హామీలు ఉన్నాయి.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేడి చాలా దగ్గరగా వచ్చింది. మీరు దానిని ఎలా చూస్తారు?

సీఎం గెహ్లోట్: ఈడీ కార్యకలాపాలు కొంత గందరగోళ పర్చే ప్రయత్నం చేసింది. మన ప్రభుత్వం చట్టాలు చేసింది. ప్రణాళికలు తీసుకొచ్చాం. హామీలు ఇచ్చాం. ఓటర్లు దాని గురించి కూడా చర్చించరు. వారికి ధైర్యం ఉంటే చర్చకు రావాలని బీజేపీకి సవాల్ విసిరారు. నాపై ఊకదంపుడు ప్రకటనలు చేశారు . మైదానంలోకి రండి తేల్చుకుందాంటే..చర్చించటానికి ముందుకు రాలేదు. ఏ కేంద్ర మంత్రి వచ్చినా, ఆయన నేతలంతా వచ్చినా రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు.

యువతలో పేపర్ లీక్ అనేది పెద్ద సమస్య. ఇది మీకు సవాలు కాదా?

సీఎం గెహ్లోట్: నేను అంగీకరించను. పిల్లలకు సేవ చేశాం. ఏ రాష్ట్రంలోనూ జరగని మూడు లక్షల ఉద్యోగాలు ఇస్తున్నాం. ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రయాణ చార్జీలు చెల్లిస్తూ వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. భోజన ఏర్పాట్లు చేశాం. మేం లీక్ గురించి వ్యక్తిగతంగా ఆందోళన చెందాం. గుజరాత్‌లో పేపర్ లీకేజీలు ఎక్కువ. నిన్ననే ఒక్కో పేపర్ మూడు సార్లు లీక్ అయిందని చదువుతున్నాను. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో పేపర్ లీక్ అవుతోంది. భారతదేశం అంతటా పేపర్లు లీక్ అవుతున్నాచర్యల్లేవ్. కానీ మేం దోషులను అరెస్టు చేసాం. వారి భవనాలను కూల్చివేసాం. జీవిత ఖైదు నిబంధనతో కూడిన చట్టాన్ని కూడా ఆమోదించింది. ఆ తర్వాత ఎలాంటి పేపర్ లీక్ కాలేదు. చర్యలు తీసుకున్నాం. పిల్లలు ప్రతిదీ అర్థం చేసుకుంటారు. ఈ బీజేపీ వాళ్ళు రెచ్చగొడతారు. ఇదో సమస్యగా మారుతుందన్న భ్రమలో ఉన్నారు. అవును, బాధిస్తుంది. ఎవరైనా ప్రిపేర్ చేసి పేపర్ లీక్ అయితే ఇబ్బంది. వారి సమస్య మన సమస్య.

ఎన్నికల ర్యాలీ 'సత్తా కే సంగ్రామ్'లో, ఇతర రాష్ట్రాల్లో కూడా పేపర్లు లీక్ అవుతున్నాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి చెప్పినప్పుడు, రాజస్థాన్ ఆందోళనలు తగ్గడం లేదని యువత అడ్డుకున్నారు.

సీఎం గెహ్లోట్: యువత పూర్తిగా సరైనదే. ఇతర రాష్ట్రాలలో ఏమి జరుగుతుందో మనం ఏం పట్టించుకుంటాం? దాన్ని సమస్యగా మార్చే ప్రయత్నం చేసే వారికి హక్కు లేదు. సొంత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అవుతున్నాయి, అక్కడ ఏం చేస్తున్నారు? గుజరాత్‌లో ప్రధాని ఏం చేస్తున్నారు? యూపీలో యోగి ఏం చేస్తున్నారు? అయితే రాజస్థాన్‌లో చర్య తీసుకోవడం ద్వారా మేం దీనిని చూపించాం.

అశోక్ గెహ్లోట్ , సచిన్ పైలట్ కలిసి కనిపిస్తున్నారని, వాస్తవానికి వారు కలిసి లేరని ప్రజలు అంటున్నారు. వారు నిజంగా మీతో ఉన్నారా?

సీఎం గెహ్లోట్: ప్రస్తుతం ప్రతి ఒక్క కాంగ్రెస్ వాది ఐక్యంగా ఉన్నారు, అలా ఉండాలి. నేడు, కాంగ్రెస్ ఐక్యత దేశ ప్రయోజనాల కోసం, రాజస్థాన్ ప్రయోజనాల కోసం , కాంగ్రెస్ ప్రయోజనాల కోసం. దేశంలో పరిస్థితి తీవ్రంగా ఉంది. ప్రజాస్వామ్యం కూలిపోతోంది. రాజ్యాంగాన్ని ముక్కలు చేస్తున్నారు. ఇలాంటి వాతావరణంలో అన్ని విబేధాలు మరచి ఐక్యంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయడం ప్రతి కాంగ్రెసోళ్ల కర్తవ్యం, ధర్మం.

మీరు సచిన్ పైలట్‌కి ఈ కాల్ చేస్తున్నారా?

సీఎం గెహ్లోట్: ...నేను అందరికీ ఈ పిలుపు ఇస్తున్నాను. రాష్ట్రంలోని కాంగ్రెసోళ్లకే కాకుండా యావత్ దేశానికి ఈ పిలుపు ఇస్తున్నాను. ఫాసిస్టు శక్తులు సష్టించిన పరిస్థితుల వల్ల ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చారు. ఏజెన్సీలు నాశనమవు తున్నాయి. ఆదాయపు పన్ను శాఖ అయినా, సీబీఐ అయినా, ఈడీ అయినా దేశ ప్రయోజనాల దష్ట్యా తమ విశ్వసనీయతను కాపాడుకోవడం ముఖ్యం. ఇవి దేశంలోని ప్రధాన ఏజెన్సీలు, కానీ ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం ద్వారా వారి విశ్వసనీయతను నాశనం చేస్తున్నాయి. ఈ ఏజెన్సీలు ఆర్థిక నేరాలకు పాల్పడిన వారి ఇండ్లకు వెళ్లడం లేదు, దీని వల్ల దేశం ఆర్థికంగా నష్టపోతోంది.

వేదికపై నుంచి ప్రధాని మోడీని రాహుల్ గాంధీ 'పనౌతి' అని పిలిచారు. ప్రపంచకప్ ఫైనల్‌లో వారే అంటున్నారు .మోడీ వల్ల భారతదేశం ఓడిపోయింది.

సీఎం గెహ్లోట్: మోడీ జీ ఏం చెబుతున్నారో కూడా చూడండి. ఆయన గురించి రాహుల్ ఏమీ మాట్లాడలేదు. ప్రధాని భాష ఆయన హోదాకు తగ్గట్టుగా లేదు.

ఆచారాలను మార్చడం గురించి మీరు ఎంత నమ్మకంగా ఉన్నారు?

సీఎం గెహ్లోట్: కేరళలో 70 ఏండ్ల తర్వాత ఆచారం మారితే, రాజస్థాన్‌లో మాత్రం 30 ఏండ్ల పట్టింది. అక్కడ ఆచారం మారిపోయింది .కమ్యూనిస్ట్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చింది ఎందుకంటే అక్కడ ప్రభుత్వం కరోనాలో మంచి పని చేసింది. అటువంటి పరిస్థితిలో, మేము కరోనాలో కూడా మంచి పని చేసాము. దీనితో పాటు ఇతర పనులు కూడా చేశాం. ఉత్తమ చట్టాలను రూపొందించాం. ప్రణాళికలు రూపొందించాం. హామీలు ఇచ్చాం. ఈ విషయం ప్రజల నోళ్లకు వచ్చింది.తప్పకుండా గెలుస్తామని గెహ్లోట్ దీమా వ్యక్తం చేశారు.

ఎర్రబెల్లి ప్రచార రథంపై నుంచి పడి బాలిక మృతి

నవతెలంగాణ-కొడకండ్ల

బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎన్నికల ప్రచారంలో విషాద ఘటన జరిగింది. వరంగల్ జిల్లా కొడకండ్ల మండలంలోని నిలువండతండాలో ప్రచారం సమయంలో గ్రామానికి చెందిన గుగులోతు తంజలి(9) ప్రచార రథంపై నుంచి కింద పడి మృతిచెందింది. ఇందుకు సంబంధించి తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం..

మంత్రి ఎర్రబెల్లి ప్రచార రథం గ్రామానికొచ్చింది. అక్కడ డీజే పెట్టి కార్యకర్తలు డ్యాన్స్ చేస్తుండగా.. రథం ముందుకు కదులుతూ వెళ్తోంది. ఈ క్రమంలో రథంపై ఉన్న బాలిక తంజలి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను కామినేని ఆఫీసర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తండావాసులు కోరారు.

అతిపెద్ద పులుల అభయారణ్యం ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద పులుల అభయారణ్యం (టైగర్ రిజర్వు) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం పచ్చజెండా ఊపింది. సుమారు 2300 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఈ రిజర్వు ఏర్పాటు కానుంది. ఇందుకోసం మధ్యప్రదేశ్ లోని నౌరదేహి వన్యప్రాణి అభయారణ్యం (నౌరాదేహి విల్డ్‌లైఫ్ శాంక్చురీ), రాణి దుర్గావతి వన్యప్రాణి అభ్యయారణ్యాలను కలిపివేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఆమోదం తెలిపింది. ఈ రెండు వన్యప్రాణి అభయారణ్యాలు సాగర్, దమోహ్, నర్సింగ్‌పూర్, రైసెన్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల దేశంలో పెద్ద పులుల సంఖ్య పెరగడంతోపాటు, స్థానికంగా పర్యాటక రంగం మరింత అభివద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. 'ఈ టైగర్ రిజర్వు కారణంగా దమోహ్ ప్రాంతం అభివద్ధి చెందుతుంది. పర్యాటకం పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. దమోహ్‌కు ఇదో గొప్ప బహుమతి. రాబోయే మూడు నెలల్లో దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని దమోహ్ డివిజన్ అటవీ శాఖ అధికారి ఎంఎస్ ఉకెయ్ తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో ఉపాధ్యాయ అభ్యర్థులపై ఉక్కుపాదం

- టీచర్ పోస్టుల భర్తీ కోసం బిజెపి ఆఫీస్ ముట్టడించిన యువత
- బలవంతంగా లాగిపడేసిన పోలీసులు



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఉపాధ్యాయ అభ్యర్థులపై అక్కడి బిజెపి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. టీచర్ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్‌తో బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని వందలాది మంది అభ్యర్థులు ముట్టడించారు. కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో అభ్యర్థులపై పోలీసుల్ని బిజెపి ప్రభుత్వం ప్రయోగించింది. అభ్యర్థులపై పోలీసులు కనికరం లేకుండా దాడి చేశారు. బలవంతంగా బయటకు లాగి పడేశారు. అనేక మందిని అరెస్టు చేసి ఎకో గార్డెన్ పార్కుకు తరలించారు. బిజెపి కార్యకర్తలు కూడా టీచర్ అభ్యర్థులపై దాడి చేశారు. 69 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రారంభించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఖాళీలను భర్తీ చేయాలనే డిమాండ్‌తో కొన్ని నెలల నుంచి ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ డైరెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నివాసం వద్ద కూడా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. 2020 జూన్‌లో 69 వేల మందితో కూడిన టీచర్ల మెరిట్‌ను విడుదల చేశారు. దీనిపై అనేక పిటీషన్లు దాఖలయ్యాయి. దీంతో 6,800 మంది రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులతో కూడిన ఒక మెరిట్ జాబితాను ఈ ఏడాది మార్చిలో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ రద్దు చేసింది. మొత్తం మెరిట్ జాబితాను పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఈ పని చేయడం లేదు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు భూపేంద్ర సింగ్ చౌదరిని కలవడానికి బిజెపి కార్యాలయానికి చేరుకున్నామని, అయితే బిజెపి కార్యకర్తలు, పోలీసులు తమపై దాడి చేశారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మా డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్ర అసెంబ్లీ వద్ద మేం ధర్నా నిర్వహించాల్సి ఉంటుందని అభ్యర్థులు హెచ్చరించారు.

కొత్త వైరస్ ఏదీ లేదు

అవి సాధారణ శ్వాసకోశ సమస్యలే

- ప్రపంచ ఆరోగ్య సంస్థకు చైనా స్పష్టీకరణ



బీజింగ్/జెనివా : ఉత్తర చైనాలో చిన్నారుల్లో వేగంగా విజృంభిస్తోందన్న శ్వాసకోశ సంబంధిత వ్యాధి సాధారణమైనదేనని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కొత్త వైరస్ చైనాలో విస్తరిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) వివరాలు కోరగా..బీజింగ్ స్పందించింది. చైనాలో నిమోనియా విజృంభనపై తమకు నివేదిక అందిందని డబ్ల్యుహెచ్ఓ నిర్ధారించింది. శీతాకాలంలో వచ్చే సాధారణ శ్వాసకోశ సమస్యలే అని బీజింగ్ ఆ నివేదికలో స్పష్టంచేసిందని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. బాధితుల్లో ఎటువంటి కొత్త వైరస్ లేదని పేర్కొంది. ఈ విషయాన్ని చైనా స్థానిక మీడియా కూడా ధ్రువీకరించింది. చైనాలో శరవేగంగా వ్యాపించిన శ్వాసకోశ సమస్యలపై ప్రపంచ ఆరోగ్య సంస్థకు కేవలం 24 గంటల్లోనే కచ్చితమైన సమాచారం అందించిందని సిజిటిఎస్ వార్తా సంస్థ తెలిపింది. బీజింగ్, లియోనోంగ్‌లో చేసిన పరీక్షల్లో ఎటువంటి కొత్త వైరస్‌ను గుర్తించలేదని పేర్కొంది.ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్‌ను సంప్రదించింది. బీజింగ్ పిల్లల ఆస్పత్రిని కూడా సమాచారం కోరింది. దీనిపై ఆస్పత్రి శ్వాసకోశ విభాగం డైరెక్టర్ ఝావో షన్నియింగ్ మాట్లాడుతూ.. 'మేము సిడిసి నుంచి పొందిన డేటా ప్రకారం మైకోప్లాస్మాలో ఎటువంటి మార్పు లేదు. రోగులకు చికిత్సలో సంక్లిష్టతలు ఏమీ రాలేదు. మైకోప్లాస్మా నిమోనియా చైనాలో చాలా ఏళ్ల నుంచి ఉనికిలో ఉంది. దీనికి కచ్చితమైన రోగ నిర్ధారణ లేదు. కానీ, మాకు ఈ చికిత్సలో చాలా అనుభవం ఉంది. ప్రారంభ దశలోనే చికిత్సను అందిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు' అని పేర్కొన్నారు.

గ్రీస్ తీరంలో మునిగిన కార్గో నౌక

13 మంది గల్లంతు

- వీరిలో నలుగురు భారతీయులు



ఏథెన్స్ : గ్రీస్ తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో బలమైన గాలుల కారణంగా అల్లకల్లోల పరిస్థితుల్లో కార్గో నౌక మునిగిపోవడంతో 13 మంది గల్లంతయ్యారు. వీరిలో నలుగురు భారతీయులున్నారు. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 14 మంది సిబ్బంది ఉన్నట్లు తెలిసింది. వీరిలో ఒకరిని సహాయక సిబ్బంది రక్షించారు. మిగిలిన 13 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈజిప్టులోని అలెగ్జాండ్రియా నుంచి రాప్టర్ అనే కార్గో నౌక.. ఆరు వేల టన్నుల ఉప్పుతో తుర్కియేలోని ఇస్తాంబుల్ బయలుదేరింది. మార్గమధ్యలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు నౌకలో సాంకేతిక సమస్య తలెత్తిన విషయాన్ని గుర్తించిన సిబ్బంది వెంటనే సమీప కేంద్రానికి ప్రమాద సంకేతాన్ని పంపించారు

. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆ నౌక కనిపించకుండా పోయినట్లు స్థానిక కోస్ట్ గార్డ్ వెల్లడించింది.

రంగంలోకి దిగిన రెస్క్యూ బందాలు ముమ్మర గాలింపు మొదలుపెట్టాయి. 8 నౌకలు, 2 హెలికాప్టర్లతో పాటు గ్రీస్‌కు చెందిన ఓ యుద్ధ నౌకతో ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఇందులో ఒక ఈజిప్టు దేశీయుడిని రక్షించినప్పటికీ..13 మంది ఆచూకీ గల్లంతైనట్లు గుర్తించారు. సముద్రంలో భీకర గాలులతో ప్రతికూల వాతావరణం ఉండడంతో గాలింపు కష్టతరంగా మారిందని రెస్క్యూ సిబ్బంది వెల్లడించారు.


ఆర్జీయూకేటీలో విద్యార్థి ఆత్మహత్య



(ఫైల్)

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఆదివారం విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపింది. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా తొడకుర్తి గ్రామానికి చెందిన రామటి ప్రవీణ్ కుమార్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 30న ఎన్నికల నేపథ్యంలో యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు సెలవులు మంజూరు చేసి అవుట్ పాసులను అందిస్తున్నారు. ప్రవీణ్ కుమార్, అతని స్నేహితులు కూడా అవుట్ పాస్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. రామటి ప్రవీణ్ కుమార్ స్నేహితుడు అవుట్ పాస్ తీసుకొని బయటకు వెళ్లి పోయాడు. కానీ ఎంత సేపైనా ప్రవీణ్ బయటకు రాకపోవడం.. ఫోన్ చేసినా స్పందించపోవడంతో అతని స్నేహితుడు యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించాడు. దీంతో యూనివర్సిటీ పరిసరాలలో గాలించినా ఆచూకీ లభించలేదు. చివరకు బీహెచ్ టు ఖాళీ గదిలో విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.యూనివర్సిటీలో వరుస సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. యూనివర్సిటీలో ఏం జరుగుతుందో ఎప్పుడు ఏ వార్త వినబడుతుందోనని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న గదికి తాళాలు వేయకుండా ఖాళీగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడి తల్లి మూడు నెలల కిందటే చనిపోయింది. తండ్రి ఇటీవల మరో పెండ్లి చేసుకోవడంతో ప్రవీణ్ మానసికంగా కుంగిపోయాడు. ఈ విషయంపై బంధువులకు చెప్పి బాధపడినట్టు సమాచారం. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.



అమెరికా యుద్ధనౌకను తరిమికొట్టిన చైనా

బీజింగ్ : చైనా ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా చొరబడిన అమెరికా యుద్ధనౌకను తరిమికొట్టినట్లు చైనా సైన్యం ప్రకటించింది. చైనా-అమెరికా మధ్య శిఖరాగ్ర సదస్సు ముగిసిన కొన్ని రోజుల్లో అమెరికా కయ్యానికి కాలుదువ్వే చర్యలకు పాల్పడటం గమనార్హం. అమెరికా యుద్ధ నౌకను దక్షిణ చైనా సముద్రం నుంచి తరిమేశామని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెల్లడించింది. ఈ మేరకు 'విచాట్'లో ఆదివారం పోస్టు చేసింది. అయితే దక్షిణ చైనా సముద్రంలో పరాసల్ ద్వీపాల వద్ద అంతర్జాతీయ జలాల్లో తమకు నౌకాయాన హక్కు ఉదంటూ అమెరికా బుకాయిస్తోంది. ఈ ప్రాంతంలో డెస్ట్రాయర్ హాప్పర్ యుద్ధ నౌకను మోహరించేందుకు అది చేసిన కుయుక్తులను చైనా తిప్పికొట్టింది. గత వారం అమెరికా డెస్ట్రాయర్ యూఎస్ఎస్ హాప్పర్ దక్షిణ చైనా జలాల్లోకి ప్రవేశించిందని, దీంతో తమ యుద్ధనౌకలు, వాయుసేన విమానాలు రంగంలోకి దిగి హాప్పర్‌ను ఆ జలాల నుంచి బయటకు పంపినట్లు చైనా సైన్యం పేర్కొంది. అంతేకాదు.. దక్షిణ చైనా సముద్రంలో అమెరికా భద్రతా పరమైన సమస్యలు సష్టిస్తోందని తెలిపింది. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని ఫిలిప్పీన్స్ విదేశీ బలగాలను చేర్చుకొంటోందని విమర్శించింది. ఇటీవలే ఫిలిప్పీన్స్-అమెరికా దళాలు ఇక్కడ సంయుక్త గస్తీ నిర్వహించడంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

మలేషియాకు వీసా అక్కర్లేదు !

- డిసెంబర్ 1 నుంచి అమల్లోకి

కౌలాలంపూర్ : భారత్, చైనా నుంచి వచ్చే పర్యాటకులకు వీసా లేకుండానే తమ దేశంలోని పర్యాటక ప్రదేశాల సందర్శనకు అనుమతిస్తున్నట్లు మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం తెలిపారు. జస్టిస్ పార్టీ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడుల్ని, పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.





ఓటరు ఆదరించేదెవరిని?

- కాంగ్రెస్, బీజేపీల హామీలు
- ఐదు రాష్ట్రాల్లో పలు కీలక వాగ్దానాలు
- రెండు జాతీయ పార్టీల్లోనూ టెన్షన్

భారత్‌లో వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ఎన్నికల్లో వచ్చే ఫలితాలు సార్వత్రిక ఎన్నికల మీద పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్యంగా, రెండు ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ఈ ఎన్నికల సంగ్రామంలో ఎలాగైనా విజయం సాధించేందుకు సర్వశక్తులు వినియోగించి పని చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈ ఐదు రాష్ట్రాల్లో పలు కీలక వాగ్దానాలను ఈ రెండు పార్టీలు చేశాయి.



న్యూఢిల్లీ : కాంగ్రెస్, బీజేపీలో తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో రైతుల సంక్షేమం, మహిళా సాధికారత, ఎల్పీజీ సిలిండర్ ధరలు, సామాజిక-ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్యం, విద్య గురించి పొందుపర్చాయి. షెడ్యూల్ ప్రకారం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్‌లలో ఇప్పటికే ఎన్నికలు జరిగాయి. తెలంగాణలో ఈనెల 30న పోలింగ్ జరగనున్నది. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. దీంతో ఈ ప్రధాన పార్టీల అధినాయకత్వాల్లోనూ టెన్షన్ వాతావరణ నెలకొన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ రెండు జాతీయ పార్టీల వాగ్దానాలను చూసుకుంటే..

రైతు సంక్షేమం

మొత్తం ఐదు రాష్ట్రాలకు సంబంధించిన తమ మ్యానిఫెస్టోలలో కాంగ్రెస్, బీజేపీ రెండూ వ్యవసాయ సంక్షోభాన్ని తగ్గించటం కోసం రైతులకు మద్దతును పెంచడానికి తమ నిబద్ధతను హైలైట్ చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో, వ్యవసాయ రుణాల మాఫీతో పాటు వరి మద్దతు ధరపై రెండు పార్టీలు పోటీ పడి హామీలిచ్చాయి. వరి క్వింటాల్‌కు రూ. 3,100 కొనుగోలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ మాత్రం రూ.3,200 వరిని కొనుగోలు చేస్తామని వాగ్దానం చేసింది. దీంతోపాటు 2018 ఎన్నికల్లోలాగానే మరోసారి వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది.

రాజస్థాన్‌లో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అనుసరించి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) అమలుకు చట్టం తీసుకువస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రైతులందరికీ సహకార బ్యాంకుల నుంచి రూ.2 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించాలనీ, నిరసనల్లో పాల్గొన్న రైతులపై పెండింగ్‌లో ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ. 12,000 అదనపు సహాయం, రైతుల పిల్లలకు ఉచిత విద్య, గోధుమలపై ఎంఎస్పీపై క్వింటాల్‌కు రూ. 2,700 అదనపు బోనస్‌తో పాటు ఎంఎస్పీని అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.

అదేవిధంగా, మధ్యప్రదేశ్‌లో ప్రధానమంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ. 12,000 అదనపు సహాయం, క్వింటాల్ గోధుమకు రూ. 2,700, వరికి క్వింటాల్‌కు రూ. 3,100 ఎంఎస్పీ అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లోలాగానే రైతులకు రుణమాఫీ (రూ. 2 లక్షల వరకు), గోధుమలకు రూ.2,600, వరికి రూ.2,500 ఎంఎస్పీతో పాటుగా రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఉచిత పంటల బీమాతోపాటు చిన్న, సన్నకారు రైతులకు ఇన్‌పుట్ సాయంతోపాటు ఎకరాకు రూ.18వేలకు పైగా ఎరువుల సబ్సిడీని అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. వరికి రూ. 3,100 రూపాయల మద్దతు ధరను ఇస్తామన్నది. రైతులు కోరుకుంటే వారికి ఉచితంగా దేశీ పాలను ఇచ్చే ఆవులను అందజేస్తామని తెలిపింది. వ్యవసాయ రుణాల మాఫీ, కేంద్రం నిర్దేశించిన ఎంఎస్పీ కంటే అన్ని పంటలపై బోనస్‌లను పెంచుతామని కాంగ్రెస్ తన వాగ్దానాన్ని పునరావృతం చేసింది. భూమి ఉన్న కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు, భూమిలేని కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చింది.కేసీఆర్ ప్రభుత్వ ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్, బీజేపీ రెండూ హామీ ఇచ్చాయి.మిజోరంలో పాడి పరిశ్రమ, పండ్ల పెంపకానికి మద్దతుగా వ్యవసాయ మౌలిక సదుపాయాలు, డెయిరీ మిషన్, ట్రాపికల్ ఫ్రూట్ మిషన్‌లను పునరుద్ధరించడానికి రూ. 1,000 కోట్ల పెట్టుబడితో పాటుగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఆర్థిక సహాయాన్ని పెంచుతామని బీజేపీ మరోసారి హామీ ఇచ్చింది. చేపల పెంపకందారులకు వార్షికంగా రూ.6,000 అందించనున్నట్టు సైతం వెల్లడించింది. 'టాంగ్ పుయిహ్నా' పథకం ద్వారా రైతులు, పారిశ్రామికవేత్తలకు స్థిరమైన ఆర్థిక, జీవనోపాధి కార్యకలాపాలను అభివృద్ధి చేయడంలో మద్దతు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీని కింద రూ. 2 లక్షల ద్రవ్య సహాయం అందజేస్తుంది.

తక్కువ ధరకు ఎల్పీజీ సిలిండర్ ధరలు

రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ ఎల్పీజీ సిలిండర్‌లను రూ. 400కు అందిస్తామన్నది. ఉజ్వల యోజన లబ్ధిదారులకు రూ.450కే అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో రూ.500 చొప్పున ఎల్పీజీ సిలిండర్లు అందజేస్తామని రెండు పార్టీలు హామీ ఇచ్చాయి. మధ్యప్రదేశ్‌లో రూ.500కే అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వగా, బీజేపీ మాత్రం రూ.450కి ఇస్తామన్నది. తెలంగాణలో రూ.500కే ఎల్పీజీ సిలిండర్లు ఇస్తామని కాంగ్రెస్, ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మిజోరంలో రూ.750కే సబ్సిడీ సిలిండర్లు అందజేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేయగా, ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఏడాదికి రెండు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.

మహిళా ఓటర్లపై గురి

కాంగ్రెస్, బీజేపీ రెండూ తమ మ్యానిఫెస్టోలలో మహిళా సాధికారత ప్రధానాంశంగా మిగిలిన అనేక ఇతర వాగ్దానాలను చేర్చాయి. రాజస్థాన్‌లోని పోలీసుశాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తోపాటు మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని రెండు పార్టీలు హామీ ఇచ్చాయి. లైంగిక వేధింపుల కేసుల విచారణకు సగటు సమయాన్ని తగ్గిస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేయగా, బీజేపీ ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఆడపిల్లలకు రూ.2 లక్షల పొదుపు బాండ్‌ను అందించే లాడో ప్రోత్సాహన్ యోజనను బీజేపీ ప్రకటించగా, కుటుంబ పెద్దలకు రూ.10,000 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.మధ్యప్రదేశ్‌లో బీజేపీ సర్కారు ప్రతి వయోజన మహిళకు నెలవారీ రూ. 1,250 స్టైఫండ్ అందిస్తున్నది. లబ్ధిదారులకు కాంక్రీట్ ఇండ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. పుట్టినప్పటి నుంచి 21 ఏండ్ల లోపు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలకు చెందిన బాలికలకు ఆర్థిక సహాయం అందించే లాడ్లీ లక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయాన్ని రూ.2 లక్షలకు పెంచనున్నట్టు తెలిపింది. ఆడపిల్లలకు పుట్టినప్పటి నుంచి పెండ్లయ్యే వరకు రూ.2.51 లక్షలు మేరీ బిత్యా రాణి యోజన కింద నెలకు రూ.1500 చొప్పున అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందించడంతోపాటు బేటీ వివాహ యోజన కింద సుమారు రూ.లక్ష సాయం అందజేస్తామని తెలిపింది.తెలంగాణలో ఆడబిడ్డ పుడితే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని, 21ఏండ్లకే డబ్బును పొందేలా చేస్తామని ఆడబిడ్డ భరోసా కింద బీజేపీ హామీ ఇచ్చింది. అంతేకాకుండా కొత్తగా 10 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టిస్తామనీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఒక శాతం వడ్డీకి రుణాలు అందజేయటం, మహిళా రైతుల కోసం మహిళా రైతు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసింది. రాష్ట్ర బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 18 ఏండ్లు పైబడిన విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామనీ, పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిలకు కళ్యాణమస్తు పథకం కింద రూ.1 లక్షతో పాటు 10 గ్రాముల బంగారం ఇస్తామనీ, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామనీ, మహిళా పోలీసు బలగాలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో గృహలక్ష్మి యోజన కింద మహిళలకు నెలవారీ రూ.15,000 సాయం అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇతర హామీలతోపాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేస్తామని తెలిపింది. మహతారీ వందన్ యోజన కింద వివాహిత మహిళలకు రూ.12,000 ఆర్థిక సహాయం అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. బీపీఎల్ కుటుంబాలకు చెందిన బాలికల కోసం, రాణి దగ్వతి యోజన కింద రూ.1.5 లక్షల హామీ సర్టిఫికెట్లను విడుదల చేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. అదేవిధంగా మిజోరంలో కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతి ఆడబిడ్డకు రూ.1.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.

నిరుద్యోగంపై ఇలా

రాజస్థాన్‌లో ప్రభుత్వ రంగంలో 4 లక్షల ఉద్యోగాలు సహా 10 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఐదేండ్లలో 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లో ఉద్యోగాలు లేని యువకులకు నెలకు రూ.1,500 నుంచి 3,000 వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని, జాబ్ పోర్టల్స్, రోజ్‌గార్ బ్యూరోలను ఏర్పాటు చేస్తామనీ, ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ కోసం చట్టం తీసుకువస్తామని, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి ఉపాధి కల్పిస్తామనీ, యువకులకు రూ.10 వేలు స్టైఫండ్ ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.ఛత్తీస్‌గఢ్‌లో పబ్లిక్ సర్వీస్ కమీషన్ స్కామ్‌పై దర్యాప్తు చేస్తామనీ, అన్ని ప్రభుత్వ నియామక పరీక్షలను యూపీఎస్సీ తరహాలో చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. యువత నేతృత్వంలోని స్టార్టప్‌లకు రుణాలపై 50 శాతం సబ్సిడీ ఇస్తామని కాంగ్రెస్, బీజేపీ రెండూ వాగ్దానం చేశాయి.తెలంగాణలో.. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) రిక్రూట్‌మెంట్, పరీక్షలు ఆలస్యం, పేపర్ లీక్‌లు, భర్తీ చేయని ఖాళీలపై కాంగ్రెస్, బీజేపీలు స్పందించాయి. యూపీఎస్సీలాగే రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేస్తామనీ, ఈడబ్ల్యూఎస్ కోటా కింద వచ్చే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను ఆరు నెలల్లో భర్తీ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీని కూడా పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారిని గుర్తించి వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామనీ, ఉద్యమంలో పాల్గొన్న వారికి అధికారికంగా స్వాతంత్ర్య సమరయోధుల కార్డులు ఇస్తామనీ, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామనీ, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని వాగ్దానం చేసింది.మిజోరంలో ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు ఇస్తామనీ, మిజోరం ఒలింపిక్ మిషన్‌ను అభివృద్ధి చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడానికి, 1 లక్ష ఉద్యోగాలనుసృష్టించడానికి 'టాంగ్ పుయ్హ్నా'తో పాటు యంగ్ మిజో ఎంటర్‌ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

కుల గణన, వెనుకబడిన కులాల అభివృద్ధి

దేశవ్యాప్తంగా కుల గణన కోసం పెరుగుతున్న నినాదాలకు అనుగుణంగా కాంగ్రెస్ అన్ని ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. అయితే కుల గణనపై బీజేపీ కచ్చితమైన నిర్ణయం తీసుకోలేదు.

విద్యారంగం

ఐదు రాష్ట్రాల్లో విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తామని రెండు పార్టీలు వాగ్దానాలు చేశాయి.ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేస్తామనీ, కేజీ నుంచి పీజీ వరకు పిల్లలకు ఉచిత విద్య అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తెలంగాణలో ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రమంగా ఆంగ్లం ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. మరోవైపు, తెలంగాణలో ఒక నోడల్ స్కూల్‌ను అభివృద్ధి చేస్తామనీ, ప్రతి మండలంలో టీచర్ల హ్యాండ్ హెూల్డింగ్, కెపాసిటీ బిల్డింగ్‌ను అభివృద్ధి చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.

ఆరోగ్య సంరక్షణ

రాజస్థాన్‌లో కాంగ్రెస్ తన హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ముఖ్యమంత్రి నిషుల్క్ చిరంజీవి స్వాస్థ్య బీమా యోజన కింద కవరేజీని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. ఏటా రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షలకు, భామాషా హెల్త్ ద్వారా రూ. 40,000 కోట్లు పెట్టుబడి పెడతామని బీజేపీ హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో, నిరుపేదలకు రూ. 10 లక్షల వరకు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందించడానికి కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆయుష్మాన్ భారత్ కింద వార్షిక కవరేజీని రూ. 10 లక్షలకు రెట్టింపు చేసేందుకు, రాష్ట్రంలోని ప్రతి డివిజన్‌లో ఛత్తీస్‌గఢ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ను ఏర్పాటు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.మధ్యప్రదేశ్‌లో కూడా ఆరోగ్య సంరక్షణ హక్కు చట్టాన్ని తీసుకువస్తామనీ, రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆయుష్మాన్ భారత్ యోజన కింద ఆస్పత్రి బిల్లులు రూ.5 లక్షలు దాటితే భరిస్తామనీ, రాష్ట్రంలోని ప్రతి డివిజన్‌లో ఎయిమ్స్ తరహా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.తెలంగాణలో ఎయిమ్స్ లాంటి ఇన్‌స్టిట్యూట్‌లు, నాలుగు నగరాల్లో ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సుల పోస్టుల భర్తీతోపాటు ఆరోగ్య మౌలిక సదుపాయాలను ఆధునీకరిస్తామనీ, రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.మిజోరంలో ఆయుష్మాన్ భారత్ కింద రూ. 10 లక్షల బీమాను రెట్టింపు చేస్తామనీ, రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను పునరుద్ధరించేందుకు రూ. 500 కోట్ల పెట్టుబడిని, జిల్లా ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. 15 లక్షల ఆరోగ్య బీమా, క్యాన్సర్, ఇతర తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సహాయం చేసేందుకు రూ.5 కోట్ల పెట్టుబడి ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానమిచ్చింది.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఎదురీత

- 14 మంది మంత్రులకు ఎదురుగాలి
- ఇందులో ఐదుగురు జ్యోతిరాదిత్య విధేయులు ఈ సారి అధికార పార్టీకి కష్టమే : రాజకీయ విశ్లేషకులు



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీకి అక్కడి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నది. ఈనెల 17న రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. అయితే, ఈ ఎన్నికల్లో ప్రస్తుత శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలోని దాదాపు 14 మంది మంత్రులకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో పని చేసిన ఐదుగురు మంత్రులదీ ఇదే పరిస్థితి అని తెలుస్తున్నది. డిసెంబర్ 3న విడుదలయ్యే ఫలితాల్లో వీరి భవితవ్యం తేలనున్నది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా 77 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అయితే, క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారం, ఇన్‌పుట్‌ల ఆధారంగా ఈ సారి 14 మంత్రులపై తీవ్ర వ్యతిరేకత ఉన్నదనీ, ఎన్నికల్లో వారు గెలవటం కష్టమేనని తెలుస్తున్నది. ఇందులో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాకు విధేయులైన ఐదుగురు ఉండటం గమనార్హం. ఈ 14 మంది మంత్రుల జాబితాలో తొమ్మిది మంది క్యాబినెట్ మంత్రులు కాగా.. ఐదుగురు రాష్ట్ర మంత్రులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని ఇక్కడి రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ నుంచి అధికారాన్ని చేజిక్కిచ్చుకున్న తీరు బీజేపీపై కోపాన్ని, కాంగ్రెస్‌పై సానుభూతిని తీసుకొచ్చిందని చెప్తున్నారు. అత్యధికంగా ఓటింగ్ నమోదు కావటమనేది ప్రభుత్వంపై వ్యతిరేకతకే కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రయాణికుల ప్రాణాలు గాలిలో...

- మద్యం మత్తులో పట్టుబడుతున్న లోకో పైలట్లు



న్యూఢిల్లీ : బ్రీత్ అనలైజర్ పరీక్షలో పట్టుబడుతున్న లోకో పైలట్ల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. మద్యం మత్తులో రైళ్లు నడుపుతూ లక్షలాది మంది ప్రయాణికుల ప్రాణాలతో వారు చెలగాటం ఆడుతున్నారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో మూడు రైల్వే జోన్లలో ఈ పరీక్షలు నిర్వహించగా 995 మంది విఫలమయ్యారు. వీరిలో మూడో వంతు మంది విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా జరిపిన పరీక్షల్లో దొరికిపోయారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు వచ్చిన సమాధానంలో ఈ విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా రాజధాని న్యూఢిల్లీలో జరిపిన పరీక్షల్లో అత్యధికులు పట్టుబడ్డారు. దిగ్భ్రాంతి కలిగించే విషయమేమంటే న్యూఢిల్లీలో 471 మంది లోకో పైలట్లు బ్రీత్‌అనలైజర్ పరీక్షలో ఫెయిలయ్యారు. వీరిలో 181 మంది అంటే 38% మంది ప్యాసింజర్ రైళ్ల డ్రైవర్లే. క్యాబిన్‌లో ఉన్నప్పుడు డ్రైవర్లను పరీక్షిస్తే 189 మంది దొరికిపోవడం గమనార్హం.

ఆల్కహాల్‌పై నిషేధం అమలులో ఉన్న గుజరాత్‌లో సైతం 104 మంది డ్రైవర్లు బ్రీత్ అనలైజర్ పరీక్షలో ఫెయిలయ్యారు. వీరిలో 41 మంది ప్యాసింజర్ రైళ్లు నడిపిన వారు. ఈ విషయంలో ముంబయి నగరం కొంచెం నయం. అక్కడ కేవలం 11 మంది లోకో పైలట్లు మాత్రమే పట్టుబడ్డారు. జబల్పూర్ రైల్వే డివిజన్‌లో ఇలాంటి కేసులేవీ నమోదు కాలేదు. భోపాల్ మాత్రం వివరాలు అందించేందుకు నిరాకరించింది. పశ్చిమ, ఉత్తర, పశ్చిమ మధ్య రైల్వే జోన్లలో ఈ పరీక్షలు నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న వారు మద్యం సేవించకుండా చూసేందుకు అధికారులు తరచుగా బ్రీత్ అనలైజర్ పరీక్షలు జరుపుతారు. పశ్చిమ రైల్వే డివిజన్‌లో 273 మంది లోకో పైలట్లు దొరికిపోయారు. వీరిలో 82 మంది ప్యాసింజర్ రైళ్లు నడిపిన వారు. రత్లాం డివిజన్‌లో అత్యధికంగా 158 కేసులు నమోదయ్యాయి. 2020 జనవరి నుండి ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ అహ్మదాబాద్‌లో 44 మంది, వడోదరలో 37 మంది, రాజ్‌కోట్‌లో 15 మంది, భావ్‌నగర్‌లో 8 మంది పట్టుబడ్డారు. గత ఐదు సంవత్సరాల్లో ఉత్తర రైల్వేకు చెందిన ఢిల్లీ డివిజన్‌లో ప్యాసింజర్ రైళ్లకు చెందిన 181 మంది లోకో పైలట్లు, గూడ్సు రైళ్లు నడిపిన 290 మంది డ్రైవర్లు మద్యం మత్తులో దొరికిపోయారు. మొరాదాబాద్‌లో ఇలాంటి కేసులు 138 నమోదు కాగా విధులు ముగించుకొని వచ్చిన 108 మంది పట్టుబడిపోయారు. లక్నో డివిజన్‌లో 17 మంది ఫెయిలయ్యారు. పశ్చిమ మధ్య రైల్వేలోని కోటా డివిజన్‌లో 40 మంది లోకో పైలట్లు పట్టుబడిపోయారు. మద్యం మత్తులో బ్రీత్ అనలైజర్ పరీక్షలో దొరికిపోయిన వారందరి పైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని అధికారులు చెప్పారు. ఆల్కహాల్ స్థాయి పరిమితికి లోబడి ఉంటే వారిని డ్యూటీ చేయకుండా నిలువరించి, సర్వీసు రికార్డులో నమోదు చేస్తారు. ఆల్కహాల్ స్థాయి పరిమితిని దాటితే సర్వీసు నుండి తొలగిస్తారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల పేరులో మార్పు

- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ప్రధానమంత్రి ఆరోగ్య యోజన- ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల పేరులో మార్పు చేసింది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'గా మార్చాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాసినట్టు అధికారిక వర్గాలు ఆదివారం తెలిపాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పేరు మార్చిన తర్వాత ఆ ఫొటోలను ఆయుష్మాన్ భారత్-హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్(ఏబి-హెచ్ డబ్ల్యు సి) పోర్టల్లో అప్లోడ్ చేయాలని సూచించినట్టు తెలిపారు. జాతీయ ఆరోగ్య విధానంలో భాగంగా 2018 సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా పథకం. ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు వైద్యం అందించేందుకు ఉద్దేశించింది.

మణిపూర్‌లో మళ్లీ హింస

- కాల్పుల్లో ఒక కుకీ-జో గిరిజనుడు మృతి

గౌహతి: మణిపూర్‌లో హింసాత్మక అల్లర్లు తగ్గుముఖం పట్టటం లేదు. అక్కడ మళ్లీ హింస చెలరేగింది. రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో కుకీ-జో అనే గిరిజనుడు (21) మరణించాడు. ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటీఎల్ఎఫ్) మతుడిని ఫైఖోలం గ్రామానికి చెందిన ఖుప్మింతంగ్‌గా గుర్తించింది. అతను గ్రామ వాలంటీర్ అని గిరిజన సంస్థ తెలిపింది. ఇంఫాల్ లోయలోని బిష్ణుపూర్ జిల్లా సరిహద్దులో ఉన్న కాంగ్‌పోక్పి జిల్లాలోని కుకి-జో గ్రామమైన జూపి వద్ద కాల్పులు జరిగాయి. దుండగులు అత్యాధునిక ఆయుధాలతో కాల్పులు జరిపారనీ, అయితే కుకీ-జో గ్రామ వాలంటీర్లు సింగిల్ బ్యారెల్ రైఫిల్స్‌తో గ్రామాన్ని రక్షించేందుకు తమ వంతుగా నిలబడ్డారని ఐటీఎల్ఎఫ్ తెలిపింది.ఈ సంఘటన తర్వాత కాంగ్‌పోక్పి-బిష్ణుపూర్ సరిహద్దుకు ఇరువైపులా ఉన్న గ్రామస్థులు మరింత దాడులు, ప్రతిదాడులను చేయటంతో అక్కడ ఉద్రిక్తత నెలకొన్నది. పోలీసులు ఆయా ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. గత సోమవారం కాంగ్‌పోక్పి జిల్లాలో గుర్తు తెలియని ముష్కరులు జరిపిన ఆకస్మిక దాడిలో మరో ఇద్దరు కుకీ-జో గిరిజనులు మరణించిన తర్వాత ఈ దాడి చోటు చేసుకోవటం గమనార్హం.

దొంగిలించిన వేలిముద్రలతో... బ్యాంక్‌లో సొమ్ము ఖాళీ



న్యూఢిల్లీ : ఆధార్...ఇప్పుడు దేశంలో అన్నింటికీ అదే ఆధారమవుతోంది. అయితే ప్రజల బయోమెట్రిక్ వివరాలను దొంగిలించి, వాటిని దుర్వినియోగం చేస్తూ ఆధార్ చెల్లింపుల వ్యవస్థ ద్వారా సొమ్మును స్వాహా చేస్తున్న ఘనాపాటీలు చాలా మందే ఉన్నారు. ఆధార్ నెంబరు, బయోమెట్రిక్ సమాచారం తెలిస్తే చాలు... సంబంధిత వ్యక్తి బ్యాంక్ ఖాతాను క్షణాల్లో ఖాళీ చేయొచ్చు. ఒకవేళ బాధితుడు తన వివరాలు ఎవరితోనూ పంచుకోకపోయినప్పటికీ ఏ ఆస్తికి సంబంధించిన పత్రాల నుండి అయినా అతని వేలిముద్రలను హ్యాక్ చేయడం లేదా క్లోనింగ్ చేయడం ద్వారా మోసానికి పాల్పడవచ్చు. బ్యాంక్ ఖాతాల నుండి తమ ప్రమేయం లేకుండానే సొమ్ము మాయమవుతోందంటూ పలువురు ఖాతాదారులు బ్యాంక్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఉదంతాలు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. దీంతో బ్యాంకులు తమ ఖాతాదారులకు హెచ్చరిక సందేశాలు పంపుతున్నాయి. ఆధార్ వెబ్‌సైట్‌లో బయోమెట్రిక్‌ను 'లాక్' చేసుకోవాలని సూచిస్తున్నాయి. క్లోనింగ్, మోసంతో సేకరించిన వేలిముద్రల ద్వారానే ఎక్కువ కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయి. దొంగిలించిన వేలిముద్రలను ముందుగా సిలికాన్‌ను ఉపయోగించి కాపీ చేస్తారు. ఆ తర్వాత ఆధార్ ద్వారా లావాదేవీలు నిర్వహించేందుకు వాటిని ఉపయోగిస్తారు. అంతే...బ్యాంక్ ఖాతాల నుండి నగదు దారి మళ్లుతుంది. ప్రభుత్వ అధికార వెబ్‌సైట్‌లో ల్యాండ్ రెవెన్యూ పత్రాలు అందరికీ అందుబాటులో ఉంటాయి. వాటిలో తప్పనిసరిగా భూ లావాదేవీలు జరిపే వారి వేలిముద్రలు కన్పిస్తాయి. మోసగాళ్లు ఆ పత్రాల నుండి వేలిముద్రలను దొంగిలిస్తారు. పత్రాల నుండి చర్మం రంగులో ఉండే వేలిముద్రలను క్లోన్ చేసేందుకు సిలికాన్ ఆధారిత జిగురును వాడతారు. ప్రైవేటు సంస్థల వద్ద ఉండే స్కానింగ్ పరికరాలు సున్నితమైనవి కావు. దీంతో మోసగాళ్లు వీటిని ఉపయోగించి నకిలీ వేలిముద్రలను రూపొందిస్తున్నారు. బయోమెట్రిక్‌ను లాక్ చేయడం కొంతవరకూ మాత్రమే రక్షణ కల్పిస్తుందని సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ టెక్నాలజీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఆధార్‌ను బ్యాంక్ ఖాతాలు, పాన్‌కార్డులు, ఫోన్ నెంబర్లు, ఓటర్ ఐడీలతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం వల్లనే అనేక సమస్యలు వస్తున్నాయని నిపుణులు తెలిపారు. సంక్షేమ పథకాలు, సబ్సిడీలు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అవుతోంది. దీంతో ప్రజలు విధి లేని పరిస్థితుల్లో దీని పైనే ఆధారపడుతున్నారు.

చిన్నారుల్లో పోషక విలువలపై అధ్యయనం ఎప్పుడో?



అన్యూఢిల్లీ : చిన్నారుల్లో పోషక విలువలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వృద్ధి ప్రమాణాలను రూపొందించాలని భావిస్తోంది. అయితే దీనికి వాస్తవ రూపం వచ్చేందుకు అనేక సంవత్సరాలు పట్టవచ్చు. బరువు, ఎత్తుకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచికలు మన దేశానికి అనువుగా లేవన్న ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మన దేశానికే పరిమితం చేస్తూ వృద్ధి ప్రమాణాలు రూపొందించాలని గత సంవత్సరం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)ని ఆదేశించింది. దీనిపై ఐసీఎంఆర్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వం తాజాగా మరో ఆదేశాన్ని ఇచ్చింది. వృద్ధి ప్రమాణాలు రూపొందించడానికి బదులు 0-2 సంవత్సరాల మధ్య వయస్కులైన చిన్నారుల వృద్ధి నమూనాలపై ఐసీఎంఆర్ కమిటీ అధ్యయనం చేయాలని ఆదేశించింది. రెండు సంవత్సరాల వయసు దాటిన పిల్లలకు సంబంధించి ఆయా సమూహాల జనాభా సమాచారాన్ని విశ్లేషించాల్సి ఉంటుంది.

అయితే ఈ అధ్యయనం ప్రొటోకాల్, వివరాలను ఇంకా ఖరారు చేయలేదు. చిన్నారుల్లో స్థానిక ప్రమాణాల రూపకల్పనకు అనేక సంవత్సరాలు పడుతుందని ప్రభుత్వాధికారులు అంటున్నారు. వ్యక్తిగత స్థాయిలో శిశువుల బరువు, ఎత్తును పిల్లల వైద్యులు నమోదు చేస్తారు. ఆ శిశువు సరిగా ఎదుగుతున్నాడా, కాలానుగుణంగా వృద్ధికి సంబంధించిన మైలురాళ్లను అధిగమిస్తున్నాడా అనే విషయాన్ని వారే పరిశీలిస్తుంటారు. ఈ అంశాలపై అధ్యయనం చేయాలంటే చాలా సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టిన కమీషనర్...

డాక్టర్ అలీ సార్,
9494228002
భారత రాజ్యాంగ నిపుణులు





1. ఈ కింది వాటిలో సరైన అంశాలు గుర్తించండి.
ఎ. అటార్నీ జనరల్‌ను రాష్ట్రపతి నియమిస్తారు
బి. అటార్నీ జనరల్ అర్హతలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది
1. బి మాత్రమే 2. ఎ మాత్రమే
3. ఎ, బి 4. ఏదీకాదు

2. భారత రాజ్యాంగంలో ఏ ఆర్టికల్ అటార్నీజనరల్ గూర్చి తెలియజేస్తుంది?
1. 72 2. 76 3. 75 4. 78

3. కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పుడు ఏర్పడింది?
1. 25-1-1950 2. 22-1-1950
3. 26-1-1950 4. 19-7-1949

4. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయోపరిమితిని 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు.
1. 42వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 44వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 61వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 69వ రాజ్యాంగ సవరణ చట్టం

5. భారతదేశంలో రాజ్యాంగ బద్ధ సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన చట్టాలన్నింటిని రూపొందించేది ఎవరు?
1. రాష్ట్రపతి 2. పార్లమెంట్
3. కేంద్ర ఎన్నికల సంఘం 4. ఏదీకాదు

6. మొదటి ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎవరు?
1. రాజీవ్ కుమార్ 2. సుకుమార్ సేన్
3. కెవికె సుందరం 4. నాగేంద్రసింగ్

7. ఎక్కువ రోజులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పని చేసిన వారు?
1. నాగేందర్ సింగ్ 2. వి.ఎస్. రమాదేవి
3. టి.ఎన్. శేషన్ 4. కెవికె సుందరం

8. ఓటుహక్కు వయస్సును 21 సంవత్సరాలనుండి 18 సంవత్సరాలకు తగ్గించాలని సిఫార్సు చేసిన కమిటీ ఏది?
1. దినేష్ గోస్వామి కమిటీ 2. తార్కుండే కమిటి
3. ఇంద్రజిత్ గుప్తా కమిటి 4. లా కమీషన్

9. ఎన్నికలలో జువీ లను వినియోగించాలని సిఫార్సు చేసిన కమిటి ఏది?
1. దినేష్ గోస్వామి కమిటి 2. తార్కుండే కమిటి
3. ఇంద్రజిత్ గుప్తా కమిటి 4. లా కమిషన్

10. మొట్టమొదటి సారిగా నోటా (NOTA)ను ఏ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించారు?
1. గోవా 2. కేరళ
3. ఢిల్లీ 4. మిజోరాం

11. ఓటు ఎవరికి వేశారో తెలుసుకొనే పద్ధతిని తొలిసారి ఏ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు?
1. నాగాలాండ్ 2. మణిపూర్
3. ఢిల్లీ 4. గోవా

12. మన దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను ఏ సంవత్సరం లో డిజైన్ చేశారు?
1. 1946 2. 1952
3. 1980 4. 1984

13. ప్రధాన ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన తొలి తెలుగు వారు?
1. విఎస్ రమాదేవి
2. కె. నాగేంద్రసింగ్
3. ఆర్‌విఎస్ పేరిశాస్త్రి 4. కెవికె సుందరం

14. ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టిన కమీషనర్...
1. TN శేషన్ 2. జీవి లింగ్డో
3. రమాదేవి 3. ఖఎఖ సుందరం

15. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఖర్చులు, ఖాతాల ఆడిట్, నివేదికను ఎన్నికలు ముగిసిన ఎన్నిరోజుల లోపు కమీషన్‌కు సమర్పించాలి.
1. 30 రోజులు 2. 10 రోజులు
3. 15 రోజులు 4. ఏదీకాదు

16. భారత రాజ్యాంగంలో ఏ అధికరణ అడ్వకేట్ జనరల్ గురించి తెలియజేస్తుంది.
1. 76 2. 165 3. 156 4. 172

17. కింది వాటిలో అడ్వకేట్ జనరల్ గురించి సరైనది/ సరైనవి గుర్తించండి.
1. అర్హతలు రాష్ట్రపతి నిర్ణయిస్తారు.
2. గవర్నర్ విశ్వాసం మేరకు పదవిలో ఉంటారు
3. 1&2 4. ఏదీకాదు

18. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి అడ్వకేట్ జనరల్ ఎవరు?
1. నరసరాజు 2. ప్రకాశ్ రెడ్డి
3. రామకృష్ణారెడ్డి 4. ఎవరూకాదు

19. కింది వాటిలో సరికానిది/సరికానివి ఏది?
1. రాష్ట్రపతి అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తారు
2. అడ్వకేట్ జనరల్‌ను గవర్నర్ తొలగిస్తారు
3. 1&2 4. ఏదీకాదు

20. అటార్నీ జనరల్ అనే పదవిని తొలిసారిగ ప్రవేశపెట్టిన చట్టం ఏది?
1. చార్టర్ చట్టం 1833 2. చార్టర్ చట్టం 1853
3. భారత ప్రభుత్వ చట్టం 1935
4. భారత కౌన్సిల్ చట్టం 1861

21. అటార్నీ జనరల్ వేతనాన్ని నిర్ణయించేవారు?
1. పార్లమెంట్ 2. రాష్ట్రపతి
3. ప్రధానమంత్రి 4. పై ఎవరూకాదు

22. కింది వాటిలో సరైన వాక్యం/ వాక్యాలు ఏవి?
ఎ. అటార్నీ జనరల్ ను పార్లమెంట్ 2/3 వంతు మెజార్టీతో తొలగిస్తారు.
బి. అటార్నీ జనరల్ రాజీనామాను రాష్ట్రపతికి సమర్పిస్తారు
1. బి మాత్రమే 2. ఎ, బి
3. ఎ మాత్రమే 4. ఏదీకాదు

23. కింది వాటిలో సరికానిది/ సరికానివి గుర్తించండి.
ఎ. అటార్నీ జనరల్ వేతనాన్ని భారత సంఘటిత నిధి నుండి చెల్లిస్తారు.
బి. అటార్నీ జనరల్ వేతనం రూ. 2.25,000
సి. అటార్నీ జనరల్ వేతనానికి ఆదాయపన్ను కూడా ఉంటుంది.
1. ఎ, సి 2. బి, సి
3. ఎ మాత్రమే 4. ఎ, బి, సి

24. మొట్టమొదటి అటార్నీ జనరల్ ఎవరు?
1. సికె దప్తరి 2. సోలీ సోరాబ్జి
3. ఎమ్‌సి సెటల్వాడ్ 4. ఎవరూ కాదు

25. తొలి సొలిసిటర్ జనరల్ ఎవరు?
1. సికె దప్తరి 2. సోలీ సోరాబ్జి
3. MC సెటల్వాడ్
4. తుషార్ మెహతా

26. భారత రాజ్యాంగంలో కాగ్ గురించి తెలియజేసే ఆర్టికల్స్ ఏవి?
1. 141-151 2. 152-237
3. 148-151 4. ఏదీకాదు

27. కాగ్ తమ రాజీనామా పత్రాన్ని ఎవరికి సమర్పిస్తారు?
1. పార్లమెంట్ 2. రాష్ట్రపతి
3. ప్రధానమంత్రి 4. ఎవరూకాదు

28. కింది వాటిలో సరైన వాక్యం/వాక్యాలు గుర్తించండి.
ఎ. కాగ్ అర్హతలను రాష్ట్రపతి నిర్ణయిస్తారు.
బి. కాగ్‌గా నియమించిన వ్యక్తికి 10 సంవత్సరాల పరిపాలన అనుభవం ఉండాలి
1. బి మాత్రమే 2. ఎ మాత్రమే
3. ఎ, బి 4. ఏదీకాదు

29. "కాగ్" ను భారత రాజ్యాంగంలో అత్యున్నత, ముఖ్యమైన అధికారిగా పేర్కొన్నవారు.
1. నెహ్రూ 2. అంబేద్కర్
3. వల్లభాయ్ పటేల్ 4. దీచీ రావ్

30. పబ్లిక్ కమీషన్లను ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించాము.
1. కెనడా 2. బ్రిటిష్ 3. ఐర్లాండ్ 4. అమెరికా

31. లీ కమీషన్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1. 1928 2. 1920 3. 1956 4. 1923

32. కింది వాటిలో సరైనది/ సరైనవి ఏవి?
ఎ. యుపిఎస్‌సి ఛైర్మన్ మరియు సభ్యుల పదవీకాలం 6 సంవత్సరాలు లేదా 62 సంవత్సరాలు ఏది ముందు అయితే అది వర్తిస్తుంది.
బి. యుపిఎస్‌సి ఛైర్మన్ సభ్యుల అర్హతలు నిర్ణయించేది రాష్ట్రపతి
1. ఎ, బి 2. ఎ మాత్రమే
3. బి మాత్రమే 4. ఏదీకాదు

33. ఈ కింది ఏయే సందర్భాల్లో సుప్రీంకోర్టు విచారణ లేకుండా పదవీ కాలం మధ్యలోనే రాష్ట్రపతి యుపియస్‌సి ఛైర్మన్ సభ్యులను తొలగిస్తారు.
1. ఇతర ఉద్యోగం చేపట్టినపుడు
2. జైలు శిక్షకు గురి అయినపుడు
3. దివాలా తీసినపుడు 4. పై అన్నీ

34. యుపియస్‌సి తన వార్షిక నివేదికను ఎవరికి సమర్పిస్తుంది?
1. పార్లమెంట్ 2. ప్రధానమంత్రి
3. రాష్ట్రపతి 4. కేంద్రహోంశాఖ

35. మొట్టమొదటి యుపియస్‌సి ఛైర్మన్ ఎవరు?
1. అల్కాసి రోహి 2. హెచ్.కె.కృపలాని
3. కానియా 4. రజనీ రజ్దాన్

సమాధానాలు

1.2	2.2	3.1	4.3	5.2
6.2	7.4	8.2	9.1	10.3
11.1	12.3	13.3	14.1	15.3
16.2	17.2	18.1	19.2	20.1
21.2	22.1	23.2	24.3	25.1
26.3	27.2	28.1	29.2	30.2
31.4	32.3	33.4	34.3	35.2

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ అఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవం నవంబర్ 5



ప్రతి ఏడాది నవంబర్ 5న సునామీ అవగాహన కోసం ప్రపంచ అవగాహన దినోత్సవం నిర్వహిస్తారు. సునామీలు, భూకంపాలు, అగ్ని పర్వత విస్ఫోటనాలు, కొండ చరియలు విరిగి పడటం లాంటి వాటి వల్ల చరిత్రలో లెక్కలేనన్ని ప్రాణాలను కోల్పోయారు. సునామీ అవగాహన దినోత్సవం సునామీకి కారణాలు ప్రభావాలు, తగ్గించే ఉపాయాలు మొదలైన విషయాలపై అవగాహన కల్పిస్తారు. 2023 థీమ్ 'స్థితి స్థాపక భవిష్యత్ కోసం అసమానతలతో పోరాటం'.

కోల్‌కతలోని రాజ్‌భవన్‌లో ఉన్న 'త్రోన్‌రూమ్'కు పేరు మార్పు



బ్రిటిష్ కాలం నాటి వైభవానికి గుర్తుగా నిలిచే కోల్‌కతాలోని ఇకానిక్ 'సింహాసన గది'కి స్వతంత్ర భారత తొలి ప్రధాని, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టడం జరిగింది. పటేల్ నెలకొల్పిన ఐక్యత సమగ్రతకు ప్రతీకగా ఈ త్రోన్ రూమ్‌కు ఇప్పుడు 'సర్దార్ వల్లబాయ్ పటేల్ యూనిటీ రూమ్'గా పేరు పెట్టారు.

మిచెల్ డగ్లస్‌కు - సత్యజిత్ రే అవార్డు



హాలివుడ్ నటుడు, నిర్మాత డగ్లస్‌కు సత్యజిత్ రే జీవిత సాఫల్య పురస్కారం లభించింది. 54వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. కేంద్ర, సమాచార ప్రసారశాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ దీనిపై ప్రకటన చేసారు.

ఎన్నికల నిర్వహణకు 'ఎన్ కోర్' సాఫ్ట్‌వేర్

భారత ఎన్నికల సంఘం 'ఎన్‌కోర్' పేరుతో ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. ఈ సాఫ్ట్‌వేర్ రియల్ టైమ్ ఎన్విరాన్‌మెంట్‌పై కమ్యూనికేషన్‌ను ప్రారంభించనుంది. ఈ సాఫ్ట్‌వేర్ ఎన్నికల సమయంలో కార్యకలాపాలు సజావుగా జరగడం కోసం అనేక రకాల పేచర్లను అందిస్తుంది. ఎన్‌కోర్ సాఫ్ట్‌వేర్ రిటర్నింగ్ అధికారులకు వివిధ రకాల ఎన్నికల విధులను నిర్వర్తించడానికి, అభ్యర్థి నామినేషన్ నుంచి ఓటర్ ట్రాకింగ్ ఓట్ల లెక్కింపు, ఫలితాలు, డేటా నిర్వహణ వరకు సమగ్ర వేదికను అందించనుంది.

డార్క్ వెబ్‌లో 81.5 కోట్ల భారతీయుల వివరాలు లీక్



81.5 కోట్ల భారతీయుల వివరాలు డార్క్ వెబ్‌లో లీక్ అయినట్లు అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ "రీ సెక్యూరిటీ" వెల్లడించింది. లీకైన డేటాలో పేర్లు, వయసు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్స్ వంటివి ఉన్నట్టు సమాచారం. అక్టోబర్ 9న PWNOOL పేరుతో ఒక హ్యాకర్ 8:15 కోట్ల భారతీయుల ఆధార్, పాన్, పాస్‌పోర్ట్ రికార్డ్స్ యాక్సెస్ పొందినట్లు రిసెక్యూరిటీ పేర్కొంది. ఈ డేటా వివరాలు 8000 డాలర్లకు విక్రయించడానికి సిద్ధమయినట్లు సమాచారం. దీని వల్ల బ్యాంకింగ్ దోపిడీలు, టాక్స్ రిఫండ్ మోసాలు, ఇతర ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం వుంది.

Chang maker of the year



అంతర్జాతీయ క్లిష్ట పరిస్థితులలో భారత్ ఆర్థిక పటిష్టతకు తన వంతు కృషి చేస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మక 'చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్' టైటిల్‌ను గెలుచుకుంది. ది హిందు బిజినెస్ లైన్ చేంజ్ మేకర్ అవార్డు 2023కు సంబంధించి గవర్నర్ శక్తికాంత్‌దాస్ నేతృత్వంలోని ఆర్‌బిఐ ఈ గుర్తింపు పొందినట్లు ఒక ప్రకటన వెలువడింది. డెయిరీ సంస్థ అమూల్‌కు 'ఇకానిక్ చేంజ్ మేకర్' గుర్తింపు లభించింది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనకు 'చేంజ్ మేకర్ - ఫైనాన్షియల్ ట్రాన్స్‌పర్మేషన్' అవార్డు పొందింది.

పాకిస్తాన్‌లో మెదడును తినే అమీబా

పాకిస్తాన్ కొత్త సమస్యను ఎదుర్కొంటుంది. పలు రాష్ట్రాలలో మెదడును తినే అమీబా బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. 'నెగ్లేరియా ఫౌకెరి' అని పిలిచే ఈ ఏక కణజీవి సెంట్రల్ డిస్ట్రిక్ట్‌లో గల రెండు వారాలలో ఈ అమీబా కారణంగా ముగ్గురు మరణిం చారు. ఇది అరుదైన ప్రాణాంతక అమీబా అని ఇది మంచి నీటి వనరులలో అభివృద్ధి చెందుతుందని, క్లోరినేషన్ చేయని కొలనులలో ఈతకు దూరంగా వుండాలని



ఆరోగ్య శాఖ సూచించింది. ఇది కొలనులు, నదులు, కాలువలు చెరువుల్లో వుంటుంది. ముక్కు నోరు చెవి ద్వారా లోపలికి ప్రవేశించి మనిషి మెదడును తినేస్తుంది. 2018 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 381 మంది దీని మూలంగా మరణించారు.

రెడ్ లైట్ ఆన్ వెహికిల్ ఆఫ్

ఢిల్లీలో ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా I TO కూడలిలో "రెడ్ లైట్ ఆన్ - వెహికిల్ ఆఫ్" అనే ప్రచారాన్ని ప్రారంభించారు.



మొత్తం 70 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఈ ప్రచారం కొన సాగింది. 2020లో దీనిని ప్రారంభించారు.

పాలిటెక్నిక్‌లో పడిపోతున్న ప్రవేశాలు



కొలువులో త్వరగా స్థిరపడాలన్నా, ఇంజనీర్‌గా ఎదగా లన్నా, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేసేది పాలి టెక్నిక్ విద్య. ఈ కోర్సులో నైపుణ్యం ఉంటే స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు త్వరగా లభించే అవకాశం ఉండడంతో ఆర్థిక స్థోమత లేని తల్లి దండ్రులు తమ పిల్లల్ని ఎక్కువగా ఇందులో చేర్పిస్తున్నారు. ర్యాంకు షర తులు లేకుండా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పిల్లలకు పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ కూడా ప్రభుత్వం ఇవ్వడం కూడా మరొక కారణం.అయితే ఇతర రాష్ట్రాలలో ఈ కోర్సుకు గత కొన్ని దశాబ్దాలుగా డిమాండ్ కొనసాగుతుండగా తెలంగాణ రాష్ట్రంలో కొన్ని అనుచిత నిర్ణయాలతో దశల వారీగా పడిపోతున్నది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక కోర్సులు ప్రవేశ పెడుతున్నా అవి కొన్ని కళాశాలలకు పరిమితం కావడంతో పాలిటెక్నిక్ విద్యార్థులు ఎక్కువగా సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులైన సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ వంటి కోర్సు ల్లో ప్రవేశం పొందవలసి వస్తున్నది. అయితే ఈ కోర్సులలో చేరే విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లి పోయిన నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య ఏయేడుకాయేడు పడిపోతున్నది. దీంతో ప్రవేశాలు లేక పోవడంతో పాటు ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు కూడా ప్రభుత్వం నుండి సకాలంలో విడుదల కాకపోవడం మూలాన చాలా పాలిటెక్నిక్ కళాశాలలు మూతపడగా కొన్ని పాలిటెక్నిక్ కళాశాలలు ఈ కోర్సును రద్దు చేసుకుని బిటెక్ వంటి ఇంజనీరింగ్ విద్య బోధించడానికి అప్ గ్రేడ్ అవుతున్నాయి. ఓపెన్ బుక్ పాలసీ, రెండేళ్లకే ఇంటర్ తత్సమాన ధృవీకరణ పత్రం ఇస్తా మంటూ పాలి టెక్నిక్ విద్యను బతికించడానికి కొన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సత్ఫలితాలు ఇవ్వడంలేదు.

అక్కరలేని బయోమెట్రిక్ హాజరు నిబంధన

మూడేళ్ళ పాలిటెక్నిక్ విద్యను ఆరు సెమిస్టర్‌లుగా విభజించారు. పాలిటెక్నిక్ కోర్సులో చేరిన వ్యక్తి ఒక్కొక్క సెమిస్టర్ దాటుకొని వెళ్ళాలంటే దినదినగండం నూరేళ్లాయుష్షుగా మారింది. విద్యార్థికి 75 శాతం హాజరు నిర్దేశించిన క్రెడిట్‌లు రాకుంటే ముందు సెమిస్టర్‌లోకి ప్రమోట్ చేయరు. చాలా పాలిటెక్నిక్ కళాశాలల్లో అవసరమైనంత ఫ్యాకల్టీ లేదు. స్థోమత ఉన్న వారు ఫ్యాకల్టీ లేని సబ్జెక్ట్‌లను ప్రైవేట్‌గా నేర్చుకుందామంటే కళాశాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ సహకరించదు. ఎందుకంటే ఒక ముద్రకు మరొక ముద్రకు మధ్య ఖచ్చితంగా ఆరు గంటల వ్యవధి ఉండాలి. కొన్ని కళాశాలల్లో నూటా ఇరవై మంది విద్యార్థులకు ఒకటి బయోమెట్రిక్ యంత్రం ఉంటుంది. చార్జింగ్ ఉంటే ఇంటర్ నెట్ సిగ్నల్ దొరకదు. ఇంటర్ నెట్ ఉన్నప్పుడు చార్జింగ్ అయిపోతుంది. ఇన్ని ఆటంకాలు దాటుకొని పొద్దునా, సాయంత్రం ఇన్ - అవుట్ పడే సరికి రెండు గంటలు వృధాగా గడిచిపోతోంది. ఇలా ప్రతి సెమిస్టర్ దాటుకొని ఇంటర్ మీడియట్ కు, ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుటకు లేని ఈ కఠినమైన నిబంధన ఆన్‌లైన్ క్లాసులతో విద్య విధానం నడుస్తున్న ఈ తరుణంలో కూడా సాధారణ పాలి టెక్నిక్ విద్యకు అమలు చేయడంలో ఔచిత్యమేమిటో అర్థం కాదు. మరో కారణం పరీక్షా విధానం. ఒక్క సెమిస్టర్ పాస్ కావాలంటే కనీసం నలభై పరీక్షలు రాయాలి. ఒక సెమిస్టర్‌కు 90రోజులు పనిదినాలనుకుంటే అందులో 40 రోజులు పరీక్షలు రాయడానికే సరిపోతాయి. ఇంత కఠినమైన పరీక్షా విధానం అమల్లో ఉండగా అనవసరమైన 75 శాతం హాజరు నిబంధన ఎందుకో అర్థం కాదు.

కొరవడిన సమన్వయం-విద్యార్థులకు నష్టం

మరో పక్క తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు, డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మధ్య సమన్వయం కొరవడింది. నోటిఫికేషన్‌లన్నీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జారీ చేస్తున్నా నిర్ణయాలు మాత్రం డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తీసుకుంటుంది. కళాశాలల మధ్య విద్యార్థుల బదిలీలకు ఈ విద్యా సంవత్సరంలో ఆగస్ట్ 2023 వరకు డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతినిచ్చింది. దీంతో విద్యర్థులు కళాశాలల్లో చేరడం, హాజరు నమోదు కొరకు బయోమెట్రిక్ ఐడి జెనరేట్ చేయడం సెప్టెంబర్ 2023 వరకు కొనసాగింది. ఈ మధ్య కాలంలో తెలంగాణ రాష్ట్రమంతటా భారీ వర్షాలు, వరదల వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడడంతో ప్రభుత్వం కార్యాలయాలకు, విద్యా సంస్థ లకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కళాశాలలో బదిలీపై చేరే విద్యార్థుల ప్రవేశాల్లో జాప్యం జరిగింది. అయినప్పటికీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 75 శాతం హాజరు ఉన్న వారే పరీక్ష ఫీజు చెల్లించడానికి అర్హులంటూ పరీక్షల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధన కారణంగా పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు ప్రారంభమై పదిరోజులు గడిచిపోయినా కొన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఫీజు చెల్లించడానికి అర్హత పొంలేకపోయాడంటే ఇది ఎంతటి కఠినతరమైన నిబంధనో స్పష్టంగా అర్థమవుతున్నది. బాధాకరమైన విషయం ఏమిటంటే ఈ విద్యా సంవత్సరం ఆఖరి పని దినం నాటికి కూడా హాజరు శాతం తక్కువై సగానికి పైగా విద్యార్థులు పరీక్ష రాయడానికి అనర్హులు కానున్నారు. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులను నవంబరు ఒకటి నుండి ప్రారంభం కానున్న పరీక్షలకు హాజరు కానివ్వమని కొన్ని విద్యా సంస్థలు ఖరాఖండిగా ప్రకటించేశాయి. దీంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది.

హాజరు శాతం పెంచుకోవడానికి ఇవ్వని అవకాశం

హాజరు శాతం తక్కువైన కారణంగా విద్యార్థులు నష్టపోరాదని గతంలో డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సముచితమైన నిర్ణయాలు తీసుకుంది. వేసవి సెలవుల్లో ప్రత్యేక క్లాసులు తీసుకొని హాజరు శాతం పెంచుకోవడానికి అవకాశాలు కల్పించారు. కరోనా కాలంలో హాజరు శాతం నిబంధన పూర్తిగా ఎత్తి వేశారు. ఆ తరువాతి సంవత్సరంలో సాధారణ సెలవు దినాలలో, దసరా సెలవుల్లోనూ బయోమెట్రిక్ యంత్రంలో హాజరు శాతం నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో చాలా మంది విద్యార్థులు డిటెన్షన్ ప్రమాదం నుండి బయటపడగలిగారు. ఈ దఫా అలాంటి అవకాశాలేవీ కల్పించే దిశగా ఎలాంటి ప్రయత్నం చేయకపోవడంతో చాలా మంది పాలిటెక్నిక్ విద్యార్థులు నష్టపోతున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఒక వేళ అవకాశం ఇచ్చినా 2,4,6,(ఈవెన్) సెమిస్టర్లు చదువుతున్న విద్యార్థులకే పరిమితం చేయనుండడంతో 1,3,5 (ఆడ్) సెమిస్టర్లు చదువుతున్న వారు పూర్తిగా ఒక విద్యా సంవత్సరం నష్ట పోనున్నారు.

కలవరపడుతున్న విద్యార్థులు

మొత్తం పని దినాలు పూర్తయ్యే నాటికి కూడా హాజరు శాతం సరిపోక వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంలో పడింది. తదుపరి సెమిస్టర్ కు వెళ్ళడానికి అనర్హులు కాబోతున్నామనే బెంగతో వారంతా కలవరపడుతున్నారు. డిసెంబర్ 11,2023 నుండి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హాజరు శాతం సడలించే విషయంలో డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోకుంటే వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోనున్నారు. ఇదే జరిగితే రాబోయే విద్యా సంత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో పాలి టెక్నిక్ విద్య మనుగడ ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు.

- కొయ్యడ కుమారస్వామి, 9441153810

వేదిక

కమ్యూనిస్టుల గెలుపు చారిత్రక అవసరం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) పోటీ చేయడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మేనిఫెస్టో ప్రకటిం చడం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. గత ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) పేరుతో ఎన్నికల బరిలోకి దిగిన పార్టీ ఈసారి ఒంటరిగా, అదీ 19 స్థానాల్లో పోటీ చేయడంతో పాటు ప్రచారంలో దూసుకుపోతుండటం పట్ల కమ్యూనిస్టులు, సానుభూతి పరులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో ఆయా సందర్భాల్లో పొత్తుల వ్యవహారాలు చాలామందిలో కొంత అసహనానికి గురిచేశాయి. మతోన్మాద బీజేపీని ఓడించేందుకు మునుగోడులో బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకుని కమ్యూనిస్టులు విజయవంతమయ్యారు. మళ్లీ అదే దిశగా బీఆర్ఎస్ పొత్తులకు సిద్ధపడాలనే సంకేతాలివ్వగా పొత్తు సర్దుబాట్లు ఉంటాయని అందరూ భావించారు. కానీ పాలక పార్టీల నిజస్వరూపం ఈ ఎన్నికల సందర్భంగా బయటపడింది. 'ఏరు దాటేదాక ఓడ మల్లన్న...ఏరు దాటాక బోడ మల్లన్న' అన్న చందంగా బీఆర్ఎస్ వ్యవహరించింది. అయితే ఒకింత ఇది మంచిదేననే అభిప్రాయం ప్రజల నుంచి వస్తోంది. సీపీఐ(ఎం) ఒంటరిపోరుకు సిద్ధమవ్వడంతో వామపక్ష అభిమానులు, కార్యకర్తల



నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ప్రజా సంక్షేమం పట్ల సమగ్ర విధానం కలిగి ఉన్న సీపీఐ(ఎం) ఎన్నికల నినాదాలు నేడు రాష్ట్రంలో ప్రజల్ని కూడా ఆలోచింపజేస్తున్నాయి. అందులో మొదటిది బీజేపీని ఓడించడం. అయితే ఏ పార్టీ అయినా గెలుపు కోసం ప్రయత్నిస్తుంది కానీ, పక్కవాళ్ల ఓటమే లక్ష్యంగా పనిచేయదు. ఈ క్రమంలో సీపీఐ(ఎం) మొదటి ఎత్తుగడే బీజేపీని ఓడించడం అన్నది ఎందుకానేది ప్రజలకు అర్థం కావాల్సిన అవసరం ఉంది. అది మతతత్వ పార్టీ గనుకనే మునుగోడులో బీజేపీని ఓడించడానికి సీపీఐ(ఎం) బీఆర్ ఎస్‌తో పొత్తు పెట్టుకుని అందులో సఫలీకృతమైంది. ఈ దేశంలో ఏ వివక్షా, ఉన్మాదాలు ఉండొద్దని రాజ్యాంగం కోరు కుంటుందో, ఏ సబ్బండ వర్గాల వారికైతే సమన్యాయం దక్కాలని ప్రజాస్వామ్య యుత రాజ్యాంగం కోరుకుంటుందో వాటిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాల రాస్తోంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కోదశలో రైతులను, విద్యార్థులను, కార్మికులను, మీడియాను అణచివేసి, ప్రశ్నించిన వాళ్లందరిని అణగదొక్కింది. ఇదే కాదు.. ఫక్తు మత రాజకీయాలు చేస్తూ.. దేశంలో ముస్లింలే తమ మొదటి శత్రువుగా ప్రకటిస్తూ విద్వాంసాలకు తెరలేపుతు ఉన్మాదంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా దళితులన్నా, వారి గురించి మాట్లాడే సంఘాలన్నా , వారి అభివద్ధికి ఉపయోగపడే పథకాలు, వనరులన్నా బీజేపీ ఏ మాత్రం వాటిని సహించదన్నది వాస్తవం. ఈ ఉన్మాదాన్ని అడ్డుకొనే శక్తి కేవలం కమ్యూనిజానికి ఉంది. అది కేవలం తెలంగాణలో కాదు. ప్రపంచ చరిత్రలో నిరూ పితమైన వాస్తవం. ఐరోపా, ఆసియా, లాటిన్ అమెరికా దేశా ల్లో మతాధికారులు, పెట్టుబడిదారులు రాజ్యమేలుతూ జనాల సంక్షేమాన్ని వదిలేసి, పేదలను పీడిస్తుంటే వాటికి వ్యతిరేకంగా నిలబడి, పోరాడి ప్రజాస్వామ్య, లౌకిక, కార్మిక, పేదల సంక్షేమ ప్రభుత్వాలను నెలకొల్పింది కమ్యూనిజమే అన్నది చారిత్రక సాక్ష్యం. ముందు ఉన్మాదాన్ని అడ్డుకోవడం ద్వారానే అది సాధ్యం.

ఇలా దేశంలో బీజేపీ ఉన్మాద భావాలను అడ్డుకొనేందుకు కమ్యూనిస్టు పార్టీ అవసరం. కమ్యూనిస్టు పార్టీల విజయాలు, కేవలం సీట్లు గెలుచుకొని చట్టసభల్లోకి వెళ్లడంలోనే ఉండదు. ప్రజలకు నష్టం కలిగించే శక్తులను అడ్డుకోవడంలోనే ఉంటుందని సీపీఐ(ఎం) తెలంగాణ సెక్రటరీ తమ్మినేని మాటల్లో స్పష్టమవుతోంది. ఆ పార్టీ రెండో నినాదం లెఫ్ట్ పార్టీలు చట్టసభల్లో ఉండటం. ఈనాటి చట్టసభ ప్రభువుల వారికి ఆస్థాన విద్వాంసులతో నిండి ఉంది. సమస్యలపై మాట్లాడే వారి కన్నా.. వారి నాయకున్ని గాల్లోకి ఎత్తే ఉపన్యాసాలతో ప్రగల్భాలు పలికే వారితో నిండిపోతోంది. ఈ క్రమంలో ప్రజల గొంతు వినిపించడానికి, ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించడానికి ప్రతినిధులు ఉండాలి. ఆ ప్రతినిధులు కమ్యూనిస్టులు కావాలని ఈ పార్టీ నేత చెప్పడం హర్షనీయం. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కమ్యూనిస్టులు లేని అసెంబ్లీ సమావేశం లేదు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో కూడా కమ్యూనిస్టులు లేని సభలు ఊహిం చకూడదు. కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించే బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఎంతైనా ఉన్నది. వారి గెలుపు చారిత్రక అవసరం. కమ్యూనిస్టులు గెలిస్తేనే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బతికించుకోగలమనేది వాస్తవం. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే అసెంబ్లీలో కమ్యూనిస్టులు ఉండాలి. ఈ దిశగా తెలంగాణలో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయమిది. అడుగులు వేయాల్సిన తరుణమిది.

- వినోద్ మామిడాల, 7660066469

నాయకుడంటే..?

తెలంగాణ శాసనసభకు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులంతా ఖరారయ్యారు. అన్ని పార్టీలు తమ జాబితాను వెల్లడించాయి. ఆ మేరకు అభ్యర్థులకు బి ఫారములు ఇచ్చింది. తమ తమ స్థానాల్లో అభ్యర్థులు ప్రచారజోరును పెంచుతున్నారు. కీలక పోరు, ప్రచారహోరు ఊపందుకొని దూసుకుపోతున్నారు. ప్రజా పాలకులంటే? ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రజలు ఎన్నికల్లో ఓట్ల ద్వారా ఎన్నుకోగా పాలకులుగా అధికార పీఠాన్ని అధిష్టిస్తారు. పాలకుల్ని ప్రజలు మోస్తున్నా ప్రజలందరినీ వారు బాధ్యతగా చూసుకోవాలి. ప్రజల కష్టాలను తొలగించి సంక్షేమ, సమ్మిళిత, సమ సమాజాన్ని నిర్మిస్తూ పాలితుల రక్షణ బాధ్యతలు చేపట్టాలి. కన్న తండ్రి ఎలా బాధ్యతతో ఉంటాడో అలా ఉంటూ ప్రజల ప్రీతి పాత్రుడవ్వాలి. 'బిడ్డ ఏడుపు విన్న తల్లి ఎలా పరిగెడుతుందో.. అలా ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు నాయకుడు అలా పరుగెత్తాలి' అన్నాడు చైనా నేత మావో. అలాంటి వారే నిజమైన ప్రజా సేవకులు. మంచికై పరితపించడం, ముక్కుసూటితనం నిజమైన నాయకుడి నైజం. ఎన్ని అభివృద్ధి పనులు చేసినా ఓర్పు కలిగి ఉండాలి. ఎలాంటి స్వార్థం లేకుండా మంచి పనులు చేయాలి. ప్రజాపాలనంటే.. కల్లబొల్లి మాటలు చెప్పడం కాదు? పారదర్శకమైన ఆచరణే ఆ నాయకున్ని రక్షిస్తుంది. లేకుంటే ఎంతటి నాయకుడైనా ఓటర్ల మన్నన పొందనప్పుడు అగాధంలో పడిపోక తప్పదు. ఇదంతా ఆదర్శానికేనా.. ఆ రాత పూతలకేనా! ఈ ప్రశ్న పాతదైనా నేటికి ఎప్పటికి ప్రశ్నలు ప్రశ్నలు గానే మిగిలి పోతున్నాయి. వామపక్షాల పరిపాలనలో ఉన్న కేరళలో తప్ప ఆదర్శ పాలన అనేది దేశంలో ఎక్కడా కానరాదు.

మన రాష్ట్రంలో రాజకీయ పార్టీ(నేత)లు ఈ ఎన్నికల్లో వేస్తున్న ఎత్తులు, జిత్తులన్నీ ప్రజలను ప్రలోభ పెట్టి, అమలు కాని హామీలతో అధికారపక్షం అధికారాన్ని నిలుపుకోవడానికి, ప్రతిపక్షం ఏదోలా అధికారాన్ని చేపట్టడానికి ప్రజలపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్నారు. కులం, మతం, వర్గాల వారీగా జనాన్ని ప్రసన్నం చేసుకోవడానికి సకల అవస్థలు పడుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుంటే? ప్రచారహోరు, విమర్శల జోరు పెంచుకుంటూ అభివృద్ధి మాది అంటే! అవినీతి మీది అని? కాదు మీదేనని ఒకరిపై ఒకరు పార్టీ(నాయకు)లు రాజకీయ బురద చల్లుకుంటున్నారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. ఎందుకంటే ఎదుటి వారి విమర్శలను స్వీకరించడం, అందులో వాస్తవాలను తెలుసుకోవడం, వారు చెప్పేది కరెక్ట్ అనిపిస్తే అది ఆచరించడం మంచి నాయకుడు చేసేపని. కానీ ఒకరిని చూసి ఒకరు అన్నట్టుగా కోట్ల రూపాయలు పోగేసుకోవడం కాదు. నేడు పోటీ చేస్తున్న వారిలో కూడా చాలామంది జాతి సంపదను కొల్లగొట్టిన వాళ్లే?. అభివద్ధి చేశామంటూ చెప్పే నాయకు(పార్టీ)ల చిలుక పలుకులు నేతి బీరలో నెయ్యి చందమే. నిజంగా అభివృద్ధి జరిగింది నాయకులకు మాత్రమే.ఇలాంటి వారు మన నాయకులుగా చెలామణి అవడం శోచనీయం.

నేడు జరుగు తున్న ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో ఇలాంటి అవకతవకల వల్ల రాత్రికి రాత్రే పార్టీలు మారడం చూస్తున్నాం. ఎన్నికల ప్రచారంలో రాజకీయ పక్షా (నాయకు)లకు దేశం, రాష్ట్రం మీద గాని ప్రజల మీద గాని ఏ



మాత్రమైనా గౌరవ భావం, ప్రేమ, భక్తి ఉంటే? ఏరులై పారుతున్న నల్లధనాన్ని, మద్యాన్ని, ఆల్ ఫ్రీ హామీలను నిరోధించేందుకు రాజకీయల్లో విలువల కోసం చేతులు కలపాలి. రాజకీయ పార్టీలన్నీ ధనవంతులనే ప్రజాప్రతినిధులను చేయాలనుకునే దౌర్భాగ్య సంస్కృతికి చరమ గీతం పాడాలి. జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఆ దిశగా రాజకీయాల్లో నైతిక విలువలు పెంపొందేలా చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. లేకపోతే ఎన్నికలలో పవిత్రత, విలువలు ప్రజాస్వామ్య పరిరక్షణ అందని ద్రాక్ష గానే మిగిలి పోతున్నాయి. డబ్బులతో ఓట్లు కొనుగోలు చేసే హీన సంస్కృతి క్షమించరాని నేరం. అన్ని పార్టీలు తరతమ భేదాలు లేకుండా యధేచ్ఛగా ఆ మహా అపరాధానికి ఒడిగడుతున్నాయి. ఇలా కాసుల మూటలతో జనాన్ని ప్రలోభ పెట్టి పార్టీలు దండుకుంటున్న ఓట్లు దేశానికి తీవ్రంగా చేటు చేస్తున్నాయి. ప్రజాస్వామ్య పాలనలో అధికారం పొందడానికి ప్రజలకు చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలి. గెలిచి పదవిలోకి వచ్చాక మాట తప్పి, మడమ తిప్పుచున్నారు. పార్టీ(నాయకు)లు ఓట్లేసిన ప్రజలను అలా నిలువునా ముంచివేస్తున్నాయి.

జనాన్ని నమ్మించి గొంతు కోసే విధ్వంసక రాజకీయాలకు అడ్డుకట్ట పడాలంటే!. సామాన్యునికైనా సమాన విలువనిచ్చేలా డాక్టర్ అంబేద్కర్ అందించిన "ఓటు" విలువను గుర్తించండి. ప్రజాస్వామ్య సౌధానికి ఓటర్లు పునాదులు. సమాజంలో విలువల రక్షణ కోసం ప్రజలు చైతన్యవంతులై ఉద్యమించకపోతే, ఈ కుళ్ళు నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదు. ప్రలోభాలకు లొంగకుండా కుళ్లు రాజకీయాలు కడిగేసే పథక రచనకు పూనుకోవాల్సింది ముమ్మాటికి ప్రజలే. ఒక్క క్షణం నిర్లక్ష్యం చేయడం వల్ల కోల్పోయిన అవకాశం.. మరో క్షణం నుంచి నీ జీవిత నాశనానికి పునాది అవుతుంది. కాబట్టి నిత్యం జనాల్లో ఉండే పార్టీ, పేదల కోసం పాటుపడే నాయకుల ఎవరని ఆలోచించి ఓటు వేయాలి.పతనమవుతున్న ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి.

- మేదాజీ